

శ్రీ రామకృష్ణ కవి విరచిత

# "శ్రీ మహిషాసురమర్దిని స్తోత్రం"

వ్యాఖ్యానం:

బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గురువు గారు

Etv ఆరాధన october 2012

**పద్మ దిట్టకవి**

శ్రీ గురుభ్యో నమః విద్యార్థిని  సేకరణ

https://www.youtube.com/watch?v=P2t4Jzrj3Lo

# మహిషాసురమర్దినీ స్తోత్రం

**1)అయి - గిరినందిని - నందిత మేదిని - విశ్వ వినోదిని - నందినుతే -**

**గిరి వరవింధ్య శిరోధి నివాసిని -విష్ణు విలాసిని -జిష్ణునుతే -**

**భగవతి - హే శితికంఠ కుటుంబిని -భూరి కుటుంబిని -భూరికృతే -**

**జయ జయ హే మహిషాసురమర్దిని రమ్య - కపర్దిని- శైలసుతే**

1అయి =అమ్మా ,అయి ఐ వాగ్భవ బీజం.

2.గిరి నందిని పర్వత రాజ పుత్రి 3.నందిత మేదిని

మేదిని = భూమి,

నందిత=ఆనందపరిచే శక్తి

భువనాలను ఆనందింప చేయు తల్లి,

4.విశ్వ వినోదిని =బాలా లీలా వినోదిని

5.నంది నుతే =నంది చేత నుతింపబడినది నమస్కరింపబడు తల్లి.

"నంది విద్యా నటేశ్వరి" ఉపాసకులు అందరూ నందులే, ఆనంద భావంతో వున్నవారు ఉపాసిస్తారు కనుక నందినుతే

6.గిరి వర= శ్రేష్ఠమైన పర్వతం వింధ్య పర్వతం

7.శిరోధి =శిఖరంపై అధివసించిన తల్లి పులి మీద వున్న దుర్గాదేవి.

8.విష్ణు విలాసిని = విష్ణు మాయా స్వరూపిణి "యా దేవీ సర్వ భూతేషు విష్ణు మాయేచ సంస్థిత నమస్తస్యై నమో నమః"

9.జిష్ణునుతే =ఇంద్రుని చేత నుతింపబడినది "దేవకార్య సముద్యతా"

10.భగవతీ= షడ్గుణైశ్వర్య సంపన్నురాలు. జ్ఞానము ఐశ్వర్యము ధర్మము యశస్సు వైరాగ్యము కీర్తి.

11.శితి కంఠ =తెల్లని కంఠము లోక రక్షణ కోసం నీల కంఠుడు అయ్యాడు దయకు సంకేతం ఆ కంఠం

11.శితి కంఠ కుటుంబిని =శివుని ఇల్లాలు,శివ కుటుంబిని

12.భూరి = విశాలమైన కుటుంబము కలది,భూరి కుటుంబిని = విశ్వమే అమ్మ ఇల్లు కన్నతల్లి.

13.భూరి కృతే = గొప్ప గొప్ప కార్యములు చేయునది సృష్టి స్థితి లయ తిరోధానము అనుగ్రహము.

*****************************************

2)సురవర వర్షిణి-దుర్ధర ధర్షిణి- దుర్ముఖ మర్షిణి-హర్షరతే
త్రిభువన పోషిణి - శంకర తోషిణి - కల్మష మోషిణి - ఘోర రతే
దను జని రోషిణి - దుర్మద శోషిణి -- దుఃఖ వినాశిని- సింధుసుతే
జయ జయ హే మహిషాసురమర్దిని రమ్య - కపర్దిని- శైలసుతే.

1.సురవర వర్షిణి=దేవతలకు వరములను వర్షించే తల్లి-వర్షించుట అంటే కురిపించుట "వాంఛా సమధికం" - సురలు=లోకములకు ఉపకారము కలిగించే స్వభావము కలవారు,అటువంటి వారు అమ్మ దయకు పాత్రలు. 2.దుర్ధర ధర్షిణి =ఎదుర్కొనుట,భయమ కలిగించుట,దెబ్బతీయుట, చండీ సప్త శతి లో తెలియచేసిన దుర్ధరుడు,దుర్ముఖుడు అను రాక్షసులను సంహరించిన తల్లి దుర్గాదేవి.

దుర్ధరములు =భరించలేని కష్టాలు,భరించలేని బాధలు.-దుర్ధర ధర్షిణి =భరించలేని కష్టాలు,భరించలేని బాధలను తొలగించునది.

దుర్ముఖులు = మనలో వున్న, బయట వున్న "దుష్ట స్వభావములను నశింపచేయునది"

3.హర్షరతే - లోకములకు ఆనందము కలిగించటంలో ఆసక్తి కలది అమ్మ దుర్గాదేవి

4.శంకర తోషిణి - శివునకు ఆనందము కలగించే తల్లి

5.ఘోర రతే =దనుజులను సంహరించేటపుడు తనయొక్క ప్రతాపం రూపం చూపించే తల్లి

హర్షరతే - ఘోర రతే - దుఃఖ వినాశిని ఈ మూడింటిని మనం సమన్వ పరచి చూస్తే ఆమె యొక్క ఘోర అఘోర ఉభయస్వరూపము యొక్క ప్రయోజనము దుఃఖములను నశింపచేయుట.

6.దను -జని -రోషిణి = దను అనే ఆమె యొక్క పుత్రులు

దనుజులు,దానవులు,దైత్యులు,- రోషిణి =వారి పట్ల కోపమును,క్రోధమును

చూపించి 7.దుర్మద శోషిణి మదమును ఎండగట్టినది బ్రహ్మాండ పురాణం లో

దుర్మదుడు అనే రాక్షసుడిని సంహరించిన తల్లి,మనలో వున్న

ఆధ్యాత్మికంగా ఎదగనివ్వని పొగరు ను అణచే తల్లి దుర్గాదేవి

8.సింధు సుతే=సముద్ర తనయ లక్ష్మీ దేవి అని అర్థం

దుర్గమ్మ అంటే  అమ్మలగన్న యమ్మ ముగురమ్మల మూలపుటమ్మ

ఆవిడే సరస్వతీ ఆవిడే లక్ష్మీ ఆవిడే దుర్గ.నిజానికి ముగ్గురు లేరు. ఉన్నది ఒకే శక్తి. లోక రక్షణ కోసం మూడు రూపములు ధరించింది.

సౌందర్యలహరి:

1.గిరామాహు-ర్దేవీం ద్రుహిణగృహిణీ-మాగమవిదో

హరేః పత్నీం పద్మాం హరసహచరీ-మద్రితనయామ్ |

తురీయా కాపి త్వం దురధిగమ-నిస్సీమ-మహిమా

మహామాయా విశ్వం భ్రమయసి పరబ్రహ్మమహిషి

2.విద్యా ప్రదాన సమయే శరదిందుశుభ్రాం,

లక్ష్మీ ప్రదాన సమయే నవవిద్రుమాభాం,

విద్వేష వర్గ విజయేపి తమాల నీలాం

దేవీం త్రిలోక జననీం శరణం ప్రపద్యే.

విద్యను ఇచ్చేటప్పుడు తెల్లని కాంతులతో వున్న సరస్వతి వి నువ్వే,ఐశ్వర్యాన్ని ఇచ్చేటప్పుడు బంగారు కాంతులతో ప్రకాశిస్తు వున్న లక్ష్మీ వి నువ్వే శత్రు సంహారం చేసేటప్పుడు నీలకాంతులతో వున్న కాళీ గా వుంది నువ్వేనమ్మ.

****************************************

3)అయి - జగదంబ - కదంబవన ప్రియవాస విలాసిని - వాసరతే

"శిఖరి శిరోమణి తుంగ హిమాలయ శృంగనిజాలయ మధ్యగతే"

మధు మధురే మధుకైతవ భంజని కైటభ గంజని రాసరతే

జయ జయ హే మహిషాసురమర్దిని రమ్య కపర్దిని శైలసుతే

1.కదంబవన ప్రియవాస విలాసిని =ఈ కదంబవనం లో అమ్మవారు శ్యామలాదేవి గా ప్రకాశిస్తూ ఉంటారు. మణిద్వీపం లో ముందుగా

నానా వృక్ష మహోద్యాన వనం వుంటుంది. అటు తరువాత

ఐదు కల్ప వృక్ష వనాలు వుంటాయి. అటు తరువాత వస్తుంది కదంబవనం. ఈ కదంబవనం లో అమ్మవారు శ్యామలాదేవి గా ప్రకాశిస్తూ ఉంటుంది. శ్యామలాదేవి వాగ్దేవత జ్ఞాన స్వరూపిణి.ఈ తల్లి దయవల్ల తెలివితేటలు,పలుకులు సంగీతాది విద్యలు అనగ్రహిస్తుంది.విద్యాధి దేవత శ్యామలాదేవి.ఈ తల్లినే కాళిదాసు మహాకవి కీర్తించాడు

ఈమె కూడా దుర్గమ్మ యొక్క రూపమే.

2.వాసరతే=వాసము నందు ఆసక్తి గల తల్లి

వసించుట ఉండుట రతి అంటే ఆనంద భావన.

ప్రతి జీవలలో వసించుటం తో పాటు వసించి ఆనందంగా వుంది. వాసుదేవ తత్త్వం కూడా దీన్నే తెలియచేస్తుంది..

జీవులు అనుభవించే సుఖ దుఃఖాలు ఆవిడకు అంటంటం లేదు.సర్వ జీవుల హృదయాలలో సచ్చిదానంద రూపమైన పరతత్త్వము గా భాసించే తల్లి వాసరతే .

హాసరతే= అసుర సంహారం చేసేటప్పుడు అట్టహాసం చేస్తుంది.భక్తులను అనుగ్రహించేటప్పుడు మందహాసం చేస్తుంది.

మందహాసం లోనూ అట్టహాసం లోనూ ఆనందాన్ని ప్రకటిస్తోంది కనుక హాసరతే కూడా సముచితమే

3.ఈ వాక్యం అంతా ఒకే సంబోధన

"శిఖరి శిరోమణి తుంగ హిమాలయ శృంగనిజాలయ మధ్యగతే"

శిఖరి= శిఖరములు కలది పర్వతము

శిఖరి శిరోమణి పర్వతాలలో కెల్ల గొప్పది

తుంగ =ఉన్నతమైన హిమాలయాలు

శృంగ =శిఖరముపై

"హిమాచల మహావంశ పావనాయై నమో నమః"

మానస సరోవరము హిమవత్ పర్వత శ్రేణిలోనే వుంది.

4.మధు మధురే మధుకైతవ భంజని కైటభ గంజని రాసరతే

మధు మధురే తేనె వలె మధురమైన నామములు చరిత్ర కలిగిన తల్లి.రూప మాధురి,నామ మాధురి,తత్త్వమాధురి, గుణ మాధురి, లీలా మాధురి కలిగిన తల్లి

5.మధు కైతవ భంజని కైటభ గంజని రాసరతే

కైతవము అంటే కపటము మోసమును

భంజించి = గుర్తెరిగి వాడ్ని సంహరించినది.

మధు కైటభ రాక్షసులను సంహరించినపుడు అల్లల్లాడిపోయి

గంజని చేశాడు = కైటభుడు పెడ బొబ్బలు పెట్టి మరణించాడు అమ్మ ధాటాకి.

రాసరతే = రాసము నందు ఆసక్తి కలది.

జగదంబ ఐదు రూపములతో వుంటుందని దేవీ భాగవతం చెపుతున్న విషయం.అవి దుర్గా,లక్ష్మీ, సరస్వతీ, గాయత్రీ ,రాధా దేవి.రాసరతే రాసలీల యందు ఆసక్తి కలిగిన తల్లి.రాధాదేవీ అంటే పరమేశ్వరుని యొక్క హ్లాదినీ శక్తి. ఆనంద శక్తి ప్రేమశక్తి.రాసము అంటే సారమైన వస్తువైన పరబ్రహ్మ పరమాత్ముని యందు ఆసక్తి కలిగిన తల్లి

****************************************

**4)అయి నిజ హుంకృతి మాత్ర నిరాకృత ధూమ్ర విలోచని ధూమ్రశిఖే**

**సమర విశోషిత శోణిత బీజ సముద్భవ శోణిత బీజలతే**

**శివ శివ శుంభ నిశుంభ మహాహవ తర్పిత భూత పిశాచ పతే**

**జయ జయ హే మహిషాసురమర్దిని రమ్య కపర్దిని శైలసుతే.**

వీర రసం,రౌద్ర రసం, భీభత్స రసం,భయానక రసం,అద్భుత రసం.అన్ని రసాలు ఈ శ్లోకం లో వున్నాయి. అమ్మవారు చేసిన భయంకరమైన యుద్ధ కేళిని వర్ణిస్తున్నారు.

నిజ హుంకృతి మాత్ర నిరాకృత ధూమ్ర విలోచన=

హుంకారము మాత్రము చేతనే ధూమ్రలోచనుడు అనే రాక్షసుడిని సంహరించింది అమ్మ.

నిరాకృత =సంహరించిన.ఆవిడ శబ్దం లోనే అసుర సంహార శక్తి వుంది.

అమ్మవారి యొక్క నాద స్వరూపాన్ని ఇక్కడ చూపిస్తున్నారు.ఓంకారాది మంత్రసాధనలు చేయటం ద్వారా మనలో ఆ కళ్ళుమూసుకు పోయేటటువంటి అజ్ఞానము ఏదైతే ఉందో అది తొలగిపోతుంది అని ఇందులోని ఆంతర్యము.

శుంభ నిశుంభలు సంహారినికి ముందుగా హుంకార మాత్రము చేతనే ధూమ్రాక్షుడిని సంహరించింది అమ్మ.

Copyright@gurujnanam.org

ధూమ్రశిఖే =అగ్ని స్వరూపిణి.అగ్ని కి ధూమ్రశిఖుడు అని పేరు.పొగ వస్తూ మండుతాడు.

ఆ పొగ జట లాగా వుంటే,ప్రకాశం అగ్ని లాగా జాజ్వల్యమానంగా భాసిస్తోంది.అమ్మ జటలు విస్తరించినపుడు నల్లగా వున్నాయి.యుద్ధం చేసేటప్పుడు  కదులుతున్నాయి.కదులుతున్న ఆ కేశములు పొగవలే నల్లగా వుంటూ వుంటే ఆవిడ స్వరూపం అగ్ని లాగా జాజ్వల్యమానంగా వుంది.ఆ స్వరూపాన్ని ఆవిష్కరిస్తున్నారు ధూమ్రశిఖే శబ్దం ద్వారా.అలా అగ్ని వలే ప్రకాశిస్తున్నది తల్లి దుర్గాదేవి.

ధూమ్రలోచనుడు ధూమ్రాక్షుడు రెండూ ఒకటే.

పొగచూరిన కళ్ళ వాడు.పొగచూరిన కళ్ళకు సత్యమేమిటో తెలియదు.అజ్ఞానం తో మోహంతో కళ్ళు మూసుకుపోయిన గుణాన్ని ధూమ్రాక్షుడు అంటారు.మనలో వున్న రాక్షసుడే ఒక్కొక్క దుర్గుణానికి ఒక్కో రాక్షసుడు.అమ్మవారి ఉపాసన ఫలితం సంపదలు పెరిగిపోవటం,అనుకున్నవి జరగటమో కాదు  మనలో వున్న దుర్గుణాలు తొలగిపోయి చిత్తం నిర్మలం అవ్వాలి.

Part 2

4.సమర విశోషిత శోణిత బీజ సముద్భవ శోణిత బీజలతే

విశోషిత=ఎండగట్టిన,శోణిత = రక్తము, శోణిత బీజ అంటే రక్తబీజుడు, రక్త బీజుడి నుండి వచ్చిన శోణిత బీజ లతను అమ్మవారు ఎండగట్టేసింది.రక్త బీజుడు నుండి అనేక రక్త బీజులు ఎలా పుట్టారంటే

Copyright@gurujnanam.org

శోణిత బీజ లత లాగా పుట్టారు.ఆ రక్తబీజుడు కూడా మనలో వుండే రాక్షసుడే.రక్తము అంటే attachment రాగము అనురాగము ఆ మోహము నుండి బోలెడన్ని దుర్బుద్ధులు పుడుతూవుంటాయి.ఒక వస్తువు తో వున్న కూడని మమకారం నుండి అనేక దుర్గుణాలు పుడుతూవస్తాయి.అదే రక్తబీజ అంటే అర్థం.అలాంటి రాగము అనే దుర్గుణాన్ని నశింపచేసేటటువంటి బ్రహ్మవిద్యా స్వరూపిణి అయిన తల్లి దుర్గాదేవి.

అనేక రక్తపు చుక్కలు శోణిత బీజ లత లాగా వుంది.రక్తబీజుడు అనే రాక్షసుడిని సంహరించిన వైనాన్ని ఇందులో చెపుతున్నారు. తన భృకుటి కనుబొమల నడుమ నుండి ఉద్భవించిన కాళీదేవిని ఆజ్ఞాపించింది.వెంటనే కాళీదేవి తన నాలిక చాచి ఆ రక్తబీజుడి రక్తం కిందపడకుండా పానం చేయడం మొదలుపెట్టింది.అప్పుడు సంపుర్ణంగా దుర్గాదేవి ఆ రాక్షసుడిని సంహరించింది.

Part 3

శివ శివ శుంభ నిశుంభ మహాహవ తర్పిత భూత పిశాచ పతే

శివ శివ అని ఆశ్చర్యకరమైన అనుభూతిని తెలియచేస్తున్నారు.శుంభ నిశుంభలతో అమ్మవారు యుద్ధం చేస్తున్నప్పుడు వాళ్ళనుంచి అనేక రకాల సేనలు సేనాధ్యక్షులు ఇత్యాదులు అందరూ వచ్చారు.వారందరినీ అమ్మవారు కేవలం ఆ సింహంపై కూర్చుని సంహరించారు.ఆ సంహరింపబడిన రాక్షసుల మొండెములు తలలు తెగిన కాళ్ళు చేతులు అంతా వేలాడుతూ ఆ సమరభూమి అంతా రక్తం తో తడిసి పోయింది. అలాంటి భయంకరమైన వాతావరణం ఏర్పడింది. అలాంటి సమయంలో పిశాచములు అన్నీ కూడా సంతోషిస్తున్నాయిట.ఎందుకంటే

భూతాలకు పిశాచములులకు ఈ శవాలు రక్తపాతములు చాలా ఆనందం కలిగిస్తాయి.అవి సంతోషించేలా శుంభ నిశుంభలతో యుద్ధం చేస్తోంది అమ్మవారు.

అటువంటి భీభత్స వాతావరణం తలచకోగానే భక్తుడు శివ శివ అని అంటూ వున్నారు.

మహా ఆహవము మహావము అంటే గొప్ప యుద్ధము.ఆ యుద్ధం ద్వారా భూత పిశాచములను తృప్తి పరచిన ఓ తల్లీ!!!

జయ జయ హే మహిషాసురమర్దిని రమ్య కపర్దిని శైలసుతే.

*************************************

5)**అయి శతఖండ విఖండిత రుండ వితుండిత శుండ గజాధిపతే**

**రిపుగజ గండ విదారణ ఖండ పరాక్రమ శౌండ మృగాధిపతే**

**నిజ భుజదండ నిపాతిత చండ నిపాతిత ముండ భటాధిపతే**

**జయ జయ హే మహిషాసుర మర్దిని రమ్య కపర్దిని శైలసుతే**.

అయి-శతఖండ విఖండిత రుండ-

అయి (ఐం) ఓ అమ్మా !!!శతఖండ అంటే నూరు ముక్కలుగా మొండెములను తుండెములను  తెగ నరికినది.

రుండము =మొండెము,వితుండిత-శుండ-

శుండము.అంటే తొండము.తొండములను మొండెములను అనంతమైన భాగాలుగా నరికివేసినదిట అమ్మవారు.యుద్ధం జరుగుతుంటే రాక్షసుల గజబలము వచ్చిందిట.

ఆ గజబలాన్ని అమ్మవారు సంహరించారు.

మృగాధిపతే అంటే సింహము.అమ్మ దగ్గర వున్న సింహము ఏ.విధంగా పరాక్రమం చూపించిందో ఈ వాక్యంలో చూపిస్తున్నారు.రిపు-గజ-గండ-విదారణ ఖండ పరాక్రమ-శౌండ-మృగాధిపతే

శత్రువుల యొక్క ఆ కపోలములు ముక్కలయ్యేలాగా కొట్టిందిట ఆ సింహము తన  పంజాతో.అలా కొడుతూ విజృంభిస్తోంది సింహము.సింహాన్ని ధ్యానించితే ఒక ప్రయోజనం వుంది.అమ్మ స్వరూపం లో సింహము పై కూర్చున్నటువంటి వైనము,చేతిలో వున్న ఆయుధాలు, ఆ చూపిస్తున్న పరాక్రమము వీటిని తలంచుకోవటం వల్ల వ్యక్తి కి అనేక రకాలైన ఆపదలు తొలుగుతాయి.అందుకే ఇది కేవలం వర్ణన కాకుండా శ్రవణ మాత్రం చేత సత్ఫలితాలు పొందేటటువంటి మంత్రమయ శ్లోకాలు. సింహం గురించి శాస్త్రం లో చెపుతున్న విషయం అమ్మవారు దేవ రక్షణ కోసం ఉద్భవించినపుడు ఈ సింహాన్ని హిమవంతుడు కానుకగా ఇచ్చాడుట.

Part 2

5.ఈ సింహము అనేక దేవతా శక్తులతో కూడినది. సింహం విజృంభించిన వైనం "దేవీ మాహాత్మ్యం" వివరించింది.అమ్మవారి వాహనమైన ఆ సింహము జూలు విదిలించి కోపంగా ఒక మహా నాదం చేసి అసుర సైన్యాలపై దూకి తన పంజాతో కోరలతో అనేక రాక్షసులను సంహరించిన వైనం అద్భుతంగా వర్ణించింది దేవీ మాహాత్మ్యం.క్షణకాలం లోనే అసురుల యొక్క సైన్యాన్ని అన్నింటినీ కూడా దెబ్బ తీసింది ఈ సింహం.సాధారణంగా ఆలయాల్లో కూడా ముందు సింహాన్ని

పెడతారు.. ఈ సింహానికి పురాణాల్లో సోమనంది అని పేరు.ముందు సింహానికి నమస్కారించి అటు తర్వాత అమ్మవారికి నమస్కారం చెయ్యాలి.లలితా సహస్ర నామాలలో శ్రీ మత్ సింహాసనేశ్వరీ అని వర్ణించారు.

Part 3

సకలదేవతా మయమైన విష్ణు తేజస్సు అమ్మవారి సింహం.

జ్యోతిష శాస్త్ర ప్రకారం సింహరాశి సింహము మప హృదయస్థానం.కనుకనే మన హృదయమే సింహము.అలాంటి సింహము పై అమ్మవారు ఉన్నారు అంటే మన హృదయంలో అనాహత చక్రం లో వున్న అమ్మ వారిని ధ్యానించటం.సింహ వాహిని అంటే హృదయంలో వున్న పరమాత్మ పరాశక్తి. అఖిలదేవతా మయమైన శరీరంతో వున్న సింహము దేవికి ప్రీతిపాత్రమైన సింహము మమ్మల్ని రక్షించుగాకా!!!ఎప్పుడైనా రోగాలు కానీ అరిష్టాలు కానీ కలిగితే అమ్మవారి వాహనమైన సింహాన్ని ధ్యానం చేస్తే అవి తొలగిపోతాయి. . రోగ నాశనము భయ నాశనము ఇష్ట సిద్ధి లభిస్తాయి ఈ సింహము పరాక్రమించినపుడు జరిగిన గాధ ను స్మరించుట వలన.

Part 4

నిజ-భుజదండ-నిపాతిత-చండ-విపాటిత-ముండ-భటాధిపతే;

అమ్మ వారు తన బాహుబలం తో చండుడు ముండుడు అనే రాక్షసులను వారి భటులకు నాయకులైన సేనాపతులతో సహా సంహారించింది.శుంభ నిశుంభులకు చాలా ప్రీతిపాత్రమైన వారు ఈ చండ ముండులు

నిపాతిత = క్రింద పడవేయుట,విపాటిత = చీల్చి వేయుట

చండ ముండ సంహారము చేసింది అమ్మవారి యొక్క కనుబొమల ముడి లోంచీ వచ్చినటువంటి కాళీదేవి.కాళీదేవి చండ ముండులను సంహరించటం చేత ఆవిడకు చాముండా అని పేరు వచ్చింది.

రాక్షసుల సైన్యం లో వున్న గజబలము మదానికి సంకేతం అటువంటి మదగజాల కుంభ స్థలాన్ని పగలకొట్టటం ఈ గాధ లో చూస్తాము.విద్యా మదం, ధన మదం,అధికార మదం,ఇలాంటివి కలిగి పరతత్వాన్ని విస్మరించి బ్రతికే పొగరు మోతు తనం వున్నది ఏదో దానిని కొట్టటం ఇక్కడ  జరిగింది. దుర్మదం అనే భయంకరమైన అసుర శక్తిని సంహరించిన వైనం ఇక్కడ మనం  గ్రహించవలసిన విషయం

****************************************

6)**అయి రణదుర్మద శత్రువధోదిత దుర్ధర నిర్జర శక్తిభృతే**

**చతుర విచారధురీణ మహాశివ దూతకృత ప్రమథాధిపతే**

**దురితదురీహ దురాశయ దుర్మద దానవదూత దురంతగతే**

**జయ జయ హే మహిషాసురమర్దిని రమ్యకపర్దిని శైలసుతే**

"అయి రణదుర్మద శత్రువధోదిత దుర్ధర నిర్జర శక్తిభృతే" ఇదంతా కలిపి ఒకటే శబ్దం.

రణ దుర్మద = యుద్ధం లో మహా మదం తో విజృంభిస్తున్నటువంటి శత్రువులను వధించటం కోసం సిద్ధపడిన దేవతా శక్తుల తో కూడిన తల్లి అని దీనియొక్క భావం.చుట్టూ దేవతా శక్తులు నడుమ అమ్మవారు వున్నారు. దేవతా శక్తులకు కేంద్రమై వున్నది అమ్మ .శుంభ నిశుంభల తో యుద్ధం చేస్తున్నప్పుడు చండ ముండులు తో

యుద్ధం చేస్తున్నప్పుడు దేవతల నుండి శక్తులు వెలికి వచ్చాయి.ఒక్కొక్క దేవత నుండి ఒక్కొక్క శక్తి వచ్చింది. సర్వ దేవతలకు మూలమైన పరాశక్తి  ఎప్పుడు వచ్చిందో ఆ దేవతల్లోని శక్తులు కూడా వెలికి వచ్చాయి.అవి ఎలా వచ్చాయో శాస్త్రం చెపుతోంది.

Part 2

బ్రహ్మ నుండి  వచ్చిన శక్తి  బ్రహ్మాణి హంసపై కూర్చొని అక్షమాలను కమండలము ను పట్టకొన్నది.

అదేవిధంగా శివుని నుంచి వచ్చిన శక్తి మాహేశ్వరి వృషభ వాహనంపై కూర్చుని త్రిశూలాన్ని ధరించి సర్పములను అలంకరించున్న చంద్రలేఖ తో వున్నటువంటి తల్లి మాహేశ్వరి. ఇక కౌమారీ దేవి శక్తి అనే బల్లెపు ఆయుధాన్ని పట్టుకుని నెమలిపై కూర్చుని వున్నది.గరుడవాహనారూఢయై శంఖ చక్ర గదా శాంఙ్ఞములను ధరించినది వైష్ణవీ దేవి.

Part 2

బ్రహ్మ నుండి  వచ్చిన శక్తి  బ్రహ్మాణి హంసపై కూర్చొని అక్షమాలను కమండలము ను పట్టకొన్నది.

అదేవిధంగా శివుని నుంచి వచ్చిన శక్తి మాహేశ్వరి వృషభ వాహనంపై కూర్చుని త్రిశూలాన్ని ధరించి సర్పములను అలంకరించున్న చంద్రలేఖ తో వున్నటువంటి తల్లి మాహేశ్వరి. ఇక కౌమారీ దేవి శక్తి అనే బల్లెపు ఆయుధాన్ని పట్టుకుని నెమలిపై కూర్చుని వున్నది.గరుడవాహనారూఢయై శంఖ చక్ర గదా శాంజ్ఞములను ధరించినది వైష్ణవీ దేవి.

Part 3

ఇక యజ్ఞ వరాహ స్వరూపిణి వచ్చింది. నృసింహ దేవుని శక్తి. నారసింహి ఈవిధంగా మాతృకాశక్తులు వచ్చాయి. అమ్మవారికి సహాయంగా యుద్ధంలో పాల్గొన్నాయి.

వీరు చేసిన యుద్ధ నైపుణ్యాలు కూడా శాస్త్రం వర్ణించింది.బ్రహ్మాణీ దేవి తన కమండలు జలము చేతిలో పట్టుకుని చల్లింది.ఆ జలం తగలగానే కొంతమంది అసురులు సంహరింపబడ్డారు.ఇక వైష్ణవి శంఖ చక్ర ఇత్యాది ఆయుధములు ప్రయోగించింది.విష్ణువు నుంచి వచ్చిన వరాహ శక్తి కూడా అసుర సంహారం చేసింది. నరసింహ స్వరూపం శక్తి అయిన నారసింహి చీల్చివేసింది.మాహేశ్వరి త్రిశూలము తో అసుర సంహారం చేసింది. .కౌమారీ దేవి శక్తి అస్త్రాన్ని ప్రయోగించింది.ఇంక ఇంద్రుని నుంచి వచ్చిన  ఐంద్రీ దేవి వజ్రాయుధాన్ని ప్రయోగించింది.

"నిర్జల శక్తులు అంటే దేవతా శక్తులు" అసుర సంహారం చేయటానికి ఉరుకుతూ వుంటే ఆ దేవతా శక్తుల తో వున్న  ఓ తల్లీ జయమగు గాక!!!

1.చతుర విచారధురీణ మహాశివ దూతకృత ప్రమథాధిపతే

చాలా నైపుణ్యం తో ఆలోచించగలిగే నేర్పరి అయిన శివుడుని దూతగా చేసుకున్న తల్లి అని అర్థం.

ప్రమథ నాయకుడైన శివుని దూతగా చేసుకున్న తల్లి.ఈ తల్లి పేరు శివదూతీ.అమ్మవారు అసురుల దగ్గరకు సందేశం పంపించిందట.బుద్ధి కలిగి శంకరుని శరణు వేడావా బావుపడతావు లేకపోతే యుద్ధం లో నాచేత సంహరింపబడి యమలోకానికి పోతావు జాగ్రత్త అని అమ్మవారు సందేశాన్ని శివుడు ద్వారా పంపించింది.

2.శివుడికి దూతగా ఉండటం అలవాటే.ఈయనే రామావతారంలో హనుమంతునిగా వచ్చినటువంటివాడు.అందుకే దూతాయచ ప్రహితాయచ అని రుద్రం లో కూడా చెపుతున్నారు.

దురిత దురీహ దురాశయ దుర్మద దానవదూత దురంతగతే

దురిత పాపము దురీహ చెడు కోరికలు దురాశయ చెడ్డమనసు దుర్మద కూడని మదము ఈ మొత్తం నాలుగు దుర్గుణాలు వున్న దానవ దూతలందరినీ అంతము చేసిన తల్లి.దానవ దూతలు అంటే దానవుల పక్షాన మాట్లాడుతూ దానవత్వాన్ని సమర్థించే దానవ శక్తుల ను సంహరించింది.ఇవన్నీ దుకార బాహుళ్యములు

అమ్మవారి బీజాక్షరములు కూడా దుం దుర్గాయై నమః అని చెప్పబడుతోంది.అమ్మవారి పేరు దుర్గ.ఏవయితే దుః అనే పేరుతో చెప్పబడుతున్నాయో వాటన్నింటినీ తొలగించేది దుర్గ.దుర్మార్గము దుష్టత్వం దుఃఖము, ఈ దుః అనేది భరించలేని లక్షణాలని చెపుతోంది.ఇవన్నీ తొలగితే కానీ

సిద్ధి లేదు.వీటన్నింటినీ తొలగించే తల్లి కనుక దుర్గా.అందుకే దుర్గా నామము చాలా మహిమాన్వితమైనది.

****************************************

7)**అయి శరణాగత వైరి వధూవర వీర వరాభయదాయికరే**

**త్రిభువన మస్తకశూల-విరోధి శిరోధి కృతామల శూలకరే**

**దుమిదుమితామర దుందుభినాద ముహుర్ ముఖరీకృత శంఖకరే**

**జయ జయ హే మహిషాసురమర్దిని రమ్య కపర్దిని శైలసుతే**

ఇందులో అమ్మవారి యొక్క వీరత్వము కారుణ్యము రెండింటిని మేళవించి చూపిస్తున్నారు.

అయి శరణాగత వైరివధూవర వీరవరాభయదాయికరే

అమ్మవారు రకరకాల అసురులను సంహరించారు.కానీ ఒక్కొక్కప్పుడు అసురుల భార్యలు మేల్కొని అమ్మవారిని శరణువేడి మమ్మల్ని రక్షించు తల్లి అని ప్రార్థిస్తే వెంటనే కారుణ్యము తో ఆ పతివ్రతల పై దయకలిగి ఆ వీరులైనటువంటి రాక్షసులను క్షమించి వదిలి పెట్టేస్తుంది.అలాంటి సందర్భాలు కూడా పురాణాలలో అక్కడక్కడ కనిపిస్తూవుంటయి.

అందుకు శరణాగత వైరి వధు శరణువేడినటువంటి వైరుల యొక్క భార్యలకు అభయమిస్తూ "వర వీరవరాభయదాయికరే"

వారికి వరము అభయము ఇచ్చే తల్లి అని చెప్పటంలో ఉద్దేశ్యము ఏమిటంటే అమ్మ ఎంత ప్రతాపం చూపిస్తుందో ప్రార్థిస్తే అంత కరిగి అనుగ్రహిస్తుంది అని చెప్పటం ఇందులో భావం.

మనలో ఒక దుష్ప్రవృత్తి బయలుదేరితే వెంటనే మనం దాన్ని అణచాలి అన్న ఉద్దేశ్యం తో అమ్మవారిని శరణువేడితే,శరణు వేడిన దానికి సంతోషించి దుష్ప్రవృత్తులను తొలగించి అభయాన్ని వరాన్ని ఇస్తుంది అమ్మవారు.

"త్రిభువన మస్తకశూల విరోధి శిరోధి కృతామల శూలకరే" రామకృష్ణ కవి గొప్ప కవి,గొప్ప ద్రష్ట,గొప్ప ఉపాసకుడు,సిద్ధ పురుషుడు.

శూలము = ఆయుధము,నొప్పి.మస్తక శూలము అంటే తలనొప్పి.

ముల్లోకాలకీ తలనొప్పిగా మారినటువంటి శత్రువైన మహిషాసురుడి తలమీద శూలాన్ని పొడిచినటువంటి తల్లి. వాడి శిరస్సు పై తొక్కి పెట్టినటువంటి శూలం చేతులో పట్టుకున్నటువంటి తల్లీ జగదంబా జయ జయ

మహిషాసురుడ్ని సంహరించినటువంటి అమ్మవారి చేతిలో త్రిశూల వైభవాన్ని ధ్యానించాము.అటు తరువాత ఎప్పుడైతే

అమ్మవారు యుద్ధం చేస్తున్నారో ,యుద్ధ ఉత్సాహం పెంచటానికి యుద్ధ వైభవాన్ని ప్రకటించటానికి దుందుభి అనేదాన్ని మ్రోగిస్తారు. "దుమి దుమి తామర దుందుభినాద ముహుర్ ముఖరీకృత శంఖకరే" దుం దుం అనే నాదములతో దుందుభి మ్రోగిస్తూ వుంటే ఆ నాదాన్ని మరింత పెంచుతున్నట్లుగా అమ్మ తన చేతిలో శంఖాన్ని ఊదింది.అద్భుతమైన ధ్యానం ఇది అంతా !!!

ఒకవైపు శూలంతో పొడిచి విజయ సూచకంగా చేతిలో శంఖాన్ని తీసుకుని అమ్మవారు ఊదారు.ఆ శంఖ నాదం ఈ దుందుభి నాదాల్ని మరింతగా ధ్వనింప చేస్తూ ఉత్సాహం మరింత పెంచుతూవుంది. దుందుభి నాదంతో "ముహుర్ ముఖరీకృత =ప్రతిధ్వనింప చేసేవిధంగా శంఖనాదం చేస్తున్నటువంటి హే మహిషాసుర మర్దిని రమ్య కపర్దిని శైలసుతా జగదంబా నమస్కారం

****************************************

8 )**సుర లలనాతత థేయిత థేయిత తాళ నిమిత్తజ లాస్యరతే**

**కకుభాం పతివర థోంగత తారక తాళ కుతూహల నాదరతే**

**ధిమికిట ధిక్కట ధిం ధిమిత ధ్వని ధీర మృదంగ నినాద రతే**

**జయ జయ హే మహిషాసురమర్దిని రమ్య కపర్దిని శైలసుతే**

అమ్మవారు మహిషాసుర సంహారము చేసిన తరువాత ఆ విజయంతో ఎన్నిరకాల నాదములు అక్కడ మ్రోగుతున్నాయో చూపిస్తున్నారు.విజయోత్సాహంతో మ్రోగిన మంగళకర వాద్యముల యొక్క సందడి ఈ శ్లోకం లో మనకు కనబడుతుంది.

"సుర లలనాతత థేయిత థేయిత"

థేయిత థేయిత అనేవి శబ్దానుకరణములు.

వీటిని ధ్వని అనుకరణ పదములు అంటారు.వీటికి అర్థాలు ఏమీ వుండవు.దేవకాంతలు వచ్చి అమ్మవారికి మంగళ నాదములు పలుకుతూ మంగళ హారతులు ఇస్తున్నారు.ముందుగా వాళ్ళు చేస్తున్నటువంటి రకరకాల

తాళములు మంగళకరమైన నాదములు సాగుతున్నాయి. అటు తర్వాత వాళ్లు ఆనందోత్సాహంతో లాస్యం చేసి అమ్మవారి కి నమస్కారం చేస్తున్నారు. లాస్యము అంటే కోమలమయిన నృత్యం.దేవకాంతలు ధేయిత ధేయిత అని తాళములు మ్రోగించుతూ అమ్మవారికి నమస్కారం చేసి ఆ తాళములకు అనుగుణంగా లాస్యము చేస్తున్నారు.వాళ్ళ లాస్యము చూసి అమ్మవారు సంతోషిస్తున్నారు.

లాస్య రతే అంటే దేవకాంతల యొక్క లాస్యానికి ఆసక్తిగా ఆనందించే తల్లీ జగదంబా నీకు జయమగు గాకా !!!

"కకుభాం  పతివర ధోంగత తారక తాళ కుతూహల నాదరతే"

కకుప్ అంటే దిక్కులు కకుభాం పతి అంటే దిక్పాలకులు.దేవతలందరూ దిక్పాలకులే.ఇంద్రుడు మొదలుకుని క్రమంగా వరుణుడు యముడు ఈశానుడు ఇత్యాదులు అందరూ అక్కడ వున్నారు.ఇటువంటి దిక్పాలకులందరూ తారకము అనబడే వాద్య పరికరము ద్వారా తాళములు ఉత్సాహంతో చేస్తూ వున్నారు.వారి యొక్క తాళములు వింటూ కుతూహలముతో వాటి యొక్క నాదముపై ఆసక్తి కలిగి వున్నది.ఇక్కడ వరసగా మూడు పాదములు నాదరతే అని చూపిస్తున్నారు. అంటే నాదమునందు ఆసక్తి గల తల్లి.ఈ నాదము అంతర్గతమైన అనాహత నాద స్పందనను  తెలియచేస్తూ వుంటుంది యోగపరంగా. అదేవిధంగా మంత్ర నాదము,మంగళ నాదము ఇవన్నీ కూడా పూజలో అంతర్భాగములు. అమ్మవారు అసుర సంహారము చేసినదానికి గానూ ఉత్సాహంతో  దేవతలు దేవకాంతల అందులో పాల్గొని వున్నారు. కకుభాంపతి  అన్నప్పుడు దేవతలను చెప్పారు. సురలలనా అన్నప్పుడు దేవకాంతలను  చూపిస్తున్నారు.దీనికి తోడు

మంగళకరమైన వాయిద్యములతో పాటు మృదంగములు కూడా మ్రోగుతున్నాయి.

"ధిమికిట ధిక్కట ధిం ధిమిత ధ్వని ధీర మృదంగ నినాద రతే "

మృదంగములు కూడా ఒక్కొక్క భావానికి అనుగుణంగా వుంటాయి.ఇప్పుడు ఎలాంటి మృదంగములు అంటే ధీర మృదంగములు. ఒక ధీరత్వాన్ని ,వీరత్వాన్ని సూచించేటట్లు ధిమ్ ధిమి ధ్వనులతో మ్రోగుతున్నటువంటి మృదంగ నాదముల పట్ల ఆసక్తి కలిగి వింటూ నాదమయిగా వున్నటువంటి అమ్మవారి కి జయము పలుకుతున్నారు.

***************************************

9)**ఝణఝణ-ఝింఝిమి-ఝింకృత-నూపుర-శింజిత-మోహిత భూతపతే |**

**నటిత-నటార్ధ-నటీనట-నాయక-నాటిత నాటక నాట్యరతే**

**పదనత పాలిని ఫాల విలోచని పద్మవిలాసిని విశ్వ ధురే**

**జయ జయ హే మహిషాసుర-మర్దిని రమ్య కపర్దిని శైలసుతే**

అమ్మవారు మహిషాసుర సంహారము చేసిన తరువాత ఆ విజయంతో ఎన్నో రకాల నాదములు అక్కడ మ్రోగుతున్నాయి. విజయోత్సాహంతో మ్రోగిన మంగళకర వాద్యముల యొక్క సందడి, రమ్యమైన విజయోత్సవ కేళినే కొనసాగిస్తున్నారు ఈ శ్లోకంలో.

Copyright@gurujnanam.org

ఇందులో అమ్మవారి యొక్క శివమయమైన శివ ప్రియకరమైన సౌమ్య స్వరూపం కనిపిస్తుంది.

"ఝుణఝుణ-ఝింఝిమి-ఝింకృత-నూపుర-శింజిత-మోహిత భూతపతే" అమ్మవారి అడుగులు వేస్తూ వస్తున్నారట శివుడు వద్దకు

ఆ అడుగులు వేస్తున్నపుడు అమ్మవారి కాలి కి పెట్టుకున్న మువ్వలు మ్రోగుతున్నాయి.ఎలా

మ్రోగుతున్నాయంటే మువ్వలు మ్రోగటాన్ని శింజానము అంటారు. ఆ కాలి పట్టీల మువ్వలు ఝుణ ఝుణ మంటూ ధ్వనిస్తూ వుంటే ఆ కాలి మువ్వల సవ్వడి విని శివుడు ఆనందిచాడుట.అమ్మవారు వస్తున్నారంటేనే శివునకు ఆనందం.ఎందుకంటే శివుని యొక్క ఆనంద స్వరూపమే అమ్మవారు.అందుకని అమ్మవారు విజయం సాధించి శివుని వద్దకు వస్తున్నారు.విజయం సాధించి వస్తున్నటువంటి అమ్మవారి కాలి మువ్వల సవ్వడి ధ్వని లోనించే తెలుసుకున్న శివుడు చాలా సంతోషించాడు.అందుకని శివునకు ఆనందం కలిగేలాగా మ్రోగుతున్న మువ్వల పట్టీ కలిగినది అమ్మ. భూతపతి అని శివుడికి పేరు.భూతములు అంటే సమస్త ప్రాణికోట్లకు ప్రభువైన పరమేశ్వరుడు అమ్మవారి యొక్క కాలి మువ్వల సవ్వడి కి ఆనందించాడు.

"నటిత-నటార్ధ-నటీనట-నాయక-నాటిత నాటక నాట్యరతే" అద్భుతమైన భావాలు ఇందులో చూపిస్తున్నారు.నటీ నటులకు నాయకుడు.నటీ నటులు అంటే బాగా నాట్యం చేయగలిగే స్త్రీలు పురుషులు. దేవతలలో అప్సరసలు , గంధర్వులు

మొదలైనవారు వీళ్ళందరినీ కలుపుకుంటే రకరకాల నర్తన చేసేటటువంటి దేవనాట్య కళాకోవిదులు వాళ్ళు..వారు ఎటువంటి వారంటే

"నటిత-నటార్ధ-నటీనట" నటించుతూ ఉన్నటువంటి వారు, నాట్యములో నేర్పరితనము తెలిసినవారు.నటార్థ - అర్థముఅంటే ప్రయోజనము,సారము అని. రకరకాల రీతులు తెలిసినటువంటి నటీ నటులు ప్రపంచంలో ఎందరో గొప్ప గొప్ప కళాకారులు వున్నారు. భరతుడు సిద్ధేంద్రుడు ఇత్యాదిఎందరో వున్నారు. చారిత్రకంగా అయితే సిద్ధేంద్ర యోగి.వైదికంగా పురాణపరంగా అయితే భరతుడు.

భరతుడు ఆనాడే శివుని యొక్క నాట్యాన్ని చూసి తాను ప్రత్యేకంగా నాట్య శాస్త్రం తయారు చేసినటువంటివాడు.భరతుడు,తండి మొదలైన వాళ్ళు నాట్యకళలో కోవిదులు.అలాంటి గొప్ప గొప్ప నాట్యకళా కోవిదులకు ఎవడు నాయకుడో వాడు నటరాజు పరమేశ్వరుడు అని అర్థం.

"నటీనట-నాయక" అంటే నటీ నటులు అందరికీ నాయకుడు నటరాజు అని అర్థం.ఆయనకు నాట్యంలో అన్ని నేర్పరితనాలు తెలుసు.అలాంటివాడు నాట్యం చేస్తూ ఒక నాటకాన్ని నడిపిస్తున్నాడు. నాట్యం తో నడిపేదే నాటకం.ఆయన చేసే నాటకం ఏమిటంటే జగన్నాటకం.జగన్నాటకం అంతా శివ నాట్యమే.కనుక శివుడు తన నాట్యపు నేర్పరి తనం అంతా చూపిస్తూ

జగన్నాటకాన్ని ఎప్పుడైతే ప్రదర్శిస్తున్నాడో ఆ జగన్నాటకం లో స్వామి చూపించేటటువంటి నాట్యాన్ని చూసి చాలా ఆనందించిదిట ఆ తల్లి.అందుకే శివ నాట్యానికి అధ్యక్ష స్థానం లో కూర్చుని ఆయన చేసే నాట్యాన్నంతటిని చూసి మురిసిపోతూవుంటుంది.ఎందుకంటే శివ చైతన్య విలాసమే ఈ విశ్వ రచన. ఈ

విశ్వ రచనే జగన్నాటకం. జగన్నాటకం. లో ప్రతి క్షణం కూడా చైతన్యం వుంది. కదలిక వుంది movement.జగత్తంతా కూడా కదులుతూ వుంటుంది.జగత్తు అనే శబ్దానికే నిరంతరం కదిలే లక్షణము కలది అని అర్థము.నిరంతర సంచారశీలమైన ఈ జగత్తు పరిణామ పేశలమైన జగత్తు శివుని యొక్క నాట్యం.

అలాగ శివుని యొక్క నాట్య విశేషమంతా ఆయన యొక్క శక్తి. అందుకే ఇక్కడ "నాటక నాట్య రతే"అన్నారు. అమ్మవారి కదలిక లోనే నాట్యము వున్నది.అందుకే కాలి మువ్వల సవ్వడి అని చెప్పటంలో అమ్మవారి యొక్క కదలిక లాస్యము. శివుని యొక్క కదలికలు తాండవం. అది ఉద్ధతితో వున్నది.రెండూ ఇక్కడ చెప్పటం జరిగింది.అమ్మ వారి యొక్క కాలిమువ్వల సవ్వడికి శివుడు సంతోషిస్తున్నాడు.

శివుడు చేస్తున్న నాట్యానికి అమ్మవారు సంతోషిస్తున్నారు. ఈ రెండు వాక్యాలు చెప్పటంలో అద్భుతం.అమ్మవారు చూపించిన కళ అయ్యవారికి ఆనందం కలిగిస్తే,అయ్యవారు చూపిస్తున్న విశ్వనాట్యమనే కళ అమ్మవారికి ఆనందం కలిగిస్తున్నది.ఒకరి పట్ల ఒకరికి ప్రీతి భావము ఉన్న అన్యోన్య ఆది దంపతుల యొక్క ప్రణయ వైభవాన్ని చూపిస్తున్నారు.ఇక్కడ ఈ రెండు వాక్యములు ఎంతో ఔచితీమంతంగా కూర్చారు రామకృష్ణ కవి.

"పదనత పాలిని ఫాల విలోచని పద్మవిలాసిని విశ్వ ధురే"

9th slokam part 2

"పద నత పాలిని" తన పాదాలపై తల వాల్చి నమస్కరిస్తున్నటువంటి భక్తులను పాలించే తల్లీ!!! ఫాలవిలోచని ఫాలనేత్రంతో వున్న తల్లి. అమ్మ వారి నుదుటన

మూడవ నేత్రం వుంది."పద్మ విలాసిని" పద్మములయందు విలాసముగా సంచరించునది.పద్మ విలాసిని అన్నప్పుడు మూలాధారం నుంచి ఉన్న ఒక్కొక్క చక్రాన్ని ఒక్కొక్క కమలం అంటారు.అందుకే "మూలాధారా షట్కమలంబులు" అని శాస్త్రం చెప్పిన మాట.అలాంటి కమలములలో ప్రకాశించుతూ ఉంటారు.అందుకే మాతరం పద్మ మాలినీం అన్నారు.మనలో వున్న ఈ కమలములన్నీ ఒక వరుస లో వుంటాయి.మూలాధారాది షట్చక్ర కమలము లందు సంచరించుతూ సహస్రారము అనే మహా పద్మం లో వుంటుంది అమ్మ కనుక పద్మవిలాసిని. "విశ్వధురే" ఈ సమస్త విశ్వాన్ని నడిపించ గలిగేటటువంటి సామర్థ్యముకల తల్లి అని అర్థము.ధురే అనే శబ్దమునకు సమర్థువంతురాలు అని అర్థము.

****************************************

10) (Part 1)

10) **దనుజ సుసంగర రక్షణసంగ-పరిస్ఫురదంగ-నటత్కటకే**

**కనక-పిశంగ-పృషత్క-నిషంగ-రసద్భట-శృంగ-హతావటుకే**

**కృత-చతురంగ-బలక్షితి-రంగ-ఘటద్-బహురంగ-రటద్-వటుకే**

**జయ జయ హే మహిషాసుర-మర్దిని రమ్యకపర్దిని శైలసుతే**

ఈ దివ్యమైన మహిషాసురమర్దిని స్తోత్రం ఇచ్చిన రామకృష్ణ కవి తన ఉపాసనా బలాన్ని మంత్రశక్తిని ప్రతి అక్షరంలో ప్రతిష్ట చేశారు.ఇక్కడ గమనించవలసిన విషయం అమ్మవారి ఆరాధన ఎప్పుడూ కూడా శివశక్త్యాత్మకంగా చేసినపుడు

అద్భుతమైనటువంటి సత్ ఫలితాలు ఇస్తుంది.అది ఉత్తమమైన ఉన్నతమైన ఉపాసనా విధానము.దీనినే సమయాచారం అంటారు.

ఆ సమయాచార భావనలోనే ఈ మొత్తం రచన అంతా కూర్చబడినది. అందుకే మహిషాసుర మర్దిని రమ్య కపర్దిని శైలసుతే.శైలసుతే అంటే పర్వత రాజ పుత్రిక అయిన ఉమాదేవి.రమ్య కపర్దిని అంటే కపర్ది యొక్క ప్రియురాలు, శివుని యొక్క ప్రియురాలు శివ శక్త్యాత్మకమైన తత్త్వాన్ని ఏకం చేస్తున్నారు. ఈవిడే కపర్దము ధరించిందంటే శివునకు అభిన్నురాలు అని చెపుతున్నారు. 9వ శ్లోకంలో అమ్మవారి యొక్క కాలి మువ్వల సవ్వడికి శివుడు ఆనందిస్తుంటే శివుని నాట్యానికి అమ్మవారు ఆనందిస్తున్నారు అని చెప్పినప్పుడు ఆ పరస్పర అన్యోన్యత భావించటం వల్ల,ఇది భావించేవారికి క్షేమం కలుగుతుంది.

ప్రపంచంతో సామనస్యం ఏర్పడుతుంది.శివ శక్తుల యొక్క ఏకత్వాన్ని ప్రదర్శింప చేస్తూ అమ్మవారు నాట్యం చేస్తున్నప్పుడు ఎన్ని రకాల శక్తులు ఉన్నాయో అమ్మవారి అవయవాలు నుండి ఎన్ని రకాల శక్తులు ప్రకటింపబడుతున్నాయో ఈ శ్లోకంలో చూపిస్తున్నారు.

"దనుజ సుసంగర రక్షణసంగ-పరిస్ఫురదంగ-నటత్కటకే"

అసురులు యుద్ధం చేస్తున్నప్పుడు వాళ్ళు రకరకాల ఆయుధాలు ప్రయోగిస్తున్నారు.ఆ ఆయుధాల్ని తిప్పి కొట్టటం కోసమని ఆయుధాల్నించి తనవారికి రక్షణ కల్పించటం కోసమని అమ్మవారు తన చేతుల్నించి ఆయుధాలను ప్రయోగిస్తున్నారు. ఆయుధ ప్రయోగం ఎలా వుందంటే వారు

విసురుతున్న ఆయుధాలను ఎదుర్కొంటున్నది.ఎదుర్కొనుట అంటే వాటి నుండి రక్షణ కల్పించుకోవటం.

"దనుజ సుసంగర రక్షణసంగ-పరిస్ఫురదంగ-నటత్కటకే"

దనుజులతో సు సంగరము,సు అంటే గొప్పదైన యుద్ధము అంటే వర్ణనకు అతీతమైన పరాక్రమముతో సాగుతున్న యుద్ధం కనుక సుసంగర

అందులో రక్షణ సంగ రక్షణ కోసమని అమ్మవారు చేతులు పైకి ఎత్తారు.ఆ చేతులు అష్టాదశ భుజములు మహిషాసుర మర్దిని గ వచ్చినప్పుడైతే 18 చేతుల తో వున్నది,శుంభ నిశుంభల సంహారానికి వచ్చినప్పుడైతే అమ్మవారు 8 చేతులతో ప్రకాశిస్తున్నది అని శాస్త్రం వర్ణిస్తోంది.అష్ట భుజ వున్నది.అష్టాదశ భుజ వున్నది.అయితే మహిషాసుర మర్దిని అన్నప్పుడు మాత్రం 18 చేతులు తీసుకోవాలి.అసురుల తో యుద్ధం చేస్తున్నప్పుడు రక్షణ కోసమని తన చేతులు అమ్మ కదుపుతోంది.కదుపుతున్న చేతులు ఎంత అద్భుతంగా వున్నాయంటే "పరిస్ఫురదంగ-నటత్కటకే"

కటకము అంటే చేతులకు ధరించిన ఆభరణములు. పరిస్ఫుర అంటే చక్కగా ఆ చేతుల్ని విప్పార్చి యుద్ధం చేస్తున్నది.యుద్ధం చేస్తున్నప్పుడు ఆ చేతులకు పెట్టుకున్న అలంకారములు మెరిసిపోతున్నాయి.అవీ నటిస్తున్నట్టు వున్నాయి. అటు ఇటూ కదులుతున్నాయి అవి.ఆ చేతికి పెట్టుకున్న కంకణములు కానీ అంగుళీయకములు కానీ కేయూరములు కానీ భుజకీర్తులు కానీ మొత్తంగా అమ్మవారి హస్తములు ఇక్కడ వర్ణించటం జరుగుతోంది. అమ్మవారి చేతుల్లో

Copyright@gurujnanam.org

ఎన్ని ఆయుధములు ఉన్నా అన్ని హస్తములు అభయ హస్తములే.ఆయుధాలు కూడా భయాన్ని పోగొట్టి అభయము ఇవ్వడానికే ధరించింది ఆ తల్లి.

దుష్ట శక్తులు వచ్చేటప్పుడు ఊరికే చేతులు వుంచితే లాభం లేదు.ఆ దుష్ట శక్తులను ఎదుర్కొనేటటువంటి ఆయుధములు కూడా పట్టుకుంది అమ్మవారు. ఖడ్గము శూలము పరిఘ ఇత్యాది ఆయుధములు ధరించినటువంటి అందమైనవి ఆ హస్తములు.

10th slokam (part 2)

నటత్ కటక్ చేతుల్లో ఆయుధములు ప్రకాశిస్తున్నాయి,ధరించినటువంటి ఆభరణములు ప్రకాశిస్తున్నాయి.ఆభరణములు సౌందర్యాన్ని చూపిస్తూ వుంటే ఆయుధములు వీరత్వాన్ని చూపిస్తున్నాయి.అమ్మ మొత్తంగా వీర సౌందర్య రసాకృతిగా అక్కడ సాక్షాత్కరిస్తున్నది.అమ్మ వీరత్వం లోనూ సౌందర్యం వుంది.వీరత్వం లోక రక్షణ కోసం.ఆ సౌందర్యం సౌజన్యమైన కృపామయమైన సౌశీల్యాన్ని చెపుతున్న స్వరూపం.అందుకే ఈ శబ్దం అంతా గొప్పగా వర్ణిస్తోంది. "దనుజ సుసంగర రక్షణసంగ"అనే మాటలో ఒక విశేషం ఉన్నది.కొట్టటానికి వచ్చినప్పుడు మన చేతిని మనమే అడ్డు పెట్టుకుంటాము.అందుకే యుద్ధం లో వాళ్ళనుంచి రక్షించుకుంటూ అమ్మవారు చేతులు కదుపుతున్నారు అని ఒక అర్థము. దనుజులు చేస్తున్నటువంటి పరాక్రమము వల్ల బాధపడుతున్న లోకములకు రక్షణ కల్పించటానికి తన చేతులను అడ్డుపెట్టిందిట.ఎలాగైతే ఒక తల్లి తన పిల్లవాడ్ని కాపాడటానికి తన చేతులు పెట్టి పొదుముకుంటుందో అదే

విధంగా లోకాల్ని కాపాడటం కోసం తన హస్తములతో అమ్మ అభయమిస్తూ యుద్ధము చేస్తోంది. "పరిస్ఫురదంగ-నటత్కటకే

కనక-పిశంగ-పృషత్క-నిషంగ-రసద్భట-శృంగ-హతావటుకే" అమ్మవారు అమ్ములపొదిని కూడా ధరించివున్నారు.

"శంఖచక్ర ధనుర్ బాణాం ధారయంతీం త్రిలోచనాం దూర్వాదళ నిభాం వందే దుర్గాం దుర్గతి నాశినీమ్"

అని అమ్మవారికి సంబంధించిన ప్రత్యేకమంత్రం వుంది.

ఈ మంత్రాన్ని జపించితే చాలు దుర్గతులు పోతాయి అని శాస్త్ర వచనం.అలాంటి దివ్య మంత్రం ఇది. "

కనక-పిశంగ-పృషత్క-నిషంగ" అంటే అమ్మవారు ధరించినటువంటి బాణములతో కూడిన అమ్ములపొదులు,పిశంగం అంటే అమ్ములపొది.పృషత్కం అంటే బాణం.అలా బాణాలు పొదిగనటువంటి అక్షయతూణీరములు అనగా అమ్ములపొదులు ధరించివున్నది. అమ్ములపొదులు ఎలావున్నాయంటే బంగారు కాంతులతో వున్నాయట.బాణములు కూడా మెరుపుల్లా మెరిసిపోతున్నాయి. ఆ బాణములు తీసి అమ్మవారు ప్రయోగిస్తున్నారు. చాపానికి అనుసంధానము చేసి.

అప్పుడు "రసద్భట-శృంగ-హతావటుకే" ఆ భటుల యొక్క తలలు తెగి కింద పడుతున్నాయి. వాళ్ళ యొక్క ప్రతాపం అంతా కరిగిపోతున్నది. హతావటుకే హతా అవటుకే ,అవటుకము అంటే పెడతలలు ఇటువైపు తిప్పిన తలలు అమ్మవారి యొక్క బాణపు దెబ్బలకు అటువైపు తిరిగి కింద పడిపోతున్నాయట.వటుకే కటకే అనే శబ్దము అనేదానికి అందమైన

అంత్యప్రాశ,అర్థ భేదం వుంది.

10th slokam(part 3)

3వ వాక్యం లో వున్న వటుకే అంటే వటుక శక్తులు అని కొన్ని చూపిస్తున్నారు.

"కృత-చతురంగ-బలక్షితి-రంగ-ఘటద్-బహురంగ-రటద్-వటుకే"

"కృతచతురంగ బల" రాక్షసులు చతురంగ బలములతో వస్తున్నారు. పదాది బలం,అశ్వ బలం,గజ బలం,రథ బలం ఈ నాల్గింటితో రణక్షోణి యుద్ధభూమి అంతా అల్లల్లాడిపోతోంది.వాటియొక్క తీవ్రమైనటువంటి కాలియొక్క ఒత్తిడులు పరుగులు వీటన్నిటితో వున్నది ఆ క్షితి రంగం అంతా.క్షితి రంగము యుద్ధ భూమి రంగము.

"ఘటద్-బహురంగ" అలాంటి యుద్ధ భూమిలో రక రకరకాల సేనా సమూహములు బహిరంగ అంటే సేనాసమూహములు అవి ఎప్పుడైతే విజృంభిస్తున్నాయో వాటిని ఎదుర్కొనటానికి అమ్మవారి దగ్గర కొన్ని శక్తులు వెలికి వచ్చాయట,వారు "వటుక అనే శక్తులు"

వాళ్ళు రటత్ అంటే సంచరిస్తున్నారు. అసుర శక్తులను సంహరించటానికి విజృంభించి వీరత్వాన్ని చూపిస్తూ అక్కడ సంచరిస్తున్న వటుక శక్తులను చూపిస్తున్నారు.ఇక్కడ వటుకలను వర్ణించటంలో ఒక ప్రత్యేకత వున్నది.అమవారి ఉపాసనల్లో వటుక ధ్యానం కూడా వున్నది.

ఈ వటుకలు భైరవ శక్తులు.ఆనంద భైరవ, కాలభైరవ, కపాలభైరవ, భీషణ భైరవ,వటుక భైరవ,ఇత్యాది భైరవ మూర్తులు వున్నాయి.వటుక భైరవుడు ఆపదలనుండి బయట పెడతాడు.అందుకే వటుక భైరవుడిని "ఆపదుద్ధారక వటుక భైరవ" అంటారు.కాలభైరవుడు మనకు కాలం లో వచ్చే ప్రతికూలతలను

తొలగిస్తూవుంటాడు.ఆ ఆది భైరవుడు అయినటువంటి పరమేశ్వరుడే ఈ రకరకాల భైరవ రూపంతో వుంటాడు."భైరవ స్మరణ రక్షణ శక్తి".ఈ రక్షణ శక్తులు అన్నీ కూడా అమ్మవారి తో యుద్ధం లో వున్నాయి. అంతేకాదు దుర్గా ఉపాసనలో ఈ వటుక మొదలైన శక్తులు కూడా ఆరాధింపబడుతారు అని దీనిలో వున్న భావము.ఎందుకంటే ఒక దేవత ఉపాసనలో ప్రధాన దేవతతో పాటు పరివార దేవతలు అంగ దేవతలు ఉపాంగ దేవతలు అని వుంటారు. అంగదేవతలుగా పరివార దేవతలు గా వున్నవారు కూడా దేవతా ఉపాసకుడ్ని కాపాడుతారు.వాళ్లు ఎవరు ఏమిటి తెలియక పోయినా తెలుసుకోవడం వల్ల ప్రయోజనం వుంది.ఎందుకంటే ఆయా సమయాలు వచ్చినప్పుడు ఒక్కసారి వారిని స్మరించినా చాలు.మూలదేవతను స్మరించినా వాళ్ళ రక్షణ లభిస్తుంది, ప్రత్యేకించి వీరి స్మరణచేస్తే ఆ మూల దేవత సంతోషిస్తుంది.అందుకే వటుక,

క్షేత్రపాల,ఇత్యాదులు అందరూ కూడా దుర్గా ఉపాసనలో ప్రధానంగా వుంటారు. అమ్మవారికి సహకార శక్తులుగ వుంటారు. వీరు కూడా యుద్ధం లో విజృంభించారు.

ముఖ్యంగా

"శ్రీనాథాది గురుత్రయం గణపతిం పీఠత్రయం భైరవం

సిద్ధౌగం వటుకత్రయం పదయుగం దూతీక్రమం మండలం

వీరాన్ద్వ్యష్ట చతుష్కషష్టినవకం వీరావళీ పంచకం,

శ్రీ మన్మాలిని మంత్రరాజ సహితం వందే గురోర్మండలం"

అని ప్రత్యేకించి అమ్మవారు లలితాదేవీ ఆరాధన లో గురుమండలాన్ని స్మరిస్తారు.ఈ గురుమండలం అంతా అమ్మవారి స్వరూపమే కనుక గురుమండల రూపిణి అని అంటారు.అందులో వటుక త్రయం అనే మాట వున్నది.ముగ్గురు వటుకలు.వీళ్ళు గురు రూపాలు.గురువు అనగానే అజ్ఞాన నాశనమే,అసుర సంహారము అంటే అజ్ఞన శక్తుల నాశనమే కదా!!!అందుకే అక్కడ చెప్పబడ్డ ముగ్గురు వటుకలు ఎవరంటే వటుక త్రయం అంటామే వాళ్ళు ఎవరో తెలియాలి.వాళ్ళు స్కంద వటుక, విరించి వటుక,చిత్ర వటుక అని ప్రధానంగా ముగ్గురు వటుకలు అక్కడ చెప్పబడుతున్నారు.వీరు కాక వటుక శక్తులు అని చాలా వుంటయి.వటుక శక్తుల యొక్క ప్రధాన లక్షణం ఏమిటంటే భయాలను,ఆపదలను తొలగించి శుభాలను కలిగిస్తారు.అందుకు వటుక స్మరణ చాలు మనకు అభయాన్ని కలిగిస్తుంది. వీరు జ్ఞాన స్వరూపులు,వీర స్వరూపులు,క్షేమ

స్వరూపులు,శుభ స్వరూపులు.అలాంటి వటుకలు అక్కడ యుద్ధభూమిలో విజృంభించి అసుర సంహారంలో వున్నారు. అలాంటి "ఆపదుద్ధారక వటు సమూహంతో వున్న ఓ దుర్గమ్మా జయ జయ అని ఈ శ్లోకం యొక్క భావం

****************************************

11. (Part 1)

11)**మహిత-మహాహవ-మల్లమ తల్లిక-మల్లిత-తల్లక-మల్లరతే**

**విరచిత వల్లిక వేల్లిత గల్లక మల్లిక భిల్లిక వర్గయుతే**

**సిత-కృతఫుల్ల-సముల్లసితారుణ-పల్లవ- తల్లజ సల్లలితే**

**జయ జయ హే మహిషాసుర-మర్దిని రమ్య కపర్దిని శైలసుతే**

ఈశ్లోకంలో అమ్మవారి యొక్క వీరమూర్తిని,సుకుమారమైనటువంటి సౌందర్య స్వరూపాన్ని రెండింటినీ ఇక్కడ చెప్పటం జరుగుతోంది.

ఇందులో మొదటి పాదంలో అమ్మ యొక్క వీరత్వాన్ని చూపిస్తున్నారు. తాను ఎవరెవరితో యుద్ధం చేసిందో ఆ రాక్షసవీరులందరూ సామాన్యులు కారు.ఆయుధ ప్రయోగాల్లో ఎంత నేర్పరితనము ఉన్నదో వారికి శారీరిక పాటవం లో కూడా అంత గొప్పతనము ఉన్నది.అందుకే ఒక్కొక్కరూ కూడా యుద్ధం లో ప్రవీణులు."మహిత-మహాహవ"గొప్ప గొప్ప యుద్ధాలలో శ్రేష్ఠమైన ప్రతిభ కలిగిన అసురులు.దానికి తోడు వాళ్ళకు దివ్యమైన మల్లయుద్ధం లో నేర్పరితనము ఉన్నది. "మల్లమ తల్లిక-మల్లిత-తల్లక-మల్లరతే"

ఆ మల్ల యుద్ధంలో వున్న రకరకాల పద్ధతులు,ఫక్కీలు అవి మల్లిక తల్లక మొదలైన పద్ధతులలో శ్రేష్టత్వం కలిగినటువంటి నైపుణ్యం కలిగినటువంటి వారు ఆ యోధులంతా.అలాంటి మల్లయోధులైనటువంటి మహా రాక్షసులను కూడా వారి పొగరు అణిచేలాగా అమ్మవారు ఆసక్తి గ యుద్ధం చేశారు.

పొగరు అణచేలా అమ్మవారు చాలా ఆసక్తి గ యుద్ధం చేశారుట.వాళ్ళతో యుద్ధం పై ఆసక్తి తో యుద్ధం చేసింది కనుక మల్లరతే.

యుద్ధం ఆసక్తి గా చేసింది. యుద్ధం చేసేటప్పుడు తప్పనిసరి గా యుద్ధం చేసేవాళ్ళు తమ ప్రతాపాన్ని గొప్పగా చూపించలేరు. ఆసక్తి గా యుద్ధం చేసేటప్పుడు మాత్రం అందు లో ఆందోళనా వుండదు, భయమూ వుండదు

ఏమీ వుండదు.ఒక ఆటలా వుంటుంది. అతి తేలికగానే తన పరాక్రమాన్ని ప్రదర్శించి సులభంగా అసురులను సంహరించింది అని చెప్పడం కోసం ఈ మాటలు చూపిస్తున్నారు రతే అనే మాట.యుద్ధములో ఆసక్తి కనబరస్తున్న తల్లి.

పైగా ఒక్కొక్కరూ మహా మల్లయోధులు.వారిని అవలీలగా ఓడించినటువంటి తల్లి.
"విరచిత వల్లిక పేల్లిత గల్లక మల్లిక భిల్లిక వర్గయుతే"

ఇక్కడ వల్లిక పేల్లిత అనే మాటలు వున్నాయి. చక్కగా చిత్రించబడినటువంటి లేఖనము కలది.ఎక్కడ అంటే "విరచిత వల్లిక పేల్లిత గల్లక" గల్లక అంటే చెక్కిళ్ళు అని అర్థం.ఆ చెక్కిళ్ళు మీద చక్కని చిత్రలేఖనము లిఖించబడి వున్నది.అంటే పూర్వకాలం స్త్రీ అలంకరణలో చెక్కిళ్ళ మీద కూడా చక్కని రంగుల తో చిన్న చిన్న అలంకారము వేసుకునే వారు.ఎలాగయితే గోరింట తో రకరకాల అలంకారాలు అరచేతులకు వేసుకుంటున్నారో, అప్పుడు అలాగ రకరకాల ఓషధీవిలువలతో కూడిన చూర్ణములతో వివిధ వర్ణములు కలిసేలాగా చెక్కిళ్ళ పై "మరకత పత్రములు" అంటారు.దీనినే "మకరికా పత్రములు" అని కూడా అంటారు.. అలా మకరికా పత్రములు చెక్కిళ్ళ పై లిఖిస్తారు.అలాగ అమ్మవారి చెక్కిళ్ళ మీద చక్కగా అలంకృతమై వున్నాయిట దివ్యమైన లేఖనములు.అందుకే "విరచిత వల్లిక పేల్లిత గల్లక" అనే మాటలో అర్థం ఇది. చక్కటి చిత్రలేఖనములు చెక్కిళ్ళ పై లిఖించబడి యుండగా ప్రకాశిస్తున్నది జగదంబ.

"మల్లిక భిల్లిక వర్గయుతే" ఇంకా అమ్మ కొప్పు లో రకరకాల కుసుమాలు ధరించి వున్నది. మల్లికా కుసుమములు, లొత్తుక కుసుమములు-ఇవి కూడా తెల్లగా వుంటాయి.భిల్లిక అంటె లొత్తుక పువ్వులు అని అర్థం.మల్లిక భిల్లిక మల్లెపువ్వులు లొత్తుక పువ్వులు మొదలైనవన్నీ ధరించి వున్నది.అవి కొప్పు నిండా నిండి పోయి చెవులనించి కిందకు వస్తూ కనిపిస్తున్నాయి. అంత విస్తారమైన కుసుమములు తన తలపై ధరించియున్నది.

ఇక్కడ మొదటి పాదంలో వీరత్వాన్ని చూపిస్తున్నారు.వెంటనే రెండవ పాదంలో అంత వీర సౌందర్యం లో కూడా పూల అలంకరణలు, చెక్కిళ్ళపై మకరికా పత్రముల అలంకరణలు కూడా చూపిస్తున్నారంటే అమ్మ ఆ వీరత్వం ప్రకటిస్తూచేస్తున్న యుద్ధం కూడా ధ్యానయోగ్యమైన దివ్యమంగళ విగ్రహమే అని చెప్పటం ఇందులోని ప్రత్యేకత.అందుకు ఒకవైపు సుకుమారాన్ని చూపిస్తున్నారు మరొకవైపు దివ్య ప్రతాపాన్ని చూపిస్తున్నారు. ప్రతాప,ప్రసన్న భావాల కలయికే అమ్మవారు.

ఈ ప్రసన్న భావం జగతిపై కారుణ్యాన్ని చూపిస్తున్నది.ఆ ప్రతాప భావం అసురులపై కాఠిన్యభావాన్ని చూపిస్తున్నది.అంటే అధర్మ శిక్షణ, ధర్మ రక్షణ రెండూ కలిగినటువంటి తల్లి కనుక కారుణ్య కాఠిన్యాలు రెండూ అమ్మయొక్క అద్భుతమైన కృపాస్ఫూర్తికి నిదర్శనములే.ఆ కాఠిన్యము కూడా కారుణ్యము లో భాగమే!!!అది కూడా సౌందర్యవంతంగ వుంది. అది వీర సౌందర్యం అయితే ఇది అలంకార సౌందర్యము. కనుకనే ఈ మూర్తి ని వీర శృంగారమూర్తి అని భావించవచ్చు.

11th Stotram part 2

"సిత-కృతఫుల్ల-సముల్ల సితారుణ-పల్లవ- తల్లజ సల్లలితే" అమ్మ యొక్క తనువు ఎలా వుందంటే సుకుమారంగా వుంది.సల్లలితే అన్నారు అంటే సుకుమారతలో కూడా ఇంకా గొప్ప భావం వున్నది.అలాంటి గొప్ప సౌకుమార్యం కలిగిన తనువు తో వున్నది.ఎలాంటి సుకుమారం అంటే చిగురుటాకుల వంటి సుకుమారము.ఆ చిగురుటాకులు కూడా తెల్లని కుసుమాల తో కూడినటువంటి వృక్షములకి ఆ చిగురుటాకులు తొడిగినప్పుడు,ఒకవైపు తెల్లదనమూ కనబడుతూవుంటుంది

చిగురుటాకుల యొక్క ఎర్రదనమూ కనబడుతూవుంటుంది.

అందుకే సిత కృత అంటే తెల్లదనము తో కూడినటువంటి

"ఫుల్ల-సముల్ల సితారుణ" చక్కగా  వికసించిన తెల్లని పూలతో ఆ తీగలకు చిగుళ్ళు కూడా వుంటే చిగుళ్ళు అరుణ పల్లవ లేత ఎరుపుకాంతులతో వున్నాయి. ఇలా తెలుపు ఎరుపు కలిసిపోయి వున్నటువంటి సుకుమారమైనటువంటి పూల తీగ ఎలావుంటుందో అలా వుంటుంది అమ్మవారు.

అంటే అమ్మ శరీరంలో కనబడుతున్న శోభ ఎరుపు పసుపు రెండిటి యొక్క కలయిక తో వున్నది.ఎరుపు పసుపు కలయిక ఎలా వున్నదంటే ఫుల్ల కుసుమాలతోను చిగుళ్ల తో వున్న తీగ వలే వున్నది.సల్లలితే  అంటే లలిత భావము.లలిత అంటే సౌకుమార్యం అని ఒక అర్థం ఇంకొకటి లావణ్యము అని ఇంకొక  అర్థం.లావణ్య సౌకుమార్యాలతో అమ్మ భాసిస్తోంది.

Copyright@gurujnanam.org

అయితే ఇక్కడ తెలుపు ఎరుపు చెప్పడంలో ఒక ప్రత్యేకత వుంది.

అమ్మవారు శివశక్త్యైక్య రూపిణి.ఈ వర్ణములన్నీ కూడా వివిధ భావాలకి సంకేతము.ఇక్కడ చూపించిన మల్లికా ఇత్యాది శబ్దములన్నీ అద్భుతమైన మంత్ర సంకేతాలను, శాస్త్ర సంకేతాలను కలిగి వున్నాయి.తెలుపు ఎరుపు అనేటప్పుడు అమ్మవారి యొక్క శివశక్తి స్వరూపాన్ని  భావించాలని శ్రీ విద్యా శాస్త్రం బట్టీ మనం చెప్పవచ్చు.

"రక్త శుక్ల ప్రభామిశ్రం అతర్క్యం త్రైపురం మహః."

అని వర్ణించారు.ఆ దివ్య తేజస్సు రక్త శుక్ల ప్రభామిశ్రం.  సహస్రార కమలంలో భాసించేటటువంటి ఆ శివశక్తుల దివ్య చరణాలను, ఆ గురు మండలరూపిణి యొక్క దివ్య చరణాలని ధ్యానించేటప్పుడు "రక్త శుక్ల ప్రభా మిశ్రం" అంటే తెలుపు ఎరుపు కాంతులతో కూడినది అని అర్థం.

తెలుపు ప్రకాశ స్వరూపం. ఎరుపు విమర్శ స్వరూపము అంటారు. విమర్శ అంటే వ్యాపకత్వం "విమర్శ రూపిణీ విద్యా వియదాది జగత్ప్రసూః"లలితా సహస్రనామాలులో చదువుతున్నాము.

విమర్శ అంటె వ్యాపకత్వము. శక్తి యొక్క లక్షణము వ్యాపకత్వము.అలా వ్యాపింపచేసినటువంటి తేజస్సు ప్రకాశ స్వరూపం అని చెప్పబడుతుంది.అందుకే ప్రకాశ విమర్శ ఇదే శివ శక్తి అని చెప్పబడుతుంది.ప్రకాశ స్వరూపుడైన శివుడికి సంకెతమైన వర్ణము తెలుపు,విమర్శ స్వరూపమైన శక్తికి సంకేతం ఎరుపు.

ఈ రెండిటి కలయికలోనే "సితారుణ-పల్లవ- తల్లజ సల్లలితే"

సిత అరుణ సిత అంటే తెలుపు అరుణ అంటే ఎరుపు.ఈ తెలుపు ఎరుపులతో కూడినటువంటి చిగురులు కుసుమములు మొదలైన వాటి వలే సుకుమారముగా వున్న తల్లి. అమ్మ సౌకుమార్యం లో ఈ రెండు వర్ణములు చెప్పటంలో ప్రకాశ విమర్శ భావం చూపిస్తూ శివశక్త్యైక్య

రూపిణిగా జగదంబని ధ్యానించాలనేటటువంటి ఒక అద్భుతమైన ఉపాసనా సంప్రదాయాన్ని ఈ శ్లోకంలో నిబద్ధం చేశారు రామకృష్ణ కవి.అంత దివ్యంగా శోభిల్లుతున్నది ఈ శ్లోకం.

శబ్ద సౌందర్యము 3వ పాదం లో

"సిత-కృతఫుల్ల-సముల్లసితారుణ" సితకృత అని ప్రారంభిస్తూ సముల్లసితారుణ అన్నారు.

లసితా అంటే ప్రకాశిస్తున్న అని అర్థం.అక్కడ సిత తో మొదలుపెట్టి లసితా అని తీసుకుని రెండుమార్లు సిత శబ్దం వచ్చేటట్టు చేస్తూ అర్థంలో మాత్రం మార్పు చూపించారు.సిత లసిత అరుణ ఈ మూడు శబ్దములతో రమణీయమైన శబ్ద సౌందర్యాన్ని ఆవిష్కరిస్తూ అమ్మవారి యొక్క వీరశృంగార సౌందర్యాన్ని ఇందులో ప్రత్యక్షం చేశారు రామకృష్ణ కవి జగదంబని.

****************************************

12 (part 1)

12) **అయి సుమనః సుమనః సుమనః సుమనః సుమనోహర కాంతియుతే**

**శ్రిత రజనీ రజనీ రజనీ రజనీ రజనీకర-వక్త్రయుతే**

**సునయన విభ్రమర భ్రమర భ్రమర భ్రమర భ్రమరాధిప విశ్వనుతే**

**జయ జయ హే మహిషాసుర మర్దిని రమ్య కపర్దిని శైలసుతే**

1.ఇది ఒకేలా వినబడే శబ్దములతో వింటూ వుంటేనే రమ్యమైన సంగీతం లా ధ్వనిస్తున్నది.దానిలో అద్భుతమైన భావాలను ఆవిష్కరించారు.

ఒకే శబ్దం వరుసగా వినిపిస్తూవుంటే సంగీత పరమైన ఒక సౌందర్యం ఆ శబ్దాల్లో వినబడుతూవుంటుంది.

అయితే ఒకే అర్థం తో ఒకే శబ్దం తో మాటి మాటికీ అంటే మాత్రం అది దోషమే. అర్థాలు మారిపోవాలి.లేదా సందర్భం బట్టి ఒకే అర్థం వున్నప్పటికీ సందర్భం మారుతూవుంటే విశేషమైన అర్థాలు స్ఫురిస్తూవుంటాయి.అందుకు ఒకే భావం తో శబ్దాన్ని అదే నడిపితే మాత్రం కావ్యం పరంగా దోషం అనిపిచ్చుకుంటుంది.సంగీత పరంగా సుకుమారం వున్నా. కాని ఇందులో కావ్యపరమైన దోషం ఏదీ లేకుండా, పునరుక్తి అనేది లేకుండా చక్కని భావాలతో కొనసాగింపుతోనే ఈ పదాలు కూర్చటం జరిగింది.

ఇది గుర్తు పెట్టుకోవాలంటే పెద్ద శ్రమ ఏమీ అఖరలేదు.ఒక శబ్దం ఒక్కొక్క పాదం లో 5 మార్లు వస్తోంది. అది గుర్తుపెట్టుకుంటే చాలు. సుమనః అనే పదం 5 మార్లు వచ్చింది. రజనీ శబ్దం.5 మార్లు వచ్చింది.భ్రమర శబ్దం 5 మార్లు ఈవిధంగా 5

మార్లు వచ్చినవి గుర్తు పెట్టుకుంటే తర్వాత పదాలు జాగ్రత్తగా విడదీసుకంని అర్థావిష్కారం చేసుకోవచ్చు.

ఇందులో వున్నటువంటి దివ్యమైన మహిషాసుర మర్దిని సౌందర్యాన్ని ఇప్పుడు పరిశీలించబోతున్నాము.

సుమనః అనే శబ్దానికి వివిధములైన భావాలు వున్నాయి.ఒకటి మంచి మనస్సు అని అర్థము. సుమనస్సులు అంటే దేవతలు అని అర్థము.ఇంకోటి కుసుమములు అని అర్థం.అంటే సుమనః శబ్దానికి మూడురకాలైన అర్థాలు వున్నాయి శబ్ద శాస్త్రం లో.మూడు రకాల అర్థాలతోనూ చక్కటి సమన్వయంతో ప్రతి వాక్యం కూర్చబడినది.

సుమనస్సులు లోకంలో శుద్ధమైన సత్వగుణంతో కూడి ఉపాసన,జ్ఞానము, విచారణ ఇత్యాది మార్గాలలో వున్నటువంటి వారు సుమనస్కులు.

వాళ్ళ వల్ల లోకానికి ఎప్పుడూ క్షేమమే కలుగుతూవుంటుంది.ఇతరుల మేలుకోరే మనస్సుని సుమనస్సు అనాలి.సత్వగుణంతో పరమార్థ దృష్టి తో సాగేవారి మనస్సులు కూడా సుమనస్సులు అనాలి.

కనుక సత్పురుషులు అని మొదటి అర్థం తీసుకోవాలి.రెండవది దేవతలకు కూడా సుమనస్సులు అనే శబ్దం వున్నది.అంటే వాళ్ళు సమస్త జగతి యొక్క మేలుకోరుతూ వుంటారు.వాళ్ళ మనస్సులో ఎప్పుడూ కీడు కలిగించే ఆలోచనలు రావు.వాళ్ళ స్వభావమే పేరు.

అందుకు మంచితనం,మేలుకలిగించేటటువంటి స్వభావము దేవతలకు సహజంగా వున్నది కనుక వాళ్ళని సుమనస్సులు అంటారు.

సౌమనస్య భావం అంటే ఒకరి పట్ల ఒకరికి ద్వేషం ఇత్యాదులు లేకుండా వుండే భావాన్ని సౌమనస్య భావం.ఈ సౌమనస్య భావం ఏర్పడితే లోకం లో శాంతి వుంటుంది. అలాంటి శాంతి కలిగించే దేవతలు యొక్క స్వభావమే సుమనస్సులు. ఇంకోటి కుసుమాలకు కూడా సుమనస్సులు అని పేరు వున్నది.ఎందుకంటే పువ్వుల్లో చెడ్డవి అని చెప్పేవి అంతగా ఉండవు.

పువ్వులు ఎప్పుడూ కూడా సుకుమారంగా వుంటాయి.అదేవిధంగా చక్కని వర్ణంతో వుంటాయి.మకరందంతో వుంటాయి.అన్నీ మేలు లక్షణాలు వుంటాయి.

అంతేకాదు వికసించిన పువ్వు ను చూస్తే మన మనస్సు ముందు శాంతాన్ని పొందుతుంది.మన మనస్సులో దుర్భావాలు కూడా పోతాయి.అందుకే చక్కటి కుసుమాలను చూసినప్పటికి కూడా సత్వగుణం బాగా వృద్ధి చెందుతుందట.

అందుకే పూల తోటల్లో సంచరించటం పువ్వులను భగవంతుడికి సమర్పించటం వీటన్నిటిలో కూడా ఇలాంటి పరమార్థం వుంది.ఒక్కో కుసుమం ఒక్కో మంచి భావానికి సంకేతం.దీనికి మంచి పరిశోధనలు చేసి శాస్త్రాంశములు కూడా బయటకు తీసుకువచ్చారు కొంతమంది. ఒక్కొక్క కుసుమంలో ఒక్కొక్క సద్భావం వుంటుంది. అందుకే భగవంతుడికి ఒక్కొక్క పువ్వు ఇవ్వడం అంటే ఒక్కొక్క సద్భావాన్ని భగవంతుడికి సమర్పించటమే అందులో భావం. Stotram 12 – (part 2)

సుమనః సుమనః మొదటిది మంచి మనస్సు కలవారు అని అర్థం. రెండవది దేవతలు అని.

తర్వాత వచ్చిన శబ్దములు సుమనఃసు అంటేదేవతలకు చెందినటువంటి కుసుమములు అని అర్థం.అలాంటి దేవతలకు చెందిన కుసుమములు వలే మనోహరమైన కాంతి తో ప్రకాశిస్తున్నది.అంటే అమ్మ, దేవతలకు గానీ సత్పురుషులకు గానీ ఎలా గోచరిస్తోంది అంటే దేవకుసుమముల కాంతి తో గోచరిస్తుందిట.దేవ కుసుమములు అంటే కల్పవృక్ష కుసుమములు.

కల్పవృక్ష కుసుమములు వలే సుకుమారమైన, సౌందర్యవంతమైన, శాశ్వత సౌందర్యం కలిగిన శోభ తో అమ్మవారు ఉన్నారు.

కల్పవృక్ష  కుసుమాలు వాడవు.అవి అత్యద్భుతమైన లావణ్యం తో వుంటాయి.

అలాగ దేవ కుసుమాలు అనగానే అది అలౌకికం అని చెప్పటం ఇందులోని ఉద్దేశ్యం. అలౌకికమైనటువంటి  కుసుమ లక్షణములు.

కుసుమ లక్షణములు అంటే సౌకుమార్యము మకరందము శోభ ఇవన్నీ అమ్మ యొక్క శరీరం లో వున్నాయట.

కుసుమ కోమలం అంటాము కదా !!!

అమ్మ శరీరము అత్యంత సుకురముగా వున్నది.కుసుమాల వలే సుగంధ బంధురముగా వున్నది.లావణ్యం తోనూ శోభిల్లుతున్నది.కానీ అది శాశ్వతమైన లావణ్యం అందుకే దేవతా కుసుమాలు అని చెప్పారు ఇది ఎవిరికి గోచరిస్తున్నది!!!?అలాంటి కుసుమ సదృశమైన కాంతి తో  అంటే

సత్పురుషులకు,దేవతలకు అలా కనబడుతోందిట.అంటే అసురుల కు మరోలా కనపబడుతోందన్న మాట.

ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా అమ్మవారు కనబడుతున్నారు. అందుకే ఆ తల్లి పాదాల్ని ధ్యానిస్తే "కొలుచు దేవ కన్యలెరుగు ఈ పద లాలిత్యము తలపడు దానవుల కెరుక తల్లి కాళ్ళ కాఠిన్యము, సుజన రక్ష కుజన శిక్ష సులభముగా చేయునివియే సర్వ మంగళముల నిధులు జనని లలిత చరణములు"

అమ్మ పాదములు ఎంత మెత్తవో ఆ పాదాల్ని తాకి నమస్కరిస్తున్న దేవకాంతలకు తెలుసుట!!!అమ్మ పాదములు ఎంత కఠినమైనవో ఆ కాలి దెబ్బ తిన్నటువంటి అసురుల కు తెలుసుట.అంటే అసురులను తన్నేటప్పుడు ఆ పాదములు మహా కఠినంగా ఉంటున్నాయి.దేవతలు కొలిచేటప్పుడు సుకుమారంగా వున్నాయట.స్వభావం సుకుమారం అంటే ఎప్పుడూ సుకుమారంగా వుండాలి.స్వభావం కాఠిన్యము ఉంటే ఎప్పుడూ కాఠిన్యముగా వుండాలి.కానీ అమ్మ యొక్క స్వరూపం ఎలాంటిది అంటే వారి వారి భావాలకు తగ్గట్టు అమ్మ అనుగ్రహం ఉంటుంది.

అసురుల పాలిట కాఠిన్యము కనబడినా సత్పురుషులకు మాత్రం ఆ తల్లి కుసుమ సుకుమారమైన శాశ్వత లావణ్యం తో కనబడుతున్నది. వారు ధ్యానించినా దర్శించినా కూడా అమ్మవారు సుకుమార భావంతో చూస్తోందిట వారిని. అంటే అటువంటి సత్పురుషుల పట్ల వాత్సల్య భావంతోను కారుణ్య భావంతోను అమ్మ చూస్తున్నది. కారుణ్య వాత్సల్య భావముల మిశ్రితమైన సౌందర్యాన్ని దేవతా కుసుమములు అనగా కల్పవృక్ష కుసుమములు వంటి కాంతితో వున్న తల్లి.

"అయి సుమనః సుమనః సుమనః సుమనః సుమనోహర కాంతియుతే" అనే మాటలో వున్న ప్రత్యేకత ఇది.

దేవతలకు,సత్పురుషులకు చక్కని దేవతా కుసుమముల వంటి కాంతి తో సుమనోహరమైన అంటే చూడగానే మనస్సుని మైమరిపింప చేసేటటువంటిది అమ్మ స్వరూపము.అటువంటి అమ్మ స్వరూపాన్ని చూస్తే ఇంక లౌకికము వైపుకి వెళ్ళదు. లయము అయిపోతోంది."మనస్సు ను హరించుట" ఈ మాట చాలా విశేషమైనది.

ఎందుకంటే మనోహరము అనే మాట లోకంలో మనము అనేకమైన సౌందర్య విషయాలు చెప్పేటప్పుడు అంటాము. కానీ ఆ అర్థం లో తీసుకోకూడదు ఇక్కడ.

ఏ పరతత్త్వాన్ని చూస్తే మనస్సు లయింపబడుతుందో అదే మనోలయం. అటువంటి దివ్యమైన పరతత్త్వమే అమ్మవారు.సుమనోహరా అంటే మిక్కిలి గా మనస్సు ను హరించునది,మనస్సు ను లయింపచేయు తేజఃస్వరూపిణి పరంజ్యోతి స్వరూపిణి అమ్మవారు అని ఇందులోని భావము.

Stotram 12- (part 3)

"శ్రిత రజనీ రజనీ రజనీ రజనీ రజనీకర-వక్త్రయుతే" ఇందులో వున్న భావము రజనీ అనే శబ్దము లో కూడా మూడు రకాల భావం తీసుకోవచ్చు.రజ రజనీ నీరజనీ ఈ మూడు శబ్దములుగా రజనీ శబ్దాన్ని ఇక్కడ విభజన చేశారు.శ్రిత రజ-నీరజ- నీరజనీ - రజనీ -రజనీకర వక్త్రయుతే ఇలా ఐదు విభజనలు చేస్తే దీనికి అద్భుతమైన అర్థం వస్తుంది.

శ్రిత రజ -రజ అంటే రజోగుణము అని అర్థము.రజో గుణాన్ని ఆశ్రయించినటువంటి వారు నీరజ -రజో గుణము లేనటువంటి వారు.అమ్మవారి భక్తులలో రెండు రకాల భక్తులు వుంటారు.

భక్తులు అనేకన్నా జీవులలో రెండు రకాలు.కొందరు రజో గుణంతో కూడి వుంటారు. శ్రిత రజ రజో గుణాన్ని ఎప్పుడూ పట్టుకుని వుంటారుట.ఎప్పుడూ రజో గుణాన్నే ఆశ్రయించుకుని వుంటారు.రజోగుణము యొక్క లక్షణం ఏమిటంటే అది కామ క్రోధాలను పుట్టిస్తూ వుంటుంది.

"కామ ఏష క్రోధ ఏష రజో గుణ సముద్భవః"అని కృష్ణ పరమాత్మ భగవద్గీత లో చెప్పినటువంటి మాట.కామ క్రోధాలకు మూలమైన గుణం రజో గుణం.అలాంటి రజో గుణాన్ని పట్టుకు కూర్చున్నవారు అంటే అసురులు అని అర్థం.వాళ్ళు ఎప్పుడూ కామ క్రోధాలతో అల్లల్లాడి పోతుంటారు.

కూడని కోరికలు కలుగుతాయి.అవి తీర్చుకోవటానికి తమ శక్తి చాలక తపస్సులతో బలం తెచ్చుకుని మరీ తీర్చుకుంటారు.ఆ కోరికలకు అడ్డు ఎవరైనా వస్తే వారిపై క్రోధం తో హింస చేస్తూ వుంటారు.

కనుక రజో గుణం కరుడు కటితే రాక్షసత్వం అని చెప్పబడుతుంది. అలాగే శ్రిత రజులు అంటే రాక్షసులు అని అర్థం.

నీరజ అంటే రజోగుణము లేనటువంటి వారు. సత్వగుణాన్ని ఆశ్రయించినటువంటి భక్తులు. ఇలా రెండు రకాల వాళ్ళు వుంటారు లోకంలో వాళ్ళు శ్రిత రజ - నీరజ.

వాళ్ళ ఉభయులకు రెండు రకాలుగా అమ్మ కనబడుతుందట. పైన చెప్పిన విధంగా సుమనః శబ్దం తో సత్పురుషులకు దేవతలకు సుమనోహరమైన కాంతితో గోచరిస్తోంది అమ్మ అని..

ఇంత వరకూ దేవలోకంలో విషయం చెప్పారు.

ఇప్పుడు భూలోకము నందు అసురులు, మానవులు. మానవుల్లో నీరజులు అనగా రజోగుణము లేనటువంటి వారు సాత్వికులు, సత్పురుషులు వుంటారు.వీరు ఉభయులకు అమ్మ రెండు రకాలుగా గోచరిస్తోంది.

అది ఎలాగో వర్ణిస్తున్నారు ఇక్కడ.

Stotram 12(part 4)

నీరజనీ రజనీ =నీర జనీ - నీర నీరము అంటే జలము జనీ అంటే కలిగించునది, పుట్టించునది అని అర్థం.అనగా మేఘము.నీరజనీ అంటే మేఘము అలాంటి మేఘములు ఆక్రమించుకున్న దట్టమైన రజని అంటే రాత్రి చీకటి.ఆ చీకటి లో కూడా కారు మబ్బులు కమ్ముకున్న కటిక చీకటి రాత్రి.మామూలుగా మబ్బులు లేకపోతే వెన్నెల కాంతి అయినా వుంటుంది. చంద్రుడు కూడా కనబడకపోతే నక్షత్రాల కాంతి అయినా వుంటుంది. అలాంటిది కారు మబ్బులు కమ్ముకు పోయాయా ఇంక అసలు వెలుగు కనిపించే అవకాశమే లేదు.అంత దట్టమైనటువంటి కారుమబ్బులు కమ్ముకున్నటువంటి కాళ రాత్రి లా అమ్మ యొక్క స్వరూపం ఉంది.ఎవరి పాలిట శ్రిత రజ అంటే రాక్షసుల పాలిట కాళరాత్రి లా అమ్మ యొక్క స్వరూపం వుందిట.

దట్టమైన అంధకారం బంధురమైన

కాళీ స్వరూపాన్ని ఇక్కడ చెపుతున్నారు." కాళ రాత్రి ఉగ్ర రూపము."కోపేచ కాళికా రూప" అంటోంది శాస్త్రం.కోపంతో కనిపించే స్వరూపం కాళీ అని అంటారు. జగత్తునంతటినీ ప్రళయకాలంలో గ్రసించేటప్పుడు అలాంటి మహా క్రోధంతో అమ్మ వస్తుంది.అప్పుడు అలా రావాలి.ఆ వచ్చిన రూపం కాళీ.అసురుల పాలిట "నీరజనీ రజనీ"అలాంటి మబ్బులు కమ్మిన కాళరాత్రి వలే అసురుల పాలిట కనబడుతున్నది.ఇక "నీ రజ" రజో గుణములేని సత్వగుణ సంపన్నుల భక్తులకు ఎలా కనపడుతోంది అంటే "రజనీకర వక్త్ర" రజనీకరుడు అంటే చంద్రుడు అని అర్థం.రాత్రి ని కలిగించువాడు,రాత్రి పూట వెలిగిపోయేవాడు రజనీకరుడు. అందుకు నీరజుడు అనగా రజోగుణము లేని వారి పట్ల రజనీకర చంద్రుని వంటి ముఖము తో ప్రకాశించువాడు.అలాగ రజోగుణము ఉన్న వారి పట్ల కాళరాత్రి గానూ, సత్వగుణ సంపన్నులైన భక్తులకు చంద్ర వదనంతోను సాక్షాత్కరించే జగదంబ.

12th stotram part 5

మొదటి వాక్యంలో సత్పురుషులకు,దేవతలకు అమ్మవారు ఈ విధంగా కనబడుతున్నది, దేవతా కుసుమములైన కల్పవృక్ష కుసుమాలు వలే చక్కని మనోహరమైన కాంతితో సౌజన్య సౌశీల్య,వాత్సల్య సౌకుమార్య రూపంతో కనబడుతూ వున్నది అమ్మ.

అదేవిధంగా రజో గుణము కలిగినటువంటి రాక్షస లక్షణము కలిగినవారికి అమ్మవారు కాళరాత్రి లాగా గోచరిస్తే రజో గుణాది వికారములు లేని సత్వగుణ సంపన్నులకు పరిపూర్ణమైన చంద్రబింబము వంటి వదనంతో ఆహ్లాదకరమైన ప్రసన్నకరమైన కాంతులతో గోచరిస్తున్నది. ఇది రెండు వాక్యములకు అర్థం.

ఇంక మూడవ వాక్యం లోకి ప్రవేశిస్తున్నాము.ఈ మూడవ వాక్యంలో కొన్ని పాఠాంతరాలు కనబడుతున్నాయి. ఒక్కొక్కరూ ఒక్కొక్క రకంగా అర్థాలు చెప్పారు. ఎవరి మేరకు వాళ్ళు సరిగ్గా చెప్పినట్లే భావించారు. ఆ అర్థాలు చూస్తే సమంజసంగానే అనిపిస్తాయి.అసలు పాఠం ఏమిటా అనేది పట్టుకోవాలి.

ఎందువల్ల అంటే మొదట్నించి ఒక ప్రణాళిక వుంది ఈ శ్లోకంలో. ఎలా అంటే సుమనః శబ్దం ఐదు మార్లు వచ్చింది. రజనీ శబ్దం ఐదు మార్లు వచ్చింది. అదేవిధంగా భ్రమర శబ్దం కూడా ఐదు మార్లు వస్తే ఒక సమతూకం వుంటుంది ఈ శ్లోకంలో.

అందుకే ఈ రెండవ పాఠం

ఐదు మార్లు భ్రమర శబ్దం తో వచ్చింది మాత్రమే గ్రాహ్యము అని చెప్పాలి.

ముందుగా ఇక్కడ కనబడే రెండు పాఠములు

1.సునయన విభ్రమర భ్రమర భ్రమర  భ్రమరాధిప విశ్వనుతే.

2..సునయన విభ్రమర భ్రమర భ్రమర భ్రమర భ్రమరాధిపతే

ఇందులో భ్రమర శబ్దం ఐదు మార్లు వస్తుంది. అయితే ఈ 2వ పాఠమే సమంజసము అని చెప్పవచ్చు.

సునయన -విభ్రమర భ్రమర -భ్రమర భ్రమర భ్రమరాధిపతే

ముందుగా "సునయన -విభ్రమర భ్రమర" - విభ్రమర అంటే ఆశ్చర్యమం తో కూడిన

విలాసము. అలాంటి విలాసముతో భ్రమర అంటే కదలికలు వేటి కదలికలు సునయన చక్కని కన్నులు.ఆ కన్నులు విలాసంగా కదిలిస్తోందట అమ్మవారు అటు ఇటు చూస్తూ యుద్ధభూమిలో సౌందర్యవంతమయిన ఆ కనులు విలాసముతో ఆశ్చర్యకరము గా అటు ఇటు చూస్తూ సంచరిస్తున్నాయి. ఈ.సంచారము ఎలా వుంది అంటే భ్రమర భ్రమర కదులుతున్న తుమ్మెదల పిండు (తుమ్మెదల బారు)లాగా వుంది.

కను చూపుల కదలికలను తుమ్మెదలతో పోల్చడమనేది స్తోత్ర సాహిత్యం లో కవి సంప్రదాయం అని అంటారు. ఇదే భావాన్ని తీసుకుని శంకర భగవత్పాదుల వారు కూడా కనకధారా స్తోత్రం లో చూపించారు."అంగం హరేః పులకభూషణ మాశ్రయంతీం భృంగాగనేవ ముకుళాభరణం తమాలం" లక్ష్మీ దేవి చూపులు ఎలా వున్నాయి అంటే తుమ్మెదల బారు వలే వున్నాయని అంటారు. అవి కూడా నిగ నిగ లాడుతూ వుంటాయి. కన్నులు,ఒకవైపు కనీనికలు అంటే రెప్పలకు వున్న చిన్న వెంట్రుకలను కనీనికలు లేక పక్ష్మములు అంటారు.ఈ పక్ష్మముల కాంతి కూడా నల్లగా వుంటుంది. దానికి తోడు నల్లని కనుగుడ్లు వీటికి విలాసముగా పెట్టుకున్న కాటుక మొదలైన వాటి యొక్క నలుపుదనము.

అక్కడ చుట్టూ తెల్లగా వున్నప్పటికీ, ఈ కాటుక కనీనికలు, పక్ష్మములు ఆ లోపల ఉన్న కనుగుడ్డ వీటన్నిటి నలుపు వల్ల కను చూపుని తుమ్మెదలతో పోల్చారు.

పైగా నిగ నిగ లాడుతున్న తుమ్మెద రెక్కలు వాటి కాంతులు చూస్తూ వుంటే ఆ లక్షణం ప్రకారం కూడా అమ్మ కంటి కాంతులలో వున్న నునుపుతనం కూడా తుమ్మెదల తో పోల్చడానికి సరిపోతుంది.

అలాంటి సు నయన చక్కని కన్నులట అమ్మ వారివి.

ఎందుకంటే కన్ను పేర్లన్నీ ఆ తల్లికే వున్నాయి. మీనాక్షీ, కామాక్షీ, విశాలాక్షీ, శతాక్షీ,సహస్రాక్షీ అని.అంత అందమైన నేత్రములు కనుకే ఆ నేత్రములను ఆధారంగా చేసుకుని అనేక నామములు మనకు శాస్త్రములలో చెపుతున్నారు. అలాంటి సు నయన చక్కని నయనములు. పైగా ఆ నయనములతోనే జగత్తంతటికి మేలు కలిగిస్తోంది. అమ్మ నయనములు సుందరమైన నయనములు, మేలుకలిగించే నయనములు. అలాంటి నయనములు చక్కని విలాసంతో కదులుతూవుంటే ఆ కదలికలు చూసి ఈ తుమ్మెదలను చూసి మరికొన్ని తుమ్మెదలు వచ్చినాయి. ఎందుకంటే తన జాతి వాళ్ళే కనబడితే ఆకర్షింపబడి స్నేహపూర్వకంగా వస్తారు.

12th stotram part 6

అలా అమ్మ యొక్క చూపులు బారులు అటు ఇటు తిరుగుతూ వుంటే మరికొన్ని తుమ్మెదలు కూడా అక్కడకు వచ్చాయట. అమ్మయొక్క కనుబొమ్మల కదలికలన్నీ చూసి ఆహా ఇవేవో చాలా బాగున్నాయే వీటిదగ్గిర మనం కూడా

సౌందర్యాన్ని నేర్చుకోవచ్చు తెలుసుకోవచ్చు అని ఆ తుమ్మెదలు అక్కడకు వచ్చాయి. అంటే తుమ్మెదలకి విలాసములు నేర్పుతున్నట్లుగా వున్నాయి అమ్మవారి యొక్క కను చూపుల కదలికలు అని చెప్పటం ఇందులోని ఉద్దేశ్యం.

ఈ చెప్పటంలో వున్న భావము ఏమిటంటే అమ్మవారు భ్రామరీ రూపంతో వున్నారు. భ్రమర అని నాద రూపంతో వున్నారు. భ్రమరాంబిక దేవీ "శ్రీ శైల స్థలవాసినీం భగవతీ శ్రీ భ్రామరీ" అని చెప్పబడినట్లుగా భ్రామరీ అనబడేది కూడా దుర్గా శక్తియే

దేవీ మాహాత్మ్యం లో అమ్మవారు స్వయంగా చెపుతారు.అరుణాసుర సంహారానికై నేను భ్రమరాంబ గా అవతరిస్తాను.ఇదొక నాదశక్తి.పైగా తన నేత్రముల నుండీ నాదశక్తి ఉత్పన్నం చేసిందిట.అరుణుడు అనే రాక్షసుడ్ని సంహరించటం కోసం అమ్మవారు తన నుండి అనేకములైన తుమ్మెద సమూహాలను పంపించింది.అవి వెళ్ళి రాక్షసులపై దాడి చేసాయి.ఆ రాక్షసుడు సంహరింపబడ్డాడు.అలాంటి భ్రమరములను తన నుంచి పంపించినటువంటి తల్లి భ్రామరీ అని చెప్పబడుతున్నది.

అలా ఎన్ని భ్రమరాలు పంపిందో కానీ అన్ని భ్రమరాలు కలిసి ఇక్కడ ఝుం ఝుంరావములు చేస్తున్నాయా  అన్నట్లు గా ఇన్ని విధాలుగా భ్రమర శబ్దం భ్రమించింది ఈ పాదంలో.

సునయన -విభ్రమర భ్రమర -భ్రమర భ్రమర భ్రమరాధిపతే

అని మొత్తం ఐదు మార్లు భ్రమర శబ్దాన్ని చూపించారు ఇక్కడ.

మొత్తానికి విభ్రమ భ్రమర అంటే కదలికలు విలాసములు ఆశ్చర్యములు ఇన్ని రకాల భావాలు తీసుకుంటూ ఆ తుమ్మెదల పిండు వలే కదులుతున్న అమ్మ చూపులు వర్ణించారు. భ్రామరీ దేవిని ఈ శ్లోకంలో ధ్వనింప చేశారు.

"భ్రమరాధిప" అంటే తుమ్మెదల రేడు అని అర్థం.తుమ్మెదలలో గొప్ప తుమ్మెదలు, కొదమ తుమ్మెదలు, మదించిన తుమ్మెదలు అని అర్థం. ఆ తుమ్మెదల వలె అమ్మ యొక్క అ కనుచూపుల కాంతులు సంచరిస్తూ వున్నాయి

12th slokam part 7

ఇప్పుడు మొత్తంగా ఈ శ్లోకంలో మనం గమనించవలసిన భావము ఏమిటంటే అమ్మవారి యొక్క రెండురకాల స్వరూపాలు చూపిస్తున్నారు సత్పురుషులకు దేవతలకూ ఉభయులూ మంచి మనసు కలవారు కనుక

వారికి మాత్రం కుసుమ కోమలంగా కారుణ్య భావంతో కనబడుతూ వుంది.దయ యొక్క స్వభావమే మెత్తదనం కనుక కుసుమాలతో పోల్చారు. అదేవిధంగా లోకంలో రెండు రకాల జీవులలో అసుర లక్షణం కలవారు దైవీ లక్షణం కలవారు వున్నారు. వీరే దేవాసుర గణములు.ఉభయులకు రెండు రకములుగా గోచరిస్తున్నది. అందుకే తన్ను లో నమ్మిన వేల్పుటమ్మల మనమ్ముల నుండెడి యమ్మ అంటారు పోతన గారు. సురారులమ్మ కడుపు ఆరడి బుచ్చెడియమ్మ అని కూడా అంటారు. ఈ రెండు వాక్యములలోనే రాక్షసులను కన్నతల్లికి కడుపు మంట పెట్టిన తల్లి అన్నారు. అంటే రాక్షస సంహారము చేయటం వల్ల రాక్షసుల తల్లికి దుఃఖము కలిగించినది అంటే రాక్షస సంహారము చేసినది అని అర్థం. వేల్పుటమ్మల మనంబుల నుండెడియమ్మ దేవకాంతల హృదయంలో వుంటుంది.

ఎందుకు వుంటుంది అంటే తన్ను లో నమ్మిన,అమ్మవారిని మనసారా నమ్మారు వాళ్ళు.సల్లక్షణములతో కూడి యున్నారు. సాత్విక గుణంతో వున్నారు కనుక వారి హృదయంలో వున్నది.

అందుకే ఎవరి హృదయంలో అసుర గుణాల పుట్ట వుంటుందో వారికి అమ్మవారు తప్పకుండా దుఃఖము కలిగిస్తారు శిక్షా రూపంలో.ఎవరి మనస్సు అమ్మనే నమ్ముతూ అదే తన్ను లో నమ్మిన అంతఃకరణ శుద్ధి తో విశ్వసించినటువంటి సత్పురుషులు ఎవరో వారి మనస్సు వేల్పుటమ్మలు అన్నారు. మన మనస్సు దైవీ గుణంతో ఉన్నట్లయితే అమ్మవారు సౌకుమార్య వాత్సల్య కారుణ్యాల రూపాలతో కనిపిస్తుంది.దీన్ని బట్టి సాధకుడికి అమ్మ యొక్క రెండు రకాల రూపాలు దర్శింప చేశారు.అయితే అసురుల పాలిట ఉగ్ర రూపం కూడా భక్తులు ధ్యానం చేస్తూ ఆనందిస్తారు.ఎందుకంటే ఆ ఉగ్ర రూపం కూడా మా అమ్మకదా అనే భావన వుంది.

అదేవిధంగా భ్రమరాంబికా అయిన దుర్గా స్వరూపాన్ని కూడా ఆవిష్కరించారు. పద చమత్కారంతో సౌందర్యాన్ని ఇవ్వడమే కాకుండా భావనా బలంతోనూ ఉపాసనా సమర్ధత తోనూ ఈ శ్లోకాన్ని అందిస్తున్నారు.

*******************************

13th slokam - part 1

13 th slokam - మహాలక్ష్మి స్తోత్రము.

13 )**అవిరళ గండగళస్ మద మేదుర మత్త మతంగజరాజ గతే**

**త్రిభువన భూషణభూత కళానిధిరూప పయోనిధిరాజసుతే**

**అయి సుదతీజన లాలస మానస మోహన మన్మధరాజ సుతే**

**జయ జయ హే మహిషాసుర మర్దిని రమ్య కపర్దిని శైలసుతే**

13th slokam మహిషాసుర మర్దిని ఉపాసనలోనే ఐశ్వర్యకరమైన లక్ష్మీతత్త్వం దాగివున్నది.కొన్ని దేవతలకు కొన్ని దేవతలతో సమన్వయం ఉంటుంది.అలా లక్ష్మి తత్త్వాన్ని కలబోసుకున్నటువంటి గొప్ప స్వరూపము మహిషాసుర మర్దిని రూపము.అందుకే శాస్త్రవేత్తలు ఈ స్వరూపాన్ని మహాలక్ష్మి గ కీర్తించారు.మొత్తం 18 చేతులతో వున్నటువంటి

"సేవే శైరభ మర్దినీం ఇహ మహాలక్ష్మీం సరోజ స్థితాం" అని వర్ణించారు.శైరిభి మర్దినీం అంటే మహిషాసుర మర్దిని అయినటువంటి తల్లిని మహాలక్ష్మి ని సేవిస్తున్నాము అని చెప్పటంలోనే మహిషాసుర మర్దిని మహాలక్ష్మి తత్త్వం యొక్క సమన్వయం గోచరిస్తున్నది.ఆ సమన్వయాన్ని గొప్ప ఉపాసకుడైన రామకృష్ణ కవి ఈ శ్లోకం లో చూపిస్తూ మహిషాసుర మర్దిని మహాలక్ష్మిగ ఐశ్వర్య దాయకము అవుతున్నది అని అన్నారు. ఈ శ్లోకాన్ని భక్తి తో అనుసంధానము చేస్తే తప్పకుండా దరిద్రాలు పోయి ఐశ్వర్యం లభిస్తున్నది.అది ఈ శ్లోకంలో వున్న ప్రత్యేకత.

అవిరళ-గండగళన్-మద-మేదుర-మత్త-మతంగజరాజ-గతే

ఇక్కడ సుతే శబ్దం మూడు పాదములలోనూ వాడబడుతోంది.మూడు పాదాలలో మూడు భావాలు ఉన్నాయి.మొత్తం ఈ శ్లోకం లో భావం ఏమిటంటే లక్ష్మీ దేవీ రూపంగా అమ్మవారు కనబడుతున్నారు.ఎందుకంటే దుర్గమ్మ అయినప్పటికీ ముగురమ్మల మూలపుటమ్మ .ఈ దుర్గమ్మే లక్ష్మి గాసరస్వతి గా ఆరాధించాలి. ముగ్గురు లో ఏ ఒక్కరిని ఆరాధించినప్పటికీ కూడా మిగిలిన రెండింటి యొక్క స్వరూపములు అందులో వుంది అనే భావనతో ఆరాధించాలి. ఎందుకంటే ఒకే తల్లి ముగురమ్మలగ అయినప్పుడు ముగురమ్మల లో ఒకే తల్లి లక్షణములు కనబడుతూ వుంటుంది అందుకే ఏ దేవతను కీర్తించినా ముగ్గురి లో మిగిలిన రెండింటినీ స్మరించటం అనేది ప్రతి స్తోత్రం లోనూ మనకు కనబడుతున్న అంశమే.

అందుకే లక్ష్మి అష్టోత్తర శతనామాల్లో కూడా "నవ దుర్గాం మహా కాళీమ్ బ్రహ్మ విష్ణు శివాత్మికామ్" అనే మాట వస్తుంది. చేస్తున్నది లక్ష్మి స్తుతి కానీ అక్కడ నవ దుర్గాం అనే మాట చూపించారు.అంటే లక్ష్మి దేవి యొక్క స్వరూపమే.

"వాచం పద్మాలయాం పద్మాం శుచిం స్వాహాం స్వధామ్ సుధామ్' అనే వాక్యం లో వాగ్దేవతగా లక్షీ దేవిని దర్శించారు.అంటే సరస్వతీ రూపాన్ని చూపించారు.

అలాగే లలితా సహస్రనామాలులో కూడా "మహాలక్ష్మిః మృడప్రియ సరస్వతీ శాస్త్ర మయీ" అని చెప్పడం వున్నది.అంటే జగదంబ ఒక్కరే .అదే విధంగా జగత్ జనకుడు కూడా ఒక్కడే. లోక రచన కోసం ఆ జగత్ జనకుడు "బ్రహ్మ విష్ణు రుద్రులు" అయినప్పుడు ఆ తల్లి కూడా సరస్వతి గా లక్ష్మి గా పార్వతి గా వ్యక్తమవుతున్నది. అప్పుడు మర్యాదలు మర్యాదలే. విష్ణు పత్ని గా లక్ష్మి ,

"దుర్గ అయితే విష్ణు సోదరి". రూపములు మారితే మర్యాదలు వుంటాయి.కానీ ఇక్కడ భావనలో మాత్రం అభేదాన్ని తెలుసుకోవాలి.

*******************************

13 th slokam part 2

ఐశ్వర్య దేవత అనగానే లక్ష్మీ దేవి అని సాధారణంగా శాస్త్రములు చెపుతున్న విషయం.అందుకు లక్ష్మీ దేవి గా అమ్మవారిని వర్ణించటం జరుగుతోంది.

"అవిరళ-గండగళన్-మద-మేదుర-మత్త-మతంగజరాజ-గతే"

అవిరళ అంటే ఎడతెగకుండా అని అర్థం.గండ గళత్ గండములు అంటే చెక్కిళ్ళు. చెక్కిళ్ళ నుండి స్రవిస్తున్నటువంటి మేదుర మద దట్టమైనటువంటి మదజలం తో కూడుకుని యున్న మద గజాలతో పరివేష్టితురాలైన తల్లి అని దీని భావం.

మొట్టమొదట మదగజములు ఎలా వున్నాయో వర్ణిస్తున్నారు. మంచి మదించినటువంటి జాతి ఏనుగులు ఏవైతే వుంటాయో ఆ ఏనుగుల యొక్క కుంభస్థలం నుంచి చెక్కిళ్ళ వైపు మదజలం

స్రవిస్తూ వుంది.అలాంటి మదజలం స్రవిస్తున్న ఏనుగు ఉత్తమ జాతి కి సంబంధించిన ఏనుగు గా శాస్త్రం వర్ణిస్తోంది.పైగా మంచి శ్రేష్ఠ భావాన్ని కలిగి వుంటాయి. పైగా మదజలం స్రవించుట కూడా ఐశ్వర్య భావన,మంగళకరమైన భావం.అలాంటి ఏనుగులు అమ్మ చుట్టూ కొలుచుకుంటున్నాయి.

ఇక్కడ పదములలో పాఠాంతరములు కనబడుతున్నాయి.దీని సమన్వయం ఎలా అంటే "మతంగజరాజ-పతే" మంచి గజరాజుల యొక్క ప్రభువులు అమ్మ చుట్టూ

కొలుచుకుంటున్నాయి. గజరాజుల్లో శ్రేష్ఠమైనవి అమ్మ చుట్టూ వున్నాయి అనేటటువంటి అర్థం లో ఒకటి,

"మతంగజరాజ-గతే అంటే గజము ఎంత గంభీరంగా గమనము చేస్తోందో అలాంటి గమనము చేస్తున్నది.ఉత్తమమైన రీవీ ఒలికే గమనాన్ని గజ గమనము తో పోలుస్తారు.సుకుమారమైన గమనము అయితే హంస గమనము తో పోల్చడము, ఒక రీవీ దర్పము ప్రకాశింప చేసేటటువంటి మహారాణీ నడకని గజ గమనము తో పోల్చడము శాస్త్రం లో వున్నది.అందుకే సామజ వర గమన అని రామచంద్రమూర్తి కి కూడా అంటారు. ఉత్తమ గతుల్లో గజ గతి ఒకటి,అశ్వ గతి ఒకటి ఇలా రక రకాల గతుల్ని చెప్పారు. అలాంటి చక్కని గమనము.అమ్మ గమనము ఎలా వుందంటే మంచి మదించిన ఏనుగు ఎంత గంభీరంగా గమనము చేస్తుందో అలాంటి గమనము చేస్తున్నది.ఎందుకంటే ఆవిడ మహారాణి.దర్పం ఒలుకుతుంది ఆవిడ యొక్క నడకలో.ఇది ఒక భావం.ఇంకోటి మదించిన ఏనుగులు అమ్మ చుట్టూ వుండి కొలుచుకుంటున్నాయి. అలాంటి మదించిన ఏనుగులకు ప్రభువులు. ఎందుకంటే దిగ్గజాలు అనగానే ఏనుగుల్లో ప్రభువులు వంటివే.ఐరావతము,సుప్రతీకము ఇత్యాది దివ్యమైన దిగ్గజములు.ఈ దిగ్గజములు అన్నీ అమ్మ ను కొలుచుకుంటున్నాయి. మనకు సాధారణంగా చిత్రలేఖనాలలో రెండు ఏనుగులు మధ్య గజలక్ష్మి ని చూపిస్తారు.

************************************

13th slokam part 3

దిగ్గజాలన్నీ వచ్చి అమ్మ కు అభిషేకం చేసినట్లు గా శాస్త్రం వర్ణిస్తున్నది.

"దిగ్ఘస్తిభిః కనక కుమ్భ ముఖావసృష్ట

స్వర్వాహినీ విమల చారు జలప్లుతాఙ్గీమ్

ప్రాతర్నమామి జగతాం జననీం అశేష

లోకాధినాథ గృహిణీం అమృతాబ్ధి పుత్రీమ్"

అని శంకరులు కనకధార లో అమ్మవారి ని భావన చేశారు.

దిగ్గజములు చుట్టూ చేరి దివ్యమైన తమ తుండములలో కనక కలశములు పట్టుకుని ఆ కనక కలశాలలో నుంచీ ఆకాశ గంగా జలాలను అమ్మవారికి అభిషేకిస్తున్నాయి.

అలా అభిషేకింపబడుతూ వున్న తల్లి

చుట్టూ దిగ్గజముల నడుమ కూర్చున్నటువంటి ఆర్ద్ర అయిన స్వరూపాన్ని ఎవరు ధ్యానిస్తారో వారి హృదయంలో తాపాలు పోతాయి,దరిద్రాలు పోతాయి.ఇదొక ధ్యాన ప్రక్రియ.అలా ఇక్కడ గజలక్ష్మి స్వరూపాన్ని మొదటి పాదం లో చెప్పారు.

"అవిరళ గండగళన్ మద మేదు రమత్త మతం గజరాజ పతే " ఇది గజలక్ష్మీ భావం.ఆది లక్ష్మి యొక్క భావం.*******************************

13th slokam part 4

త్రిభువన-భూషణభూత-కళానిధిరూప-పయోనిధి రాజసుతే

అమ్మ రూపం ఎలా ఉన్నదీ అంటే

త్రిభువన-భూషణభూత-కళానిధి

ముల్లోకాలకీ అలంకారముగా వున్నటువంటి కళానిధి .

ఇక్కడ కళ శబ్దానికి సంపదల సమృద్ధి,మూలద్రవ్య వృద్ధిః. సంపదలకు మూలమైనవి ఏవో వాటిని కళలు అని చెపుతారు.

అలాంటి సంపద్ మూలములు వృద్ధి చెంది, ఎడతెగకుండా తరుగుదల లేకుండా వుంటే నిధి అని భావము.

అందుకే సమృద్ధి =ఎక్కువగా వుండటం

నిధి = నిధి అంటే తరగకుండా వుండటం.

ఎక్కువగానూ,తరగకుండా సంపదల రూపం ట అమ్మవారు.

కళానిధి రూప ఇంత గొప్ప భావం వుంది. సమృద్ధి,అక్షయము భావాలు చెప్పటానికే కళా నిధి.

సంపదల యొక్క సమృద్ధి సంపదల యొక్క అక్షయత్వం అనగా తరుగుదల లేకపోవటం.

ఈ రెండూ అమ్మ యొక్క. రూపము.ఎలాంటి సంపదలంటే త్రిభువన భూషణ భూత ముల్లోకాల్లోని అలంకారముగా వున్నటువంటి సంపదల యొక్క సమృద్ధి వాటి యొక్క శ్రేష్ఠత్వం అని అర్థం.ఎన్నో సంపదలు వున్నాయి. ఉన్నవాటిల్లో గొప్పవి తీసుకోవాలి.

Copyright@gurujnanam.org

త్రిభువన  భూషణ ముల్లోకాల్లోని సర్వ  సంపదల యొక్క సమృద్ధి భావము అక్షయ భావము కలగలిసినటు వంటి అమ్మ రూపము.అనగా ఐశ్వర్యాధి దేవతగా అమ్మ యొక్క స్వరూపాన్ని ఒక్క పదంలో చూపిస్తున్నారు. కళానిధి రూపంగా వున్న ఈ తల్లి పయోనిధి రాజు సుతే అంటే సముద్రపు రాజు అనగా సాగరుడు.సాగరుని యొక్క కుమార్తె .క్షీర సాగర కన్యక గా అమ్మ వారు అవతరించారు కనుక ఇక్కడ ఆ భావాన్ని చూపిస్తున్నారు.

మొత్తంగా ఇప్పటి వరకూ చెప్పుకున్న భావంలో దిగ్గజములచేత సేవించ బడుతున్న గజలక్ష్మీ స్వరూపము ముల్లోకాల్లోనూ శ్రేష్ఠమైనటువంటి సర్వ సంపదల యొక్క సమాహార రూపము మూడవది క్షీరసాగర కన్యక.

*****************************

13th slokam part 5

ఇంకా అమ్మ వారి యొక్క పుత్రుడు ఎట్లాంటివాడు అనేది చెపుతున్నారు

అయి సుదతీ జన లాలస మానస మోహన మన్మధరాజ సుతే

మన్మథరాజు ని సుతుడుగా కలిగినటువంటిది.మన్మథుడు  గొప్ప ప్రభువు. అందరినీ ఓడించవలసిన వీరుడైనా మన్మథుని చేతిలో ఓడిపోతాడు.అతడు "సుదతీ జన లాలస మానస మోహన"  సుదతీ జన అంటే స్త్రీలు. స్త్రీ జన మనస్సులని సమ్మోహన పరచ గలిగేవాడు.వారి ద్వారా లోకమునే

సమ్మోహన పరిచేటటువంటి వాడు.అందుకే మానస మోహన మన్మథరాజ సుతే.

స్త్రీ జనులను అంటే ఒక్క స్త్రీలే కాదు.స్త్రీల ద్వారా పురుషులను  కూడా మోహింపచేస్తాడు

మన్మథుని సౌందర్యము ఎటువంటిది అంటే ప్రతి స్త్రీని కూడా మోహింప చేస దివ్యే సౌందర్యము అతనిది.

అందుకని అలాంటి సౌందర్యము తో కూడుకొని యున్న మన్మథుని యొక్క తల్లి ఈవిడ.

మన్మథుడుని కుమారుడు గా కలది అని చెప్పటం ఇందులోని భావము.

మన్మథుడు మహా సౌందర్య వంతుడు.అటువంటి సౌందర్యవంతునికి తలిదండ్రులు లక్ష్మి నారాయణులు అంటే ఇంక వాళ్ళ సౌందర్యము గురించి ఇంకా ఏమి చెప్పగలము!!!

ఆందుకే

"పచ్చని పులుగుల బండిమీద నుండు పచ్చవిల్తుని పిన్నబాలుని తండ్రి" అన్నాడు అన్నమాచార్య.

ఇది చెప్పటంలో గొప్ప భావాన్ని ఆవిష్కరిస్తున్నారు.పచ్చని పులుగులు అంటే పచ్చని పక్షులు పచ్చని చిలకలు.పచ్చని పక్షులు పూన్చిన బండిమీద తిరిగేవాడు అంటే చిలకలు పూన్చిన రథం మీద తిరుగుతూ వుంటాడు.

ఎవరూ అంటే మన్మథుడు.

పచ్చ విల్తుడు అంటే మన్మథుడు.

మన్మథుడు అనే బాలునికి ఈయన బాబు అంటే మహా సౌందర్యవంతుడు విష్ణువు అని చెప్పటం ఇందులోని భావము.

***************************************

13th slokam part 6

అలాగే లక్ష్మీ నారాయణుల సౌందర్యం ఎంత గొప్పది అంటే వాళ్ళ పుత్రుడు మన్మథుడు.

ఆ తల్లి లో కొంత లక్షణం, ఆ తండ్రి లో కొంత లక్షణం తెచ్చుకొచ్చాడు.

కొంతే వాడి అందం.

ఎంతో ఆ తల్లిదండ్రుల అందం.

ఆ మాట చెప్పటంలో "మన్మధరాజ సుతే" మన్మథ రాజుని సుతుడి గా కలిగినటువంటి తల్లి.

మొత్తానికి లక్ష్మీ స్వరూపం ఇందులో చెప్పటం జరుగుతోంది.గజ లక్ష్మీ, ఐశ్వర్య రూపిణి, క్షీర సాగర తనయ, మన్మథ రాజు కి తల్లి.ఈ చెప్పటంలో అమ్మ యొక్క సమగ్రమైన ఐశ్వర్య , సౌందర్య రూపములు ఇందులో భావించబడుతున్నాయి.

అయితే దుర్గ అంటే శివ పత్ని అయిన గౌరి కదా ఇక్కడ ఒక్కసారిగా విష్ణు పత్ని అయిన లక్ష్మీ గా ఎందుకు చూపిస్తున్నారు అంటే ఇక్కడ దుర్గ గా నమస్కరిస్తున్నప్పటికీ ముగురమ్మల మూలపుటమ్మ అనే స్ఫురణ వుండాలి.

ఇది సత్ సంప్రదాయం తో భక్తి కలిగిననటువంటి ఉపాసనా విషయములు తెలిసిన వారికి మాత్రమే అవగతమయ్యే అంశము. అందుకు ఈ తల్లి గురించి ఈ భావన మనకు పురాణాలలోను వివధ స్తోత్రాలలోనూ కనబడుతుంది.దేవీ మాహాత్మ్యం లో మహిషాసుర మర్దనిని స్తుతిస్తూ

"మేధాసి దేవి విదితాఖిల శాస్త్రసారా

దుర్గాసి దుర్గ భవసాగర నౌరసంగా

శ్రీ: కైటభారి హృదయైక కృతాధివాసా

గౌరీ త్వమేవ శశిమౌళి కృత ప్రతిష్ఠా"

అనే శ్లోకం కనబడుతోంది.

అమ్మా సమస్త శాస్త్ర సారమైన జ్ఞానము నీయొక్క స్వరూపము అన్నారు అనగా సరస్వతీ రూపాన్ని చూపించారు.

రెండవది : కైటభారి హృదయైక కృతాధివాసా కైటభారి అంటే విష్ణువు.విష్ణువు యొక్క వక్ష స్తలం లో చక్కగా కూర్చున్నటువంటి శ్రీ దేవివి నువ్వు.అనగా లక్ష్మీ దేవివి నువ్వే.

గౌరీ త్వమేవ శశిమౌళి కృత ప్రతిష్ఠా

గౌరీ నువ్వు శశిమోళి అంటే చంద్రశేఖరుడైన శివుడు. ఆ చంద్రశేఖరుడైన శివుని యొక్క శరీరంలో ప్రతిష్ఠుతురాలై కూర్చున్నావు అర్ధనారీశ్వరిగా వున్నావు నువ్వు. అని ఇక్కడ దుర్గా దేవిని మూడు రకములుగా చూపిస్తున్నారు.ఈ మూడింటికీ అనుసంధాన వాక్యంగా

దుర్గాసి దుర్గ భవసాగర నౌరసంగా

అతి కష్టమైన సంసార సాగరాన్ని అతి సులభంగా దాటించే ఓ దుర్గమ్మా నువ్వే జ్ఞాన రూపిణి అయిన శారదవు. విష్ణు వక్షస్థలం లో ప్రకాశించే లక్ష్మీ దేవివి.శివుని

యొక్క శరీరంలో భాసించే గౌరీ దేవీ అన్నారు. ఇదే భావాన్ని తీసుకుని కనకధారా స్తోత్రంలో శంకర భగవత్పాదుల వారు

గీర్దేవతేతి గరుడధ్వజ సుందరీతి శాకంబరీతి శశిశేఖరవల్లభేతి!

సృష్టి స్థితి ప్రళయకేళిషు సంస్థితాయ తస్యై నమః త్రిభువనైక గురోస్తరుణ్యై!!

నువ్వు గీర్దేవతవు అనగా సరస్వతీ దేవివి. గరుడధ్వజ సుందరీతి విష్ణు పత్ని అయినటువంటి లక్ష్మీ దేవివి.అంతేకాదు

శాకంబరీతి శశిశేఖరవల్లభేతి

శాకంభరీ దుర్గ గా వచ్చినటువంటి చంద్రశేఖరుని మనోహారిణివి నువ్వు. లోక రక్షణ కోసం భిన్న భిన్న రూపములు ధరించిన దానవు అని కీర్తించారు శంకరులు. ******************************

13 th slokam part 7

ఇదే భావాన్ని సౌందర్య లహరి లో కూడా

గిరామాహు-ర్దేవీం ద్రుహిణగృహిణీ-మాగమవిదో

హరేః పత్నీం పద్మాం హరసహచరీ-మద్రితనయామ్ |

తురీయా కాపి త్వం దురధిగమ-నిస్సీమ-మహిమా

మహామాయా విశ్వం భ్రమయసి పరబ్రహ్మమహిషి

అనే శ్లోకం లో ప్రకటించారు. మొత్తానికి ముగురమ్మల మూలపుటమ్మ అయిన దుర్గను స్తుతిస్తూ లక్ష్మీ భావన ఇక్కడ ఇవ్వటం వలన ఈ శ్లోక పఠనము, శ్రవణం ఐశ్వర్య కారకము.

ఇంతే కాకుండా మరొక ఔచిత్యం ఇక్కడ వున్నది.

"కళానిధి" అని రెండవ వాక్యం లోని పదానికి కళా అనగా మూల ద్రవ్య సమృద్ధి అని అర్ధం చెప్పుకున్నాము.

అయితే కళా అనే మాట శాస్త్ర ప్రకారంగా చంద్రుడికి కూడా చెప్పబడుతున్నది.16 కళలకీ నిధి అయినటువంటి వాడు కనుక చంద్రుడికి కళానిధి అని స్థిరంగా వుంది శాస్త్ర పరంగా. ఆ అర్ధం లో చెపితే "త్రిభువన భూషణ భూత కళానిధి రూప" అంటే ముల్లోకాలకీ సౌందర్యాన్నిచ్చేది అమ్మవారి యొక్క స్వరూపమే. ముల్లోకాల్లో ఎక్కడా కూడా అమ్మ యొక్క దివ్య సౌందర్యపు ఛాయలు కూడా కనబడవు.ఎందుకంటే ముల్లోకాల సౌందర్యాన్ని మించిపోయింది అమ్మ యొక్క సౌందర్యం.అందుకే "త్రిపుర సుందరి" అని పేరు.ఆ సౌందర్య లవ లేశమే ముల్లోకాల్లో వున్నది.అందుకే అమ్మ ఎలా వున్నదంటే ముల్లోకాలకి అలంకారముగా వున్నది.

"త్రిభువన భూషణ భూత కళానిధి రూప" అనే మాటలో చంద్రుడి వంటి రూపము కలది అనే అర్థాన్ని చూపిస్తున్నారు. చంద్రుడికి ఏవిధంగా అయితే ప్రసన్నం గా ఉంటాడో ఆవిధంగా. ఆహ్లాదకరమైన ప్రసన్నకరమైన మేఛాయలతో వున్న తల్లి కనుక "కళానిధి రూపా" ఈమాట చెప్పడంలో వున్న పరమార్ధం ఏమిటంటే

"జగదంబిక చంద్రకళా స్వరూపిణి". సహస్రార కమలంలో చంద్ర కళా రూపిణిగా వుంటుంది.

పైగా త్రిభువన భూషణ మూడు భువనములకూ భూషణము. అనగా మన శరీరంలో వున్న స్థూల, సూక్ష్మ , కారణ ఈ మూడు శరీరములకు కూడా కాంతిని ఇస్తున్నటువంటి అసలైన ఆత్మ చైతన్యం అమ్మవారు. అందుకే "త్రిభువన భూషణ భూత కళానిధి"

శాస్త్రము చెప్పే మాట "ఆత్మ యొక్క చైతన్యమే అమృతము.అదే ఈ శరీరాన్ని జీవింప చేస్తున్నది. ఆ జీవింప చేస్తున్న రూపము కనుక ఆ 'సహస్రార కమలాంతర్గతమైన అమృతేశ్వరి' అయిన జగదంబ యొక్క రూపమే మన శరీరము లో వున్న మూడు శరీరములు అనగా స్థూల, సూక్ష్మ , కారణ శరీరములనే భువనములను పాలించుతూ వున్నది అని ఒక అర్థము.

అదేవిధంగా ముల్లోకాలకు కూడా సోభాయమానమైనటువంటి అమ్మ యొక్క స్వరూపము చంద్రుని వలే ప్రసన్న భావంతో వున్నది.అందుకే కళానిధి రూపా అన్నప్పుడు ఆ అర్థాన్ని గ్రహించవచ్చు.

"అయి సుదతీ జన లాలస మానస

మోహన మన్మధరాజ సుతే"

అనే వాక్యానికి మనం చెప్పుకున్నాము.

కానీ మరి కొన్ని పాఠాలలో "మన్మధ రాజ గతే" అనే శబ్దం వున్నది.దాని పరంగా అర్థం చెప్పుకుంటే ఎలావస్తున్నది అంటే మన్మథ రాజుకి గతి అయినదానా అంటే దిక్కయినదానా అని అర్థం. ********************************

13 th slokam part 8

ఇది కూడా చాలా సమంజసమైన అర్థమే.జగదంబ పరంగా చక్కని అర్థం ఇందులో కనబడుతూ వున్నది.మన్మథుడికి గతి అయిన తల్లి. ఎందుకంటే శివుడి కంటిమంటల్లో కాలిపోయాడు మన్మథుడు. అప్పుడు దేవతలందరూ కూడా శరణు వేడి రక్షించమంటే అమ్మవారు తన కంటి చూపుల్లోంచి అమృతాన్ని కురిపించి మన్మథుడు ని సృజించారుట.అలా మన్మథుడు ని సృజించి,అతడ్ని కాపాడింది. అందుకే "కాయజాది రక్షణ నిపుణతరే కాంచన మయ భూషణాంబర ధరే."అని కీర్తిస్తారు ముత్తుస్వామి దీక్షితులవారు.

మన్మథుడు మొదలైన వాళ్ళని కాపాడటంలో నేర్పరురాలా అని

"హరనేత్రాగ్ని సందగ్ధ కామసంజీవ నౌషధిః"అని లలితా సహస్రనామాలులో చదువుకుంటున్నాము. శివుడి కంటిమంటల్లో కాలిపోయిన మన్మథుడిని తిరిగి తన కనుచూపులతో బ్రతికించింది ఆ తల్లి.

అలాగ కారుణ్యం చూపించి మన్మథుడికి దిక్కై కాపాడింది కనుక "మన్మథ రాజగతే" అని చెప్పడం కూడా సరిపోతున్నది.దిక్కైన తల్లి అని అర్థం.

ఇది గౌరీ దేవి పరంగా చెప్పబడుతున్న అర్థం. "మన్మథ రాజ సుతే"మన్మథ రాజుని సుతుడుగా కలిగినటువంటి తల్లి అని లక్ష్మీ పరంగా చెపుతున్నారు. ఇక్కడ మరొక ప్రత్యేకత ఏమిటంటే మహిషాసుర మర్దిని రూపాన్ని మహాలక్ష్మీ

రూపం అని అంటారు. ఇదొక ప్రత్యేకత వున్నది. అందుకే మధుకైటభ సంహారం చేసిన తల్లి మహాకాళీ, మహిషాసుర మర్దనం చేసిన తల్లి మహాలక్ష్మి , శుంభ నిశుంభ సంహారం చేసిన జగదంబ మహా సరస్వతీ అని.

అయితే ఇక్కడ మహాలక్ష్మి ,మహా సరస్వతీ అని చెప్పటంలో విష్ణు పత్నిగా చెప్పబడుతున్న లక్ష్మి కి , బ్రహ్మ పత్నిగా చెప్పబడుతున్న

సరస్వతి కి ఈ స్వరూపములు భిన్నములు అని చెప్పడం.అందుకే అక్కడ మహా అనే శబ్దము వాడారు.

అయినప్పటికీ కూడా ఈ దివ్యమైనటువంటి 18 చేతులతో ప్రకాశించేటటువంటి మహిషాసుర మర్దిని మాత్రం లక్ష్మి తత్త్వం వుంది అందులో.

ఆ లక్ష్మి తత్త్వ స్వరూపం కనుకనే అందులో ఈ లక్ష్మి స్వరూపాన్ని ఒక శ్లోకమంతా  ఆవిష్కరించారు అది దీని యొక్క ప్రత్యేకత.

మహిషాసుర మర్దిని స్వరూపమే ఐశ్వర్య కారకమైన రూపము.ఎంత అసుర సంహారకమో  అంతగా ఐశ్వర్య కారకం.అసుర సంహారకము అంటేనే అశుభ సంహారకము.అశుభాలని

negative thoughtsని అన్నీ తొలగించి ఐశ్వర్యాన్ని ఆనందాన్ని కలిగించే లక్ష్మి స్వరూపము మహిషాసుర మర్దినీ రూప తత్త్వం లో దాగి వున్నది.

కొన్ని కొన్ని దేవతా తత్త్వములతో  కొన్ని దేవతా తత్త్వములు సమన్వయింప బడి వుంటాయి.

ఇది తెలియాలంటే ఉపాసనా తత్త్వం తెలియాలి.దేవతల యొక్క స్వభావం తెలియాలి.బీజాక్షరముల యొక్క నైపుణ్యం తెలియాలి.ఈ నేర్పరి తనం ఉంటేనే ,అప్పుడు దేవతల తత్త్వం గురించి మాట్లాడవచ్చు.అందుకే అన్నమయ్య ఒక మాట అంటాడు.

"దేవ దూషికుడై తిరిగేటి వానికి దేవతాంతరములు తెలిసేనా" అని ఒక మాట అంటాడు.

ఎప్పుడూ దేవ దూషణం చేసే వాళ్ళు , అసలు లోతైన హృదయం లేనటువంటి వారు . వాళ్ళకి దేవతల యొక్క వివిధములైన రీతులు అర్థం కావు.అలా ఇక్కడ మహిషాసుర మర్దిని తత్త్వం లో లక్ష్మీ తత్త్వం కలయడం ఏమిటా అని ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు.మహిషాసుర మర్దిని ఉపాసన లోనే ఐశ్వర్య కారకమైన లక్ష్మీ తత్త్వం దాగి వున్నది.

అది ఆ దేవతా స్వభావము.కొన్ని దేవతలకు కొన్ని దేవతలతో సమన్వయం వుంటుంది. అలా లక్ష్మీ తత్త్వాన్ని కలబోసుకున్నటువంటి గొప్ప స్వరూపము మహిషాసుర మర్దినీ రూపము.అందుకే శాస్త్రవేత్తలు ఈ స్వరూపాన్ని మహాలక్ష్మీ గ కీర్తించారు.మొత్తం 18 చేతులతో వున్నటువంటి మహిషాసుర మర్దిని "సేవే శైరభ మర్దినీం ఇహ మహాలక్ష్మీం సరోజ స్థితాం" అని వర్ణించారు.శైరభ మర్దిని అంటే మహిషాసుర మర్దిని అయినటువంటి తల్లిని మహాలక్ష్మీ ని సేవిస్తున్నాను అని చెప్పడంలోనే మహాషాసుర మర్దిని మహాలక్ష్మీ తత్త్వం యొక్క సమన్వయం గోచరిస్తున్నది. ఆ సమన్వయాన్ని గొప్ప ఉపాసకుడైన రామకృష్ణ కవి ఈ శ్లోకంలో చూపిస్తూ మహిషాసుర మర్దిని మహాలక్ష్మీ గ ఐశ్వర్యదాయకము అవుతున్నది

అని అన్నారు. ఈ శ్లోకాన్ని భక్తి తో అనుసంధానము చేస్తే తప్పకుండా దరిద్రాలు పోయి ఐశ్వర్యం లభిస్తుంది.అది ఈ శ్లోకంలో ఇవున్న ప్రత్యేకత.

అందుకే శాస్త్రవేత్తలు ఈ స్వరూపాన్ని మహాలక్ష్మి గ వర్ణించారు.

*********************************

14th slokam Part 1

14th slokam ఈ శ్లోకం లో అమ్మ వారి యొక్క సౌకుమార్య స్వరూపాన్ని చూపిస్తున్నారు. 14th and 15th - వన దుర్గా శ్లోకాలు

14)**కమలదళామల కోమల కాంతి-కళా కలితాకుల బాలలతే**

**సకల కళా నిచయక్రమ-కేళిచలత్-కలహంస కుళాళికులే**

**అలికుల-సంకుల-కువలయమండిత-మౌళిమిలత్ వకుళాళికులే**

**జయ జయ హే మహిషాసుర-మర్దిని రమ్యకపర్దిని శైలసుతే**.

ఇక్కడ గమనించవలసిన విషయము ఏమిటంటే మహిషాసుర మర్దనం చేసిందంటే మహా ఉగ్రమై వీరమైన రూపమే ఉంటుంది. కానీ అనేక శ్లోకాలలో సుకుమారమైన భావాన్ని చూపిస్తారు. అయితే భావం తెలియకుండా పాడే వాళ్ళు చదివే వాళ్ళు ఏంచేస్తున్నారంటే ప్రతి శ్లోకం కూడా భీభత్స రసం ఒలికిపోయేటట్టుగా మహావీరమైన శబ్దాలతో వీటిని ఒక ఉగ్రంగా చదువుతూ వుంటారు. కానీ అన్నిచోట్లా ఉగ్ర భావము లేదు ఇక్కడ. ఆ తల్లి యొక్క అన్ని భావములు చూపిస్తున్నారు.అందుకే ఆ భావానికి తగ్గట్టు గానం చేస్తే మరింత గొప్పగా వుంటుంది. అందుకే "భావ రాగ లయాది సౌఖ్యముచే చిరాయువుల్ కల్గి నిరవధి

సుఖాత్ముల్లై త్యాగరాజాప్తులైన  వారు ఎందరో మహానుభావులు" అని అంటారు త్యాగరాజస్వామివారు. అందుకే భావం తెలిసి దానికి తగ్గట్టుగా రాగం గానం చేయాలి.అంతేకాని సంస్కృత శబ్దాలు ఉన్నాయి మహిషాసుర మర్దిని ఉంది కనుక ప్రతీదీ వీరంగా దూకుతున్నట్టు చదవఖరలేదు.ఇది చాలా సుకుమారమైన శ్లోకం ఇది.

ఈ శ్లోకము లో వనదుర్గా దేవతా రూపమును చూపిస్తున్నారు.

మొత్తానికి మహిషాసుర మర్దినీ స్తోత్రం మంత్ర గర్భితము.ఇది ఎక్కడో లేనిది తీసుకువచ్చింది కాదు.ఉన్నది గమనించుకోవాలి.ఈ శ్లోకం లోను,రాబోయ శ్లోకము లోను వనదుర్గా దేవతా రూపమును చూపిస్తున్నారు.

వన దుర్గాదేవిని కనుక ధ్యానిస్తే ఎలాంటి కష్టం నుండి  అయినా బయటపడతారు అని శాస్త్రం చెపుతోంది. భయంకరమైన శత్రుజాలములు, గడ్డు సమస్యలు వచ్చినప్పుడు వనదుర్గా ఉపాసన చెయ్యాలి అని శాస్త్రం చెపుతున్నది. వన దుర్గాదేవిని కనుక ధ్యానిస్తే ఎలాంటి కష్టం నుండి  అయినా బయటపడతారు అని శాస్త్రం చెపుతోంది. భయంకరమైన శత్రుజాలములు, గడ్డు సమస్యలు వచ్చినప్పుడు వనదుర్గా ఉపాసన చెయ్యాలి అని శాస్త్రం చెపుతున్నది.

दुर्गे स्मृता हरसि भीतिमशेषजन्तोः स्वस्थैः स्मृत मतिमतीवशुभां ददासि ।

दारिद्र्यदुःख भयहारिणि का त्वदन्या सर्वोपकारकरणायसदार्द्रचित्ता ॥

జయ జయ దుర్గే.

శృంగేరి దగ్గర్లోని వన దుర్గా ఆలయం అత్యంత మనోహరం మహిమాన్వితం.

https://www.sringeri.net/temples/the-guardian-deities/sri-vanadurga

అమ్మ స్వరూపము బాల లత లాగా వుందట. బాల లత అంటే లేత తీగ అని అర్థం.  ఒక పూల తీగ  లేతగా వున్నప్పుడు ఎంత సుకుమారంగా వుంటుందో అంత సుకుమారంగా వుంటుంది ట అమ్మ. ఆ సౌకుమార్యం ఎలా వుందంటే 'కమలదళామల కోమల కాంతి-కళా కలిత ఆకుల బాలలతే" కమలదళములు అంటే పద్మ దళములు.ఆ తామర  పూరేకులయొక్క నిర్మలమైన కోమల కాంతితో సమానమైన ఛాయతో వుందట.అలాంటి కళాకలిత శోభ తో వున్న 'ఆకుల' అంటే కదుతున్న 'బాల లత' లేత తీగ లాగా వుంది దీని భావము. ఇందులో వున్న ప్రత్యేకత చాలా వున్నది.యోగ పరంగా చూస్తే కుండలినీ లత.కుండలినీ లతనే అపర్ణా లత అంటారు.ఆకులు లేని తీగ- కానీ పద్మాలు వున్నాయి. "మాతరం పద్మ మాలినీమ్"  ఆ పద్మములు ఏవంటే మూలాధారం నుండి సహస్రారం వరకు ఒక్కొక్క చక్రం ఒక్కొక్క పద్మం.షట్ పద్మములు. ఈ పద్మములే ఇక్కడ

"కమలదళామల కోమల కాంతి-కళా కలితాకుల బాలలతే"

సుకుమారమైన తీగ. ఎంత సుకుమారం అంటే 'బిసతంతు తనీయసి'  తామర తూడు లోని దారం ఎంత సుకుమారంగా వుంటుందో అంత సుకుమారంగా వుంటుంది. అదే ఇక్కడ "శ్రియం వాసయ మే 'కులే' మాతరం పద్మమాలినీమ్" అని శ్రీ సూక్తం కూడా ఆ శబ్దాన్ని  చెపుతుంది.అక్కడ

'కుల' శబ్దాని కి అర్థం షట్చక్రములతో కూడిన కుండలిని.

అందుకే ఇక్కడ కలితా -'కుల' బాలలతే  అని అనడంలో ప్రత్యేకత. ఇది  వ్రాసిన వాడు మహా ఉపాసకుడు.పైగా ఇటువంటి ప్రమాణములు లలితా సహస్రనామం లో కూడా కనిపిస్తుంది.

కుళాంగనా కుళాంతస్థా కౌళినీ కుళయోగినీ|

అకుళా సమయాంతస్థా సమయాచార తత్పరా||37||

కుళామృతైక రసికా కుళసంకేత పాలినీ ||36||                                14th Slokam Part 2

కుల శబ్దానికి అర్థం శాస్త్రం చెపుతోంది షట్చక్రములను కులము అంటారు. అందుకు 'కమలదళామల' ఒక్కొక్క చక్రము లో దళముల సంఖ్య వుంటుంది.మారుతూ వుంటుంది ఆ దళములు. హృదయం దగ్గర 12 దళాల కమలము, మూలాధారం దగ్గర 4 దళాల కమలము, అలా ఒక్కొక్క చోట ఒకటి. ఆజ్ఞా చక్రం దగ్గర 2 దళాల కమలం.అందుకు కమలదళా అని చెప్పటంలో భిన్న భిన్నముగా  మారుతున్నటువంటి దళములతో కూడిన కమలములు వాటి లో కోమలమైన కాంతి  తో కూడి  వుంటుంది అంటే ఒక మెరుపు తీగ లాగ వుంటుంది.

కుండలినీ కాంతి ఎలా వుంటుంది అంటే

"తటిల్లేఖా తన్వీం - తపన శశివైశ్వానరమయీం" అన్నది సౌందర్యలహరి

"తటిల్లతా సమరుచి షట్చక్రోపరి సంస్థితా" అని చెప్పినట్లు మెరుపు తీగ లాగా వుంటుంది. అందుకే కాంతి అన్నారు ఇక్కడ.అటువంటి కళాకులే చక్కని శోభలతో

ఉన్న బాల లతే అంటే కుండలినీ స్వరూపమైన తల్లి అని చెప్పడం దీనిలోని భావం.ఇది ఉపాసన చేస్తున్నవాళ్ళు యోగులు అందుకే తర్వాత మాట "సకల కళా నిచయక్రమ-కేళిచలత్-కలహంస కుళాళికులే" అని వర్ణించడంలో తుమ్మెదలు హంసలు రెండూ చెప్పారు. అలాంటి హంసలతో తుమ్మెదల తో కూడి వున్నది. మామూలు గా అమ్మ విహరిస్తూ వుంటే హంసలు అటు పక్కనుంచి వెడుతున్నాయట తుమ్మెదలు చుట్టూ తిరుగుతున్నాయి.ఇక్కడ హంసలు తుమ్మెదలు అంటే యోగ కేంద్ర శక్తులే తుమ్మెదలు, యోగులే హంసలు. అలాంటి హంసలు ఈ కుండలినీ స్వరూపాన్ని ఉపాసిస్తున్నారు. యోగులచే ఉపాసింప బడే కుండలినీ స్వరూపిణీ అమ్మ అని అర్థం.

అమ్మవారు కుండలినీ స్వరూపంగా అత్యంత సుకుమారమైన చైతన్య ధారా (రాధ) రూపంగా వున్నటువంటి స్వరూపమే "బాల లతే" అనే రూపం. సాధకులే హంసలు వాళ్ళే యోగులు. వారు ఒక్కొక్క నాడీ గ్రంధి నుంచి పైకి వెడుతున్నప్పుడు అదే అళికులము అంటే తుమ్మెదలు సమూహము అని అర్థం.ఇవి నాడీ గ్రంథులు వాటిని దాటుకుంటూ వెళ్ళినటువంటి యోగులు ఎవరైతే ఉన్నారో వాళ్ళు హంసలు.అలాంటి హంసలతో శోభిల్లుతున్నది అంటే ఆ యోగులచేత ఆరాధించబడుతున్నది అని అర్థము. ఇది అంతరార్థ గర్భితమైన యోగపరమైన అర్థం. ఒక మహా యోగి భక్తితో రచిస్తున్న శ్లోకముల్లో యోగ భావాలు ఉంటాయి. 14th slokam part 3

Copyright@gurujnanam.org

ఇంకొక వైపు ఉపాస్యమైన అమ్మ యొక్క దివ్య రూపము ఇందులో కనబడుతున్నది.ఇక్కడ కనబడుతున్న తల్లి "ఉద్యాన వనంలో విహరిస్తున్నటువంటి తల్లి".ఆ గౌరీ దేవి అయిన దుర్గమ్మ

ఆ కైలాస ఉద్యాన వనాల్లో సంచరిస్తోంది.ఉద్యాన వనాల్లో తిరుగుతున్నప్పుడు ఎలా ఉన్నది అంటే ఉద్యాన వనంలో చక్కని కొలనులు వున్నాయి. అందులో కమలములు వికసించి వున్నాయి.మరొకవైపు అద్భుతమైన వృక్షరాజములు ప్రకాశిస్తున్నాయి. హంసలు తుమ్మెదలు ఇవన్నీ ఉద్యానవనంలోని సహజ సౌందర్యము.

ఇక్కడ అమ్మ సంచరిస్తోంది. సంచరిస్తున్నప్పుడు ఉద్యానవనంలో ఎన్నో పూలతీగలు వున్నాయి. వాటిని మించిపోయినటువంటి సౌందర్యముతో ఒక లేత పూల తీగ లాగా అమ్మ వున్నది.ఆవిడ శరీర కాంతి

"కమలదళామల కోమల కాంతి' తామర పువ్వుల యొక్క రేకులు ఎలా వుంటాయో అలాగ సుకుమారంగా కాంతితో వున్నది.పైగా కదులుతున్నటువంటి లేత తీగ వలే వున్నది. నడుస్తూ వస్తోంది కనుక కదులుతున్న 'ఆకులము' అంటే చలించుచున్న మాలలతే లేత తీగ రూపంలో వున్నది.ఇది ఒక భావమైతే కొంతమంది దీనికి అద్భుతమైన వ్యాఖ్యానం చూపించారు.

బాలలతే అంటే సుకుమారమైన దేహం పిల్లలకు సహజంగా వుంటుంది. ఇప్పుడు ఈ కనబడుతున్న స్వరూపం

బాలా త్రిపుర సుందరి గా భావన చేశారు. అందుకే బాలలతే అంటే బాలాత్రిపుర సుందరీ రూపంలో కనబడుతున్నటువంటి కల్పలతవు నువ్వు.

కల్పలతా అంటే కల్ప వృక్షజాతికి సంబంధించిన లత. ఇది ఏదికోరుకుంటే అది ఇస్తుందిట ఈ కల్పలత.

అమ్మవారు బాలా త్రిపుర సుందరి రూపంలో వుంటూ భక్తుల కోరికలు తీర్చేటటువంటి కల్పలత లా ప్రకాశిస్తున్నారు.

"సకల కళా నిచయక్రమ-కేళిచలత్-కలహంస కుళాళికులే"

ఇక అమ్మవారు పరివార దేవతలతో వస్తున్నారు. అందులో జగదంబకి రాజ రాజేశ్వరి కీ పరివారం ఏమి తక్కువ !!!

ఆ సఖీగణము చెలికత్తెలు అమ్మ చుట్టూ వున్నరుట.

వాళ్ళు ఎలా వున్నారంటే "సకల కళా నిచయక్రమ-కేళి" వాళ్ళు అన్ని కళలలో నేర్పరులు. సంగీతము,నాట్యము, చిత్రలేఖనము మాలా గ్రహనము అంటే పూల మాలలు అల్లుట ఇత్యాది అన్ని కళలలో నేర్పరులు అమ్మ వారి చెలికత్తెలు.

వారందరూ కూడాను క్రమ క్రమముగా అమ్మ తో పాటు సంచరిస్తున్నారు. పైగా వాళ్ళు కూడా సౌందర్యరాసులు. వాళ్ళు నడుస్తున్న నడకలు ఎలా ఉన్నాయంటే "చలత్-కలహంస కులా" కలహంసలు అక్కడ నడుస్తున్నాయా అన్నట్లుగ వుందట.

కల హంసలు అంటే శ్రేష్ఠమైన హంసలని, అదేవిధంగా చక్కని ధ్వని చేసే హంసలు.కల అంటే అవ్యక్త మధురధ్వని అని అర్థము.

అవ్యక్త మధురధ్వని చేసే హంసలు ఎలా వుంటయో అలా హంసలు లాగా మధురమైన ధ్వనులు చేస్తూ అందంగా సంచరిస్తున్నారు ఆ చెలికత్తెలు.

ఆ చెలికత్తెలు నడుమ అమ్మవారు వున్నారు.అందుకే "హంస కుళాళికులే".అళి అనే శబ్దానికి మూడు రకాల అర్థాలు వున్నాయి.1.అళి అంటే సమూహము అని,2.అళి అంటే.చెలికత్తెలు అని,3.అళి అంటే తుమ్మెదలు అని ఇన్ని అర్థములు వున్నాయి.

ఇక్కడ అళికులే అంటే చెలికత్తెల సమూహము అని తీసుకోవాలి.ఈ చెలికత్తెల సమూహము హంస గమనములతో సకల కళలలో నేర్పరి తనం తో అమ్మ.తో పాటు సంచరిస్తున్నారు. అలాంటి చెలికత్తెల సమూహము మధ్యవున్నది ఆ తల్లి.

"అలికుల-సంకుల కువలయమండిత-మౌళి మిలత్

వకుళాళికులే"

అమ్మవారు తన యొక్క దివ్యమైన జుట్టు యందు వివిధములైన కుసుమాలు ధరించి ఉన్నారు తధ.శిరస్సుపై. ఆ కుసుమములు ఎన్ని రకాలుగా ఉన్నాయంటే కువలయ అంటే కలువలు,చక్కని కలువలు  అలంకరించకున్నారు. ఇంకోవైపు పొగడపూల దండలు అలంకరించుకున్నారు. ఇక్కడ "వకుళాళికులే"  వకుళము అంటే పొగడ, అళి అంటే సమూహము. పొగడల దండలు అలంకరించుకున్నారు. ఇంకా కలువలు కూడా అలంకరించుకున్నారు. వివిధ కుసుమములు అలంకరించబడి వున్నాయి అమ్మ యొక్క శిరస్సుపై. అలాంటి దివ్యమైన కుసుమములు అలంకరించుకుంటే మకరందం పై ప్రీతి చెందిన తుమ్మెదలు ఆ కుసుమాలు కోసం తుమ్మెదలు వెనక్కి తిరుగుతూ ఝుంకరం చేస్తున్నాయట.

"అలికుల-సంకుల కువలయ మండిత-మౌళి మిలత్

వకుళాళికులే"

అళికుల అంటే సమూహము అంటే తుమ్మెదల గుంపు అని అర్థము. ఆ తుమ్మెదలు గుంపు ఈ పువ్వులకై ఆకర్షింపబడి వస్తూవున్నాయట అక్కడికి.అలాగ తుమ్మెదలు వచ్చేలాగా ఆకర్షించినటువంటి దివ్యమైన కలువలు పొగడలు పూల దండలు మొదలైన కుసుమాలని శిరస్సుపై అలంకరించుకున్న తల్లి అని మూడవ పాదానికి అర్థము. MahishasuraMardini Stotram 14th slokam Meaning part 4

"అలికుల-సంకుల కువలయమండిత-మౌళి మిలత్

వకుళాళికులే"

అమ్మవారు తన యొక్క దివ్యమైన జుట్టు యందు వివిధములైన కుసుమాలు ధరించి ఉన్నారు తథ. శిరస్సుపై. ఆ కుసుమములు ఎన్ని రకాలుగా ఉన్నాయంటే కువలయ అంటే కలువలు, చక్కని కలువలు అలంకరించకున్నారు. ఇంకోవైపు పొగడపూల దండలు అలంకరించుకున్నారు. ఇక్కడ "వకుళాళికులే"  వకుళము అంటే పొగడ, అళి అంటే సమూహము. పొగడల దండలు అలంకరించుకున్నారు. ఇంకా కలువలు కూడా అలంకరించుకున్నారు. వివిధ కుసుమములు అలంకరించబడి వున్నాయి అమ్మ యొక్క శిరస్సుపై. అలాంటి దివ్యమైన కుసుమములు అలంకరించుకుంటే మకరందం పై ప్రీతి చెందిన తుమ్మెదలు ఆ కుసుమాలు కోసం తుమ్మెదలు వెనక్కి తిరుగుతూ ఝుంకరం చేస్తున్నాయట. "అలికుల-సంకుల కువలయ మండిత-మౌళి మిలత్

వకుళాళికులే"

అళికుల అంటే సమూహము అంటే  తుమ్మెదల గుంపు అని అర్థము.ఆ తుమ్మెదలు గుంపు ఈ పువ్వులకై ఆకర్షింపబడి వస్తూవున్నాయట అక్కడికి.అలాగ తుమ్మెదలు వచ్చేలాగా ఆకర్షించినటువంటి దివ్యమైన కలువలు పొగడలు పూల దండలు మొదలైన కుసుమాలని శిరస్సుపై అలంకరించుకున్న తల్లి అని మూడవ పాదానికి అర్థము.

మొత్తానికి మహిషాసుర మర్దినీ స్తోత్రం మంత్ర గర్భితము.ఇది ఎక్కడో లేనిది తీసుకువచ్చింది కాదు.ఉన్నది గమనించుకోవాలి.ఈ శ్లోకం లోను,రాబోయ శ్లోకము లోను వనదుర్గా దేవతా రూపమును చూపిస్తున్నారు.

వన దుర్గాదేవిని కనుక ధ్యానిస్తే ఎలాంటి కష్టం నుండి అయినా బయటపడతారు అని శాస్త్రం చెపుతోంది. భయంకరమైన శత్రుజాలములు, గడ్డు సమస్యలు వచ్చినప్పుడు వనదుర్గా ఉపాసన చెయ్యాలి అని శాస్త్రం చెపుతున్నది.

*******************************

15 th slokam Meaning Part 1

14th  and 15th - వన దుర్గా శ్లోకాలు

15 )**కల మురళీరవ వాజిత కూజిత -కోకిల-మంజుల గానరతే**

**మిళిత మిళింద  మనోహర-గుంజిత - రంజిత శైల నికుంజ గతే**

**మృగ గణ భూత-మహా శబరీ గణ-రింఖణ సంభృత-కేళియుతే**

**జయ జయ హే మహిషాసుర మర్దిని రమ్యకపర్దిని శైలసుతే**

కల=melodious

ఆ వనములలో రమ్యమైన మురళీ నాదములు మ్రోగిస్తున్నారు. ఎందుకంటే ఆ చుట్టూ వున్న చెలికత్తెలు లో రకరకాల కళలలో నేర్పరులు వున్నారు కనుక కొందరుమురళీ నాదం చేస్తున్నారు.ఆ మురళీ నాదం యొక్క మాధుర్యానికి అడవులలో వున్న చెట్ల పై వున్న కోయిలలు కూడా పరవశించి తాము గానం మొదలుపెట్టినాయి.మొత్తానికి. ఆ వనము.నందు ఒకవైపు వేణు గానములు ఇంకొక వైపు కోయిల యొక్క గానములు రెండూ మేళనమై ఒక అద్భుతమైన నాద ప్రవాహం అక్కడ అలుముకుని వున్నది.

15th slokam Part 2

ఆ నాదం వింటూ సంతోషిస్తున్నదిట ఆ తల్లి. అలాంటి గానానికి పరవశిస్తూ ఉన్నది తల్లి.

మిళిత మిళింద మనోహర-గుంజిత రంజిత శైల నికుంజ గతే

అక్కడ ఆ వనములలో రకరకాల పొదలు వున్నాయట..ఈ వనము సామాన్యమైనది కాదు.

పైగా ఆ వనము కొండల మీద వున్నది.

ఎందుకంటే ఈ తల్లి కొండలరాజు కూతురు కదా!!! కొండలలో తిరగటం అలవాటు ఈవిడకు.

ఆ తిరుగుతున్నప్పుడు నికుంజములు అంటే చక్కని పూల తీగలతో అల్లుకోబడిన పొదరిళ్ళు.

అలాంటి పొదరిళ్ళు ఆ పర్వత వనములలో వున్నాయి. ఆలాంటి పొదరింట్లో కూర్చోవడం అంటే అమ్మవారికి చాలా ఇష్టము."రంజిత శైల నికుంజ గతే" ప్రకాశిస్తున్న కొండల యందు వున్న పొదరిళ్ళ పొదలలో వుండటానికి ఉత్సాహ పడుతున్న తల్లి.పైగా ఆ పొదరిళ్ళు ఎలా వున్నాయి!!!

"మిళిత మిళింద మనోహర-గుంజిత"

కలిసిపోయి వచ్చినటువంటి తుమ్మెదలు అక్కడ గుంజిత అంటే ధ్వని చేస్తున్నాయి.

మనోహరమైన ధ్వనులు చేస్తున్నాయి.ఎందుకంటే ఆ పొదరిళ్ళలో పువ్వుల పై ఆశపడి తుమ్మెదలు వస్తున్నాయి. ఆ తుమ్మెదల ఝుంకారం తో ఉన్నాయట పొదరిళ్ళు. ఆలాంటి పొదరిళ్ళ లో అమ్మ వుండాలని ఉత్సాహం చూపిస్తోంది.

ఈ భావం చెప్పటంలో పొదరిళ్ళ ను మనం ఊహించు కోవచ్చు.మంచి కుసుమాలతో వున్నాయి.ఆ కుసుమాలపై తుమ్మెదలు సంచరిస్తున్నాయి.ఇది నిజానికి మరొక అద్భుతమైన భావం ఇందులో వుంది.

ఆ దివ్యమైన నికుంజము ఏమిటో కాదు, ఆ నికుంజము

"సహస్రార సరోజాత వాసితాయై నమః" అన్నట్టుగ అయితే సహస్రారమైనా కావాలి లేదా అనాహతమైనా కావాలి.అవి పొదరిళ్ళు లాంటివే. అక్కడ తుమ్మెదలు ఝుంకారం చేస్తున్నాయి అంటే,నాదం నిరంతరం ఎక్కడ యితే వ్యాపించి వుందో ఆ నాదాకాశము వ్యాపించినటువంటి దహరాకాశమే పొదరిల్లు.అలాంటి పొదరింటిలో

వుండటంలో ఆసక్తి, నిష్ఠ వున్నదంటే దహరాకాశ రూపిణి అయిన తల్లి అని చెప్పడం ఇక్కడ.

ఆకాశం అనగానే నాదమయం.ఎలాంటి నాదం అంటే, ఆ నాదం చిన్నాదము. "నాద బిందు కళామయము". అదే

దహరంలో వినబడే అనాహత నాదం.ఆ అనాహతనాదమయమైన పొదరింట్లో వుండే జ్యోతి స్వరూపం ఈ తల్లి.

అనగా హృదయాంతర్గతమైన చిత్ జ్యోతి అని చెప్పడం యోగపరంగా గ్రహించవలసిన అంశము.

అయితే రంజిత శైలము అనే మాటకు అర్థం ఏమిటంటే ఆనంద శైలము. రంజనము అంటే ఆనందము.ఆనందమయమైన శైలము.అమ్మ ఆనందగిరి లో వుంటుందిట.ఆనందగిరి అనే మాట చాలా విశేషము.ఆనందగిరి అనే భావము చాలా విశేషము.

నిజానికి హృదయమో లేక సహస్రారమో కావాలి కానీ ఆనందగిరి అంటే కైలాసమం అని అర్థము.కైలాసము అనే మాటకే ఏ దోషమూ లేని ఆనంద మయమైన ధామము అని అర్థం.పరమానంద ధామమే కైలాసము.అందుకు కైలాసానికి ఆనందగిరి అని పేరు.

అయితే కొన్ని పాఠాలలో రంజిత శైల బదులు రాజిత శైల అని కనబడుతున్నది.

రాజిత శైల అంటే ప్రకాశించే కొండ అని ఒక అర్థము. రజత శైలము అంటే వెండి కొండ అని ఒక అర్థము.ఆ వెండి కొండపై వున్న పూల పొదరిళ్ళ లో

తిరుగతున్నది తల్లి అంటే కైలాసంలో అమ్మ సంచరిస్తూ అక్కడున్న పూల పొదరింట్లో ఆడుకుంటోందట చెలికత్తెల తో కలిసి. ఈ భావము కూడా చూపించవచ్చు.అందుకే రంజిత శైలము అంటే కైలాస పర్వతము నందు సంచరిస్తున్నది.ఎలాగూ శైలపుత్రి కనుక వెండి కొండ లా మెరిసిపోతున్న హిమవత్ పర్వతాలలో సంచరిస్తున్నదని భావం కూడా సరిపోతుంది.ఎందుకంటే అమ్మను శైలసుతే అన్నారు కదా. హిమశైలము నందు,కైలాస శైలము నందు ఉన్నటువంటి పొదరిళ్ళలో సంచరించేటటువంటి వనదుర్గా దేవతకు నమస్కారము. 15rh slokam part 3

గత శ్లోకం14 లో తుమ్మెదలు హంసలు మొదలైనవి అన్నీ కూడా వన వాతావరణంలో వున్నవి వర్ణించటం జరిగింది.ఈ శ్లోకంలో కూడా కోయిలల గానములు, వాటితో పాటు తుమ్మెదల ఝుంకారములతో ఉన్నటువంటి ఆ దివ్యమైన వెండి కొండపై వున్న పూల పొదరిళ్ళు వర్ణించడం జరిగింది.నాదమయ స్వరూపంగా వున్న అమ్మవారిని చూపించటం జరుగుతోంది. ఈ శ్లోకంలో కూడా తుమ్మెదలు రావటం విశేషము ఏమిటంటే ఆ నాద స్వరూపాన్ని ఇక్కడ చెప్పటం ప్రత్యేకత.తుమ్మెదల ను నాద శక్తి కి సంకేతము గా ఇక్కడ చెప్పటం జరుగుతున్నది.అదే విధంగా హంసలు తుమ్మెదలు ఈ రెండూ కూడా నాదశక్తి ఒకటి యోగ దశ లో ఊర్ధ్వ గమనము వెళ్ళటానికి చెపుతున్నది మరొకటి.నాదశక్తి కి సంకేతం గా తుమ్మెదలు యోగ గతి లో ఊర్ధ్వ గమనమునకు సంకేతముగా హంసలు చెప్పబడుతున్నాయి.అందుకే యోగులకు కూడా హంసలు అని పేరు.అలాంటి యోగ శక్తి కి నాద శక్తి కి ఈ రెండిటి ద్వారా ఉపాసింపబడుతున్న తల్లి కనుక ఆ రెండింటినీ ఇక్కడ చూపిస్తున్నారు.పైగా వాద్య పరికరాలలో మురళీ

నాదాన్నే చెప్పడం జరిగింది. దీనికి కారణం ఏమిటంటే యోగంలో మురళీ నాదానికి వున్న ప్రత్యేకత వల్ల మురళీ నాదాన్ని ఇక్కడ ప్రస్తావించటం జరిగింది.

"కల మురళీరవ వాజిత కూజిత "

వాజిత అంటే వేగముతో కూడిన ఆ మురళీ రవం  వినపడుతూవుంటే

వెంటనే దానికి అనుగుణంగా కోకిల గానం వినబడుతున్నది.దీనికి తోడు తుమ్మెదల ఝుంకారములు ఇంకా అమ్మవారు అక్కడ వనదుర్గ గా సంచరిస్తున్న వైనం ఎలా వుందంటే

"మృగ గణ భూత-మహా శబరీ గణ-రింఖణ సంభృత-కేళియుతే"

15th slokam part 4

మృగ గణ భూత-మహా శబరీ గణ-రింఖణ సంభృత-కేళియుతే

ఇక్కడ వన దుర్గ  గా సంచరిస్తున్నప్పుడు అమ్మవారిని ఆశ్రయించి అనేకములైన గణములు వున్నాయట.అవి మృగ గణ,భూత గణ,మహా శబరీ గణములు. మృగ గణములు అంటే రకరకాల జంతు గణములన్నీ కూడా అమ్మను ఆశ్రయించి వనం లో సంచరిస్తూవున్నాయి.వన దుర్గా వైభవం ఇదంతా. మృగములు అంటే లేళ్ళు మొదలైన జంతువులు అన్నీ అమ్మను ఆశ్రయించి ఆ వనం లో సంచరిస్తున్నాయి.ఇక భూత గణములు వివిధములైన దివ్య ప్రాణులు ప్రమథులు మొదలైనటువంటి వారు

అక్కడ అమ్మవారి తో పాటు సంచరిస్తున్నారు.

ఇక మహా శబరీ గణ -శబరులు అంటే బోయ జాతికి చెందినటువంటి వారు, కిరాతజాతికి సంబంధించిన వారంతా కూడా సంచరిస్తూ ఉన్నారు. అంటే అమ్మ ఇక్కడ శబరీ రూపంలో వున్నది.ఇదీ ప్రస్తావన.శబరీ శబరుడు అనే స్వరూపములు ఉపాసనలో కనబడుతున్నాయి. .అక్కడ శబరుడు అంటే పరమశ్వరుడు.శబరీ అంటే అమ్మవారు.ఈ శబరీ శబరులు రూపంగా కిరాత స్వామి అరాధింప బడుతున్నాడు.పరమేశ్వరుడికి ఆది కిరాత రూపము వున్నది.ఈ ఆది కిరాత రూపాన్ని ధ్యానం చేస్తే

శత్రునాశనము కలుగుతుందని ఏ పీఢలు,వేదనలు మొదలైనవి లేకుండా ఉంటాయని శాస్త్రం చెపుతున్నది. అలాగే ఇక్కడ శబరీ స్తుతి గురించి శాస్త్రములందు,

కాళిదాసు మహాకవి తన శబరీ స్తుతి లో కూడా ఈ ప్రస్తావన చేసి వున్నారు.అంటే

ఒంటరిగా అరణ్యంలో చిక్కుకున్నప్పుడు, ఏదైనా భయంకరమైన పరిస్థితులు ఎదురైనప్పుడు శబరీ రూపంతో వున్న అమ్మవారి ని స్మరించుకోవాలి.అదే విధంగా శబర రూపంతో వున్న పరమేశ్వరుడు ని కూడాస్మరించుకోవాలి.వారి ఉభయులను స్మరించుకుంటే దుర్గమమైన ప్రాంతముల యందు క్షేమము లభిస్తున్నది.అలా ఇక్కడ శబరీ గణము తో కూడి యున్నది అంటే ఆవిడ మహాశబరి. ఒకే జాతి వాళ్ళ తో సంచారము చేస్తారు కనుక మహా శబరిగా శబరీ గణంతో వున్నది.

ఈ శబరులు జంతువులను తమ వశం చేసుకుంటారు.ఆ వేటాడటం రెండు రకాలు.హింసించటం ఒకటి వశం చేసుకోవడం ఒకటి .అలా వశం చేసుకున్న బృందములతో వివిధములైన భూత గణములతో కలిసి శబరీ గణం వెడుతూ వుంటే ఆ శబరీ గణానికి నాయకురాలుగా అమ్మవారు వెడుతూ వున్నారు. ఐతే ఈ తల్లి చుట్టూ చేరగానే వాళ్ళందరికీ ఉత్సాహం కలిగి రకరకాల నాట్యాలు చేస్తున్నారు వాళ్ళందరూకూడా.

15th slokam part 5

మృగ గణ భుత మహా శబరీ గణ

మూడు రకముల గణములు

"రింఖణ సంభృత-కేళియుతే" రింఖణము అంటే అవయవాలను ఒక లయబద్ధంగా కదలించటాన్ని రింఖణము అంటారు. అలాగ ఒక లయ బద్ధంగా శరీరపు అవయవాలను కదిలిస్తూ వాళ్ళు ఉత్సాహంగా ఆటలవలే కేళి ఒక లీలానృత్యాలను చేస్తూ వుంటే ఆ నృత్యాలను చూస్తూ ఆనందిస్తూ సంచరిస్తోంది వన దుర్గ.

ఈ విధమైన ధ్యానం వనదుర్గా ధ్యానం గా చెప్పబడుతుంది. ఇందులో మరొక ప్రత్యేకత ఏమిటంటే అమ్మను ఆశ్రయించిన గణములు

ఐదు రకముల గణములు.

1.మృగ 2..గణ 3. భూత 4.మహా 5. శబరి మొత్తం ఐదు గణములు ఉన్నాయి ఇక్కడ.

1.మృగములు అంటే జంతువులు.

2. ఇంక గణములు అంటే ప్రమథ గణములు ఇక్కడ తీసుకోవాలి.ఎందుకంటే అయ్యవారు అమ్మవారు చుట్టూ వుండేది ప్రమథ గణములే.వీళ్ళు సామాన్యులు కారు.వూరికే కొలుచుకునే పరివారం మాత్రమే కాదు.

వీరు దేవతలందరినీ కూడా శాసించగలిగే ప్రతాపశీలురు

'కర్తుం అకర్తుం అన్యధా కర్తుం మపి-సమర్ధాః ' అని శాస్త్రం చెపుతున్నది.

ఏదైనా చెయ్యగలరు, చెయ్యకుండా వుండగలరు.ఎందుకు చేశరని గానీ ఎందుకు చెయ్యలేదు అని కానీ ఎవరూ వీరిని అడిగేవాళ్ళు లేరు.అందుకని వీళ్ళు స్వతంత్రులు.వీళ్ళు ఒకదాన్ని ఇంకోవిధంగా మార్చివేయగలరు అటువంటి సర్వ సమర్థులు.ప్రకృతిలో వివిధ పరిణామాలు కలిగించే శివశక్తులే ఇక్కడ ప్రమథ గణములు గాచెప్పబడుతూ వుంటారు.

ప్రమథ అనే శబ్దమే విశేషమైన మార్పుల్ని తీసుకురాగలిగినటువంటి వారు అని

ఎవరినైనా సరే నిగ్రహించగలిగిన వారు ప్రమథులు.గణ అనే శబ్దానికి ప్రమథ అని అర్థం తీసుకోవాలి.

4.భూత అంటే పంచభూతములు మొదలైన ప్రకృతి సంబంధమైన సమూహము అంతా భూత శబ్దం తో చెప్పబడుతుంది.

5.ఇక మహా శబ్దం అంటే గొప్ప గొప్ప జాతుల్ని తెలియచేస్తుంది.దేవ జాతులు. దేవ,గంధర్వ,యక్ష,కిన్నెర, కింపురుష,అప్సరసలు, ఇత్యాది జాతులన్నీ కూడా మహా శబ్దం తో చెప్పబడుతున్నది.దివ్య జాతులు.

Copyright@gurujnanam.org

శబరీ గణము శబరులు అనగా ఆటవికులు మొదలైనవారు.ఇలాగ మొత్తం 5 రకముల గణములు ఇందులో చెప్పబడుతున్నాయి.

జంతు గణములు ప్రమథ గణములు భూత గణములు దేవ గణములు శబరీ లేక ఆటవిక గణములు. వీరందరికీ నాయకురాలుగా అమ్మ సంచరిస్తోంది.

దీనిలో ఉద్దేశ్యం ఏమిటంటే అమ్మను కొలిచినటువంటి వారు దేవతలు, ఋషులు మాత్రమే కాకుండా సామాన్యులు ఆటవికులు కూడా వున్నారు. అదే విధంగా మృగములు కూడా వున్నాయి. సర్వులకు జనని నాయకురాలు ఆవిడ.అందుకనే

భారతీయ సంస్కృతిలో అమ్మ వారి ఆరాధన అన్ని వర్గాలలోనూ వున్నది.ఇది గమనించి వలసిన ఒక ప్రధాన అంశం.మొత్తం ఈ దేశం లో హిమవత్ పర్వత ప్రాంతాలు మొదలుకుని సేతువు వరకు అనేక రకములైన రాష్ట్రములు వివిధ భాషలువారు,వివిధ సంప్రదాయాలు వాళ్ళు వున్నప్పటికీ అందరిలోనూ అమ్మ ఆరాధన వున్నది.

15th slokam part 6

ఒక్కక్కరిలో ఒక్కొక్క విధంగా ఆటవికులు కూడా వారికి తోచిన రీతిలో వారు కొలుచుకుంటూ వుంటారు. అలాగే జానపదులు మొదలయినటువంటి వారు గ్రామ దేవతలు ఇత్యాది రూపాలతో కొలుచుకుంటూ వుంటారు.బోనాల పండగలు,జాతరలు వీటితో అమ్మవారి ని ఆరాధించే వాళ్ళు కొందరు అయితే, ఉపాసనలు,మంత్రాలు,తంత్రాలు వీటితో ఆరాధించే వాళ్ళు కొందరు.ఇక్కడ ఆరాధనా పద్ధతులు మారినాయి కానీ అమ్మ మాత్రం వారి వారి పద్ధతులకు అనుగుణంగా వారితో కలిసి పోయి వారిని తనతో కలుపుకుంటూ

సంచరిస్తున్నది.అందుకే అమ్మ అందరికీ అమ్మ అన్నటువంటి విషయము ఇలాంటి చోట్ల మనకు కనబడుతున్నది.అదీ భారతీయ సంస్కృతిలో ఉన్న ప్రత్యేకత. అంకాలమ్మ,ఎల్లమ్మ,పోలేరమ్మ మొదలయిన గ్రామ దేవతలు మొదలుకుని దుర్గా లక్ష్మీ సరస్వతీ రాజ రాజేశ్వరి మొదలైన మహా దేవతల వరకూ అన్నీ అమ్మ రూపములే.అందుకు వివిధములైన గణములతో ,ఆటవికులతో కూడా అమ్మ సంచరిస్తున్నది.

"మృగ గణ భూత-మహా శబరీ గణ-రింఖణ సంభృత-కేళియుతే"

అంతేకాదు అమ్మవారి ఉత్సవాలు అమ్మవారి సంబరాలు ఊరందరికీ పండుగలు.అందుకే దసరా మొదలైన ఉత్సవాలు చేసినప్పుడు గ్రామే గ్రామే వనే వనే అనేటటువంటి మాట శాస్త్రము లో కనబడుతున్నది.ఇళ్ళల్లో మాత్రమే కాకుండా ప్రతి గ్రామములోనూ వనములలోనూ అని కూడా శాస్త్రము చెపుతున్నది. అంటే అడవుల్లో కూడా అమ్మ వారిని ఆరాధన చేస్తారు వారి వారి పద్ధతులకు అనుగుణంగా వివిధ నామాలు తో అమ్మవారి ని కొలుచుకుంటూ వుంటారు ఆటవికులు, జానపదులు. అలాగే గ్రామాల వాళ్ళు కూడా అమ్మ వారిని కొలుచుకోవడం మనకు కనబడుతూనే వున్నది.ఇక ఇళ్ళల్లో కూడా అమ్మవారిని ఆరాధిస్తూ వుంటారు.గృహే గ్రామే వనే మూడు ప్రాంతములందు కూడా ఆరాధన చెయ్యాలి. ఈ నవ రాత్రుల ఉత్సవాలలో అమ్మని ఆరాధించడం వల్ల అన్ని రకాల కష్టాలు కూడా తొలగిపోతాయి అని శాస్త్రము చెపుతున్నది. పైగా ఆరాధన వైభవాల్లో వివిధములైన నృత్యాలు , సంగీతాలు,తప్పెటలు,మొదలైన వాద్యములు మ్రోగించటం కూడా ఒక ప్రత్యేకత.

అందుకని అమ్మవారి ఉత్సవాల్లో వాద్యములకు ఒక ప్రత్యేకత వున్నది.అవి ఒక మంచి ఉద్వేగపూరితంగాను, ఉద్రేకపూరితంగానూ కూడా వుంటూ వుంటాయి.వివిధములైన వేషాలు వేసుకుని కూడా నాట్యం చేస్తూ వుంటారు. పులి వేషాలు మొదలైనవి అన్నీ కూడాను అమ్మవారి సంబరాల్లో చూడవచ్చు వివిధ ప్రాంతాల్లో ఇవన్నీ ఆ పులి వేషాలు వేయడం

మొదలైనవి అన్నీ కూడా "మృగ గణ భూత-మహా శబరీ గణ-రింఖణ సంభృత-కేళియుతే" అనే వాక్యంలో ధ్వనింప చేస్తున్నారు రామకృష్ణ కవి.ఈవిధంగా వివిధములైన రీతులతో నర్తన చేస్తున్నటువంటి వివిధ గణములతో సంచరిస్తున్నటువంటి ఆ తల్లి ఈ గణములకు నాయకురాలైన వన దుర్గా దేవి ని

ఇందులో చూపించటం జరిగింది.పైగా ఈ శబరీ స్వరూపాన్ని ధ్యానించినటువంటి వారికి అన్నివిధముల శతృబాధలు అనగా ప్రతికూలతలు తొలుగుతాయని శాస్త్రం చెపుతున్న విషయం. పైగా సంగీతం ఇక్కడ చెప్పటంలో

"కల మురళీరవ వాజిత కూజిత" ఇందులో మరొక ప్రత్యేకత ఏమిటంటే వేటగాళ్ళు అనేకరకాలు వుంటారు. అందులో వలవేసి పట్టేవాళ్ళు రకరకాల వ్యూహాలతో జంతువులను పట్టేవారు, ఏ జంతువుని ఎలా పట్టాలో తెలిసిన వేటగాళ్ళు వుంటారు. అందునా లేళ్ళు మొదలైన వాటిని పట్టేటప్పుడు వేణు గానం తో పట్టుకుంటారు.అందుకు ఆ వేణు గానములు పట్టుకున్న వేటగాళ్ళు కూడా ఈ శబరీ గణంలో వున్నారు. కనుక "కల మురళీరవ వాజిత కూజిత" అని చెప్పటంలో ప్రత్యేకత.

ఆ దివ్యమైన వేణువులు ధరించి వస్తూ వున్నారు శబరీ గణములు.ఆ వేణుగానం వింటూ వున్నది తల్లి కూడా. అందుకు వనదుర్గ దగ్గర శబరీ గణము చెప్పటంలో వున్న ప్రత్యేకత దీన్ని బట్టీ మనం తెలుసుకోవచ్చు.

ఈవిధంగా వనదుర్గ గ వున్నప్పుడు అడవుల్లో చాలా అలవోకగా హాయిగా తిరుగుతూ వుంటారు. అలవాటు లేనివాళ్ళు అడవుల్లో తిరగడం కష్టం కానీ అడవుల్లో తిరిగే అలవాటు అమ్మకు చాలా వుంది. ఎందుకంటే కొండలరాజు కూతురు పైగా కొండలరేడు అయినటువంటి ఆ పరమేశ్వరుడికి ఇల్లాలు. ఆయన గిరిశుడు,గిరీశుడు అని పేరు.అందుకే కొండలలో అలవోకగా హాయిగా అలవాటు గా తిరుగుతున్నటువంటి వనదుర్గ కు నమస్కారము.

****************************

16 th slokam part 1

అమ్మ వారి యొక్క సర్వోత్కృష్టత అనేది చూపిస్తున్నారు.

16)**కటితట పీత దుకూల విచిత్ర మయూఖ తిరస్కృత చంద్రరుచే**

**జిత కనకాచలమౌళి  పదోర్జిత-నిర్జరకుంజర కుంభ కుచే**

**ప్రణత సురాసుర మౌళిమణిస్ఫురదంశులసన్నఖ చంద్ర రుచే**

**జయ జయ హే మహిషాసుర-మర్దిని రమ్య కపర్దిని శైలసుతే**

ఇందులో ప్రతి పాదములోనూ  కూడా ఒకదానికంటే అమ్మవారు ఎలా మించిపోతున్నారు అనేది  చూపిస్తున్నారు.ఒక్కొక్క దానిలో ఒక్కొక్క వైభవాన్ని మించిపోయి వున్నటువంటి విశేషం చెప్పబడుతున్నది.

"కటితట పీత దుకూల విచిత్ర మయూఖ తిరస్కృత చంద్రరుచే"

అమ్మవారు ఆ నడుము కు కట్టినటువంటి  వస్త్రము పీతాంబరము అది భుజముల వరకు కూడా వున్నది ఆ విస్తారమైనటువంటి  పీతాంబరము.పైగా 'కటి తట' కటిని ప్రధానంగా బిగించి కట్టి పాదముల వరకూ వుంటూ ఆ పైకి కూడా పైఎదగా వున్నటువంటిది దివ్యమైన పీత దుకూలము.దుకూలము అంటే పట్టు వస్త్రము అని అర్థము.ఈ పట్టు వస్త్రము పచ్చటి కాంతులతో మెరిసి పోతోందట.పైగా విచిత్ర మయూఖము ప్రధానంగా పసిడి కాంతులు వున్నప్పటికీ కూడా రక రకాల తళ తళలు వున్నాయి ఆ దివ్యమైన వస్త్రములో.ఆ వస్త్ర కాంతులు ఎలా వున్నాయి అంటే

'తిరస్కృత చంద్ర రుచే' చంద్రుడి కాంతులను తిరస్కరిస్తున్నాయి. అంటే వెన్నెల ఎలా అయితే పచ్చగా తెల్లగా వుంటుందో ఆ తెల్లని పచ్చని వెన్నెల కాంతులను కూడా మించిపోయి ప్రకాశిస్తున్నది ఈ దివ్యమైన పీతాంబరము యొక్క  కాంతి.

16 th slokam part 2

"జిత కనకాచలమౌళి  పదోర్జిత-నిర్జరకుంజర కుంభ కుచే"

అమ్మవారి యొక్క దివ్యమైన వక్షస్థలాన్ని చెపుతున్నారు ఇక్కడ. ఎందుకంటే జగత్ పోషణ కర్త్రి అమ్మవారు.తన యొక్క దివ్యమైన ప్రాణశక్తి ద్వారా ప్రపంచాన్ని పోషిస్తున్నది.ఎలాగయితే ఒక తల్లి పిల్లవాడికి స్తన్యమును ఇచ్చి పోషిస్తున్నదో

సకల జగత్తుని సూర్య చంద్ర రూపమైనటువంటి దివ్యమైన వక్షోజములు ద్వారా అమ్మ పోషిస్తున్నది.ఇది శాస్త్రం చెపుతున్నటువంటి మాట.అలా దివ్య వక్షస్థలముతో సమస్త జగత్తుకు పోషణను ఇస్తున్న కన్నతల్లి.అందుకే సర్వ జగతీ కూడా సూర్యుడు నుంచి ప్రాణశక్తిని చంద్రుడు నుండి రస శక్తిని పొందుతున్నది.

ఆ చంద్రుడి యొక్క రస శక్తి ద్వారానే ఓషధులు మొదలైనవి కలుగుతున్నాయి. ఇక సూర్యకాంతి కిరణాలలో ప్రాణశక్తి ఎలాగూ పొందుతున్నాము.ఈ రెండిటి ద్వారా సర్వ జగత్తూ పోషింపబడుతున్నది.

కనుకనే విశ్వవిరాడ్ విగ్రహ అయినటువంటి అమ్మవారి యొక్క దివ్య వక్షస్థల స్థానము ఈ రమ్యమైనటువంటి సూర్య చంద్రులే అని శాస్త్రం చెపుతున్నటువంటి విషయము.అలా ఇక్కడ 'జిత కనకాచలమౌళి పదోర్జిత' ఆ దివ్య వక్షస్థలం ఎలా వున్నదంటే జిత అంటే జయించిన కనకాచలమౌళి బంగారు పర్వతము శిఖరాన్ని మించి ప్రకాశిస్తున్న అమ్మ వక్షస్థలము.పసిడి కాంతులతో వున్నటువంటి వక్షస్థలముతో వున్నది.వాటి యొక్క ఉన్నతత్త్వం కూడా"నిర్జరకుంజర కుంభ కుచే"నిర్జర కుంజర అంటే దేవగజములు దేవ జాతికి చెందిన గజము అంటే ఐరావతము అని అర్థము.ఐరావతము యొక్క దివ్యమైనటువంటి కుంభస్థలాన్ని మించిపోయి ప్రకాశిస్తున్నాయి అమ్మ యొక్క వక్షస్థలము. ఆవిధంగా పసిడి కాంతులతో ఉన్నటువంటి వక్షస్థలముతో జగతిని పోషిస్తున్నది. ఇది సకల విశ్వ పరిపోషణ అనేది స్వభావముగా కల తల్లి అని చెప్పటం ఇందులో వున్న ప్రత్యేకత.పోషణ కర్త్రీ అనే భావాన్ని చూపిస్తున్నారు.ఎందుకంటే ప్రాణదాయిని ఆ తల్లి అందుకు అమ్మవారికి "ప్రాణశక్తిః సరస్వతీ" అని విశ్వమంతా వ్యాపించి నడిపిస్తున్న ప్రాణశక్తి అమ్మవారు.అందుకే గాయత్రీ అనే పేరు కూడా తల్లికి

చెప్పబడుతూ వుంటుంది. గాయత్రి అనే మాటకు ప్రాణములను రక్షించు తల్లి అని అర్థము.సర్వ జగత్తునూ పోషిస్తున్నది ప్రాణదాయిని ముఖ్య ప్రాణంగా ప్రతి జీవుడిలో సంచరిస్తూ వుంటుంది ఆ తల్లి. అందుకు ఆ ప్రాణ స్వరూపిణిగా చెప్పడం ఈ శ్లోకంలో వున్నటువంటి ప్రత్యేకమైన వాక్యం.పైగా ఈ భావన శాస్త్రము యందే కాకుండా సామాన్యుల యందు కూడా వ్యాపించి యున్నది.అందుకే గాయత్రి ప్రాణశక్తి ప్రదాయిని అని మంత్ర భాష లో చెపితే సామాన్యుని భాషలో

బతుకమ్మ అని చెప్పబడుతుంది ఈ తల్లినే.బతుకమ్మ మనకు జీవశక్తి ప్రాణశక్తి ఆ తల్లే. ఆ మాటలోనే అంత చక్కటి తేటతెలుగు మాటలో అంత అద్భుతమైనటువంటి విషయాన్ని చెపుతున్నారు.

అలా సర్వ జీవుల్లోనూ  బతుకు రూపంలో చైతన్య రూపంలో వున్నటువంటిది ఆ తల్లి

16th slokam part 3

ప్రణత సురాసుర మౌళిమణిస్ఫురదంశులసన్నఖ చంద్ర రుచే

ఆమె వస్త్రము చంద్రకాంతిని మించిపోతూ వుంటే,ఆమె యొక్క దివ్య  వక్షస్థలము ఏనుగు యొక్క కుంభస్థలాన్ని బంగారు పర్వతాల శిఖరాలను మించిపోయి వున్నాయి.ఇక ఆమె పాదాల దగ్గిర వున్నటువంటి కాలి కొనగోళ్ళ కాంతులు ఎంత దివ్యంగా వున్నయో వర్ణిస్తున్నారు.

"ప్రణత సురాసుర మౌళిమణిస్ఫురదంశులసన్నఖ చంద్ర రుచే" దేవతలు అసురులు అందరూ కలిసి అమ్మవారికి నమస్కారం చేస్తున్నారు. ఎందుకంటే ప్రాణశక్తి ఎవరికి అఖర్లేదు!!! అందుకే అమ్మ భక్తుల్లో సురలు అసురులు కూడా వున్నారుట అక్కడ. నిజానికి అసుర సంహారము చేసారు అమ్మవారు.అయినప్పటికీ అసురులలో కూడాను మంచి వాళ్ళు వున్నారు. ఎందుకంటే రాక్షసులలో కూడా ఉత్తమమైనటువంటి సంస్కారములు వున్నవాళ్ళు ఉంటారు.బలి చక్రవర్తి, ప్రహ్లాదుడు మొదలైన ఉత్తమ రాక్షసులు వున్నారు. అలాగే బాణాసురుడు మొదలైన వాళ్ళు కూడా గొప్ప ఉత్తములు. అందుకు సుర అసుర ఉభయులు కూడా ఈ చెప్పటంలో ప్రత్యేకత ఏమిటంటే ఈ సమస్త విశ్వం లోనూ రెండు రకాల జాతులే ఉన్నాయట.అది సురజాతి అసుర జాతి అంటే దేవాసుర జాతి అని చెప్పబడుతున్నది.ఇవి ప్రధానం.అలాగే సర్వుల చేత ఆరాధింపబడుతున్నది అని చెప్పటం కోసమే "ప్రణత సురాసుర మౌళిమణిస్ఫురదంశు లసన్నఖ చంద్ర రుచే" అందరూ కూడా నమస్కరించేటప్పుడు కిరీట కాంతులు అమ్మ వారి పాదాల మీద పడుతున్నాయట తెల్లని అమ్మ కాలి గోళ్ళు ఆ కిరీట కాంతులు ఆ కిరీటాలపై వున్న మణుల కాంతులు పడటం చేత వివిధ వర్ణాలతో మెరిసిపోతున్నాయి. సహజంగా చంద్రకాంతులతో ఉన్నప్పటికీ కిరీట కాంతులు పడి వివిధ వర్ణములతో మెరిసిపోతున్నాయి.అలా మెరిసిపోతున్నటువంటి గోళ్ళతో వుండగా అనగా పదముల యొక్క నఖములతో ప్రకాశిస్తున్న అమ్మవారి స్వరూపాన్ని ఇక్కడ ఆవిష్కరించారు. ఇందులో మనం పరిశీలించినట్లయితే అమ్మ పాదములను చిట్ట చివరికి చూపించారు. అంటే ఆ పాద ధ్యానం ప్రధానం కనుక ఆ పాదముల యొక్క

కొనగోళ్ళ కాంతులు.ఇదే నమస్కారం చేసేటప్పుడు కూడా "నఖదీధితి సంఛన్న నమజ్జన తమోగుణా" అన్నారు. నమజ్జన నమస్కరించే టటువంటి జనులు. వారు తల వాల్చి నమస్కరించినప్పుడు ఆ తలలో వున్నటువంటి తమస్సు అంతా కూడా పోతుందట అమ్మ యొక్క కాలి వేళ్ళ గోళ్ళ కాంతులు సోకి.అటువంటి దివ్యమైన చరణాలతో వున్న మహిషాసుర మర్దినిని ఇక్కడ చూపించటం జరుగుతోంది.పైగా ఇక్కడ వివిధములైన కాంతులను అన్నింటినీ జయించుచున్నది అనే మాట మూడింటి లోనూ కనబడుతున్నది.

వస్త్రం తో చంద్రకాంతులను  జయించినట్లే ఇక్కడ కూడా 'ప్రణత సురాసుర మోళి' అని చెప్పడంలో దేవతల కంటే దానవుల కంటే అందరికంటే శ్రేష్ఠురాలు ఈ తల్లి అని చెప్పడం ఇక్కడ.  దేవతలు మనకంటే గొప్పవారు అంటే ఆ దేవతలు కూడా అమ్మని ఆశ్రయిస్తున్నారు  అని చెప్పడంతో దేవతలకు కూడా గతి అయిన తల్లి అనే భావం చెప్పి అమ్మ యొక్క ఆధిక్యాన్ని ప్రకటించారు

********************

17th slokam part 1 ఈ శ్లోకంలో వున్న గొప్పతనం ఉభయులూ పుత్రులతో వున్నటువంటి తల్లి.

17 )**భజిత సహస్రకరైక-సహస్రకరైక-సహస్రకరైకనుతే**

**కృత సురతారక సంగర తారక సాగర తారకసూను నుతే**

**గజముఖ షణ్ముఖ రంజిత పార్శ్వ సుశోభిత మానస కంజపుటే**

**జయ జయ హే మహిషాసుర-మర్దిని రమ్య కపర్దిని శైలసుతే**

ఈ శ్లోకంలో ప్రత్యేకత ఏమిటంటే అమ్మ అమ్మగా కనబడుతోంది.అంటే తన ఇద్దరి పిల్లలతో కనబడుతున్నది. తల్లి అని ఎప్పుడు అనగలము అంటే పిల్లలు తో కనబడినప్పుడు అనగలము.విశ్వమంతా ఆమెకు పిల్లలు ఆవిడ జగజ్జనని అయింది.అయినప్పటికీ ఆవిడకు చరిత్రలో ఇద్దరు పిల్లలు వున్నారు. వారు ఎవరయ్యా అంటే ఒకరు గణపతి ఇంకొకరు కుమారస్వామి

ఈ గణపతి కుమారస్వామి ఉన్న పిల్లల్ని ఈ శ్లోకంలో చూపిస్తున్నారు.పైగా ఇలా పిల్లలతో ఉన్న తల్లిని కానీ ధ్యానించినా నమస్కరించినప్పటికీ కూడా ఆ జగన్మాత యొక్క వాత్సల్యం పుష్కలంగా లభిస్తుందిట.అందుకే రుక్మిణీ దేవి కూడా తన వివాహ సమయంలో అమ్మవారిని కొలుచుకున్నప్పుడు భాగవతంలో శుక యోగీంద్రులు ఒక మాట చెపుతారు.అక్కడ భవానీ "భవపత్నీం స్వ సంతానయుతాం శివాం" చక్కని భర్త పైగా మృత్యుంజయుడు అయినటువంటి భర్త పిల్లలు ఇద్దరూ ఘటికులు జగత్తులో మంచి కీర్తి పొందినటువంటివారు.దేవతలను విశ్వమును శాశించే వాళ్ళు. సమర్థులైన పుత్రులు అంత గొప్ప భర్త తో ఆ కైలాసమనే ఆనంద ధామంలో సంచరిస్తున్న జగజ్జనని. ఎంత చక్కని కుటుంబమో కైలాస కుటుంబము.ఎందువల్ల అంత గొప్ప కుటుంబము అయిందంటే ఇంత గొప్ప ఇల్లాలు అక్కడ వుండండం వల్లనే అక్కడ అంత శోభ వచ్చింది. అందుకే ఇక్కడ గణనాథా షణ్ముఖ ఉభయులతో ఉన్నది.

"కుమార గణనాథాంబా తుష్టిః పుష్టి ర్మతి ర్ధృతిః" అనే భావం మనకు లలితా సహస్రనామాల్లో కనబడుతున్నది. అదేవిధంగా

మత్తేభ వక్త్ర షడ్వక్త్ర వత్సలాయై నమో నమః

అనే నామము లలితా దేవి అష్టోత్తర శత నామాలలో కూడా కనబడుతుంది.అలాగ ధ్యానించి ఆరాధించడం ఒక ప్రత్యేకమైన ఉపాసన ఇది.అలాగ ఈ శ్లోకంలో వున్న గొప్పతనం ఉభయులూ పుత్రులతో వున్నటువంటి తల్లి.

*****************************

17th slokam part 2

"భజిత సహస్రకరైక  సహస్రకరైక సహస్రకరైకనుతే"

ఇక్కడ 'సహస్రకరైక' అనే శబ్దములు మొత్తం మూడు మార్లు వచ్చింది.మూడు మార్లు మూడు రకాల అర్థాలు తీసుకోవాలి. సహస్రకరుడు అనగా వేయి చేతుల వాడు.పైగా ఏక అనే శబ్దం చెప్పటంలో ముఖ్యమైనవాడు అని అర్థం.వెయ్యి చేతులు కలిగిన ముఖ్యమైనవాడు.ఎన్న తగిన, ముఖ్యమైన పైగా ఎవరికీలేని లక్షణం వారికి మాత్రమే వుంటే ఏక  శబ్దం వాడాలి.వాడు ఒక్కడేనండి అంటూవుంటాము లోకంలో.

ఒక్కడు అనేది ప్రధానత్వాన్ని చెపుతున్నది. అందరిలోకి గొప్ప వాడు అని చెప్పడం విషయంలో కూడా ఏక శబ్దం వాడుతుంటారు.అందుకే అమరకోశం లో 'ముఖ్య అన్య కేవలాః'  అని ఏక శబ్దానికి మూడు రకాలైన ప్రయోగాలు చెప్పారు. ముఖ్యమైనది, కేవలమైనది. కేవలము అంటే ఎవరికీ లేదు అతనికి మాత్రమే  ఆ లక్షణం ఉంది అన్నప్పుడు ఏక శబ్దము ప్రయోగిస్తారు.దానిలో ముఖ్యభావంలో ప్రయోగించడం వున్నది.

అలా ప్రధానమైన లక్షణం కలిగినటువంటి వాళ్ళు ముగ్గురు వున్నారు. వాళ్ళలాంటివాళ్ళు మరొకరు లేరు. ముగ్గురకీ 'సహస్రకరైక' తగి వున్నది,కానీ ఎవరికి వారే ప్రత్యేకమైనటువంటివాళ్ళు.

అమ్మ వారిని అనేకమంది కొలుచుకుంటూ వున్నారు. ఇలా వివిధ దేవతల చేత కొలుచుకోబడుతున్న తల్లి అని చెప్పటంలో ఉద్దేశ్యం ఏమిటంటే సర్వ జీవులకు గతి ఈవిడ అని.సమస్త లోకములకు దిక్కైనది కనుకనే "త్రైలోక్యస్య  శరణ్యే" అని శాస్త్రం చెపుతున్నది."శరణ్యే త్రయంబకే గౌరీ" అంటున్నాము.సర్వ లోకములకు దిక్కైన తల్లి. శరణ్యురాలు ఆశ్రయస్థానము.అందుకే ఆవిడ్ని ఆశ్రయించిన వారిలో సహస్రకరులు ముగ్గురు వున్నారు. ఈ ముగ్గురు ఎవరికి వారే ప్రత్యేకం.ఏక శబ్దము ముగ్గురికీ వాడబడినది.

సహస్రకరైక  సహస్రకరైక సహస్రకరైక ఏక శబ్దం ముఖ్యత్వాన్ని చెపుతుంది.ఇందులో సహస్రకరైక ప్రధానమైన వెయ్యి చేతులవాడు ఎవరంటే సూర్యభగవానుడు. సూర్యుడు లాంటివాడు మరొకడు లేడు.ఆయన వేయి చేతులవాడు.వెయ్యి కిరణాల కాంతులతో  ప్రకాశిస్తున్నవాడు. ఇ సూర్య భగవానుడు నిరంతరం అమ్మ వారిని ఆరాధన చేస్తున్నాడు.

ఇది చెప్పటంలో ప్రత్యేకత అమ్మ వారి ఆరాధన లో ముఖ్యంగా సూర్యుడు, చంద్రుడు ఇత్యాదులు వున్నారు. సూర్యుడు ఉపాసించినటువంటి  విద్య కూడా వున్నది.

మను విద్యా,చంద్ర విద్యా వలనే సూర్యుడు ఆరాధించిన శ్రీవిద్య వున్నది.

Copyright@gurujnanam.org

అది "మార్తాండ భైరవారాధ్యా " అనేటటువంటి నామములో లలితా సహస్ర నామము చెపుతున్నది. మార్తాండ భైరవుడు అని సూర్యుడికి పేరు.అలా ప్రకాశిస్తున్న సూర్యుడు అమ్మ వారిని ఆరాధన చేస్తూ వుంటాడు.ఆ ఆరాధన ఫలితం గా సూర్య మండలంలో అమ్మ ప్రకాశిస్తున్నది.అనగా తన హృదయం లో ప్రకాశిస్తూ ఉన్న అమ్మవారిని సూర్యుడు ఆరాధన చేస్తూవుంటాడు.అందుకు సహస్రకరైక సూర్యుని చేత ఆరాధింపబడుతున్నది.

బాణాసురుడికి కూడా వెయ్యి చేతులు ఉన్నాయట.ఈయనొక ప్రత్యేకమైనటువంటి వాడు.ఇతడు శివ భక్తుడు.ఎటువంటి శివభక్తుడు అంటే శివ పరివారాన్నంతటినీ కొలుచుకున్నాడు.ఈ భక్తికి సంతోషించి శివుడు శక్తి మొదలైన వారందరూ కూడాను ఆ బాణాసురుడికి రక్షణను ఇచ్చారుట.అందుకు బాణాసురుడి చేత కొలుచుకోబడిన తల్లి అని రెండవ సహస్రకరైక కు అర్థం.

17th slokam part 3

ఇంక మూడవది సహస్రకరైక నుతే ఇది కార్త వీర్యార్జునుడు ని తెలియచేస్తున్నది.కార్త వీర్యార్జునుడు కూడా మహోపాసకుడు.పైగా సుదర్శనం యొక్క అంశ తో పుట్టినటువంటి వాడు.అందుకే అతను కూడా జగదంబ ను ఆరాధించాడు.దేవతలు,అసురులు ఆరాధించారని గత శ్లోకంలో చెప్పుకున్నాము 'ప్రణత సురాసుర మౌళి' అనే మాటలో అలా ఇక్కడ సూర్యభగవానుడు దేవతల కోటికి వస్తే,అసుర కోటికి చెందినటువంటి మహానుభావుడు బాణాసురుడు చెప్పబడ్డాడు, క్షత్రియులలో అనగా మానవ జాతికి హయ హయ్ చక్రవర్తి చెప్పబడినటువంటి కార్త వీర్యార్జునుడు.ఇలా ముగ్గురినీ చెప్పటంలో దేవ అసుర మానవ ముగ్గురి చేత నమస్కారించ బడుతున్నది.అంటే సమస్త జీవ చేత

ఆరాధింపబడుతున్నది. ఈ సృష్టి లో గొప్ప జీవులు ఈ ముగ్గురే.దేవతలు అసురులు తరువాత మానవులు.మిగిలిన వాళ్ళందరూ ఆ తరువాత చెప్పబడేవారే.పైగా మానవులమైన మనం చేస్తున్న స్తుతి లో మనకు పై వాళ్ళు మనకు సమానమైన వాళ్ళు అని చెప్పుకోవాలి.అందుకే ఇక్కడ దేవగణము,అసురగణము,మానవ గణము.వీరిలో గొప్ప వారిని చూపించారు.వారి చేత ఆరాధింపబడుతున్నది. పైగా ముగ్గురి లోనూ వెయ్యి చేతుల వాళ్ళు ఉన్నారు. దేవతలలో ఆదిత్యుడు వెయ్యి చేతులవాడు.

దేవతలందరికీ ఆదిత్యులు అని పేరు ఉన్నప్పటికీ సూర్యుడినే ఆదిత్యడు అంటాము. అందుకే ఆ మహానుభావుడ్ని మొదట పేర్కొన్నారు.

అటు తరువాత బాణాసురుడు.

బాణాసురుడుని చెప్పటంలో ఇతడు ఉత్తమమైనటువంటి రాక్షసుడు. దుర్మార్గం కానీ ముల్లోకాలను పీడించటంకానీ ఎక్కడా లేదు.గొప్ప చక్కని పాలనచేస్తున్నటువంటి ధర్మబద్ధమైన  మహాభక్తుడు ఇతడు.

కేవలం ఇతడు పరమేశ్వరుడితో యుద్ధం చేయాలనేటటువంటి  ఉబలాటం ఇతనికి వున్నది.కానీ ఏ రూపంతో తాను అనుగ్రహించాడో ఆ రూపంతో యుద్ధం చేయడు కనుక తన స్వరూపమైన కృష్ణుని చేత యుద్ధం చేయించాడు బాణాసురునికి.ఇది ఒక లీల మాత్రమే. ఇది శివకేశవ లీల.బాణాసురుడు ఉత్తమమైనటువంటి అస్త్రసిద్ధుడు, భక్తుడు.అందుకు ఉత్తమమైన రాక్షసుడినే ఇక్కడ పేర్కొన్నారు. కార్తవీర్యార్జునుడు సుదర్శనాంశ సంభూతుడు. దత్తాత్రేయుని యొక్క శిష్యుడు ఆ మహానుభావుడు.పైగా ప్రత్యేకమైనటువంటి ఉపాసనా బలం  కలిగినటువంటి

వాడు.అందుకు ముగ్గురినీ చెప్పారు ఇక్కడ.

17th slokam part 4

"కృత సురతారక సంగర - తారక సాగర తారకసూను నుతే"

ఇక్కడ తారక శబ్దం మూడు మార్లు

వాడబడినది. తారక అనే మాటకి మూడు రకాల అర్థాలు వున్నాయి. ఒకటి తారకాసురుడు అనే రాక్షసుడు. ఇంకొక శబ్దానికి తారక అంటే రక్షించుట అని అర్థము. ఇంకొక అర్థం లో దాటించుట అని అర్థం.ఇలా మూడు అర్థాల తో ఈ మూడు శబ్దములు .....'కృత సురతారక సంగర' సుర తారక అంటే దేవతలను రక్షించేటటువంటి యుద్ధం చేశాడు ఒకాయన.ఆయన ఎవరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి. దేవతలను రక్షించేటటువంటి యుద్ధం చేయటంలో నేర్పరి అయినటువంటి సుబ్రహ్మణ్యుడు. ఆయన చేసిన మహోపకారం ఏమిటంటే "తారక సాగర తారకసూను నుతే" తారకాసురుడు అనే రాక్షసుడిని మహా సముద్రాన్ని సులభముగా దాటించినటువంటి వాడు.

ఎందుకంటే తారకాసురుడుని జయించటం అనేది సామాన్యమైన విషయము కాదు. ఒక సముద్రాన్ని దాటటం ఎంత కష్టమో తారకాసురుడుని సంహరించడం అంత కష్టమైన పని.దేవతల వల్ల కాలేదు.అసలు అసురుల లో తారకాసురుడు వంటి అసురుడు లేడు.

అందుకే బ్రహ్మ దేవుడు అంటాడు నాకు తెలిసిన సృష్టిలో వీడ్ని సంహరించ గలిగే వాడు ఎవరూ లేరు అని.

Copyright@gurujnanam.org

బ్రహ్మ కు తెలియని సృష్టి నుండి ఎవరో రావలసి వచ్చింది.బ్రహ్మకు కూడా పైన వున్నటువంటి శివ శక్తుల ఏక స్వరూపం అయినటువంటి సుబ్రహ్మణ్యుడే దిగి రావలసి వచ్చింది.

పైగా ఇద్దరు పిల్లలు వున్నా ఒక వాక్యం అంతా సుబ్రమణ్యుడు గురించే ఎందుకు చెప్పారంటే,ఈ సుబ్రహ్మణ్యుడు కోసమే శివ పార్వతులు వివాహము జరిగింది కనుకనే. శివ శక్తుల ఏకత్వం సుబ్రహ్మణ్య తత్త్వం లో చాలా ఉత్కృష్టంగా సహజంగా కనబడుతున్నటువంటిది.ఆ కారణం చేతనే సుబ్రహ్మణ్య వైభవాన్ని ఒక పాదం అంతా చెప్పవలసి వచ్చినది.

"కృత సురతారక సంగర"

ఆయన ఏ యుద్ధం చేసినప్పటికీ కూడా దేవతలను రక్షించటం కోసమే యుద్ధం చేస్తాడు.ఆయన పేరే దేవసేనాపతి.అందుకే సుర తారక అని చెప్పడంలోనే దేవతలను రక్షించేటటువంటి యుద్ధం చేస్తున్నటువంటి వాడు.ఇక తారకాసురుడు ని సముద్రం తో పోల్చారు. సాధారణంగా లోకంలో. కూడా ఈ సంసారాన్ని దాటడం మహా కష్టం అని అంటూ వుంటారు.

ఎప్పుడూ సంసారాన్ని సాగరం తో పోలుస్తారు. అలాగే కష్టాల్ని కూడా సాగరం తో పోలుస్తారు. అంత తేలికగా దాటలేనిది అని చెప్పినప్పినప్పుడు సాగర శబ్దం ప్రయోగిస్తారు. అలాగే తారకాసురుడు శూర పద్మడు మొదలైనటువంటి భయంకరమైన రాక్షస యూధంతో వున్నాడు.వాడు ఒక్కడే కాదు.వాడికి అనుయాయులైనటువంటి మహా బలిష్ఠులు తపోబలం కలిగినటువంటి రాక్షసులు వున్నారు.   అలాంటి రాక్షస సమూహము అంతా ఒక సముద్రంలా వుంటే ఆ

సముద్రాన్ని అవలీలగా దాటించేశాడుట ఈ మహానుభావుడు.అంటే సులభంగా అసుర సంహారము చేసి రక్షించాడు.అలాగ దేవతలను రక్షించే యుద్ధం చేస్తూ తారకాసురుడు ని నశింపచేసినటువంటి పిల్లవాడి చేత స్తుతింపబడిన తల్లి. 'సూను నతే' అంటే పుత్రుని చేత నుతింపబడినది తల్లి అని అర్ధం.సుబ్రహ్మణ్య స్వామి అమ్మవారిని స్తుతించాడు. అందుకే సూనునుతే అనే మాటలో పుత్రుని చేత నుతింపబడిన తల్లి.ఆ పుత్రుడు ఎటువంటి వాడు అనేది ఇప్పుడు ముందు చెప్పిన విశేషములు..ఇందులో ప్రత్యేకత ఏమిటంటే తారకాసుర సంహారానికి వెళ్ళడానికి ముందు, అమ్మ వారు స్వయంగా జ్ఞాన శక్తి ఆయుధము ఇచ్చారుట సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి.శక్తి స్వరూపిణి అయిన ఆ తల్లే ఒక భల్లెము ఇచ్చిందిట.అది సామాన్యమైన భల్లెము కాదు.

శక్తి ధరుడు స్వామి.ఆయుధం పేరే శక్తి. ప్రధమో జ్ఞాన శక్త్యాత్మా అన్నట్లు గా జ్ఞాన శక్తి ఆయుధముట. అది పట్టుకుని వెళ్ళాడు.అది ఇచ్చింది సాక్షాత్తు జగదంబ.అమ్మని ఆరాధించి ఆయుధము పట్టుకుని వెళ్ళి యుద్ధం చేసి యుద్ధము లో జయం సాధించి వచ్చి మళ్ళీ అమ్మ వారిని నుతించాడు.అలాగ యుద్ధ పూర్వము, యుద్ధ అనంతరము కూడా అమ్మ వారిని నుతించాడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి.

17th slokam part 5

పైగా అతని పనే నిరంతరం అమ్మ వారిని ఆరాధించడము.

ఇక్కడ మళ్ళీ పైన సహస్రకరైక అన్నప్పుడు సూర్య విద్య  చెప్పినట్లే ఇక్కడ సుబ్రహ్మణ్య విద్య  చెపుతున్నారు. అమ్మవారి ఉపాసనా సంప్రదాయం లో 12 మంది మహానుభావులు చెపుతారు.అందులో సుబ్రహ్మణ్యుడు ఒకడు.కుమార సంప్రదాయము అని కుమారస్వామి ఉపాసించిన శ్రీవిద్యా విధానము వుంది.స్కంద విద్య అని చెప్పబడుతున్నది.ఆ విధంగా స్కందుడు చేత ఆరాధింపబడింది జగదంబ అని ఆ శ్రీ విద్యా విషయమైన అంశాన్ని స్ఫురింపచేస్తున్నారు రామకృష్ణ కవి.

***************************************

17 లో 6 పార్టు

ఇక తరువాత మూడవ పాదంలో

"గజముఖ షణ్ముఖ రంజిత పార్శ్వ సుశోభిత మానస కంజపుటే" పార్శ్వ అంటే ప్రక్కన అని అర్థం.అమ్మవారికి ఇరు ప్రక్కల గజముఖ షణ్ముఖ రంజిత పార్శ్వ ఇరుప్రక్కలు కూడా శోభిల్లుతున్నాయట ఎందువల్ల అంటే అటొక పిల్లవాడు ఇటొక పిల్లవాడు వున్నారు. రంజిత అంటే అందముగా శోభిల్లుతున్నాయి ఆ పార్శ్వ భాగములు పిల్లలతో.పైగా అందమైన పిల్లలు అద్భుతమైన పిల్లలు ప్రతాపము ప్రసన్నత  ప్రభావము కలిగినటువంటి పిల్లలు.

అటువంటి చక్కని కుమారులు వున్నారు. ఒకడు గజముఖుడు ఇంకొకడు షణ్ముఖుడు. ముఖాలు గురించే చెప్పారు. ఆయనది ప్రణవ ముఖము అయితే ఈయనిది పలు ముఖములు.షణ్ముఖ అనే శబ్దం లోనే అన్నివైపులా

చూడకల్గేటటువంటి ప్రజ్ఞ ప్రతిభ అని అర్థం.విశ్వతోముఖమైనటువంటి తత్త్వమే సుబ్రహ్మణ్యుడు. ఇంక ప్రణవ తత్త్వము

గజముఖము లో చూపిస్తున్నాడు.

మత్తేభ వక్త్ర షడ్వక్త్ర వత్సలాయై నమో నమః అనే మాటలో ఏ భావము వున్నదో అదే భావము ఇక్కడ వున్నది.

మత్తేభ వక్త్ర షడ్వక్త్ర అంటే ఏమిటో

గజముఖ షణ్ముఖ అన్నా అదే. ఇరువైపులా కూడా గజముఖ షణ్ముఖులతో కలసి వున్నటువంటి తల్లి.ఎప్పుడైతే పిల్లలు తో కూర్చున్నదో అమ్మ మనసు చాలా ఉల్లాసంగా వుందట.అందుకు ఇక్కడకు వచ్చేప్పటికల్లా సుశోభిత మానస కంజపుటే అన్నారు ఇక్కడ. ఆ పిల్లల తో కూర్చుని చక్కగా శోభిల్లుతున్న మనస్సు అనే పద్మము కలిగినది అన్నారు. అమ్మ మనస్సు పద్మంలాగా విచ్చుకున్నదిట.అమ్మ ముఖంగానీ మనస్సు కానీ ఎప్పుడు విచ్చుకుంటాయి అంటే పిల్లల్ని చూసి మురిసిపోతుంది ఆ తల్లి.

ఎప్పుడైనా తల్లి కి పిల్లల్ని చూస్తే చాలా ఆనందం.అందుకే అగజానన పద్మార్కం అన్నారు. అంటే అగజ అంటే పార్వతీ దేవి. ఆ పార్వతీ దేవి గణపతి ముఖం చూసిన వెంటనే ఆమె ముఖము పద్మం లా విచ్చుకుందట.అమ్మ ముఖాన్ని పద్మం లాగా వికసింప చేసినటువంటి గణపతిని సూర్యుడి తో పోల్చారు ఇక్కడ.అలాగ ఆమె మనస్సు ముఖము ఈ రెండూ కూడా పిల్లల్ని చూడగానే విచ్చుకుంటోంది.విచ్చుకోవడం అంటే ఆనందంతో పరవశించి పోతోంది అని చెప్పడం ఇక్కడ.అలా

"సుశోభిత మానస కంజపుటే" అటు కుమారస్వామి గణపతి నిలబడి వుండగా ఆ నడుము ఆ తల్లి వికసించిన మనస్సు తో పరవశించిపోతున్నదట.అంటే వాత్సల్య భావంతో ఉన్నది అక్కడ.ఆ మాతృ భావం అంతా ఉట్టి పడుతోంది ఆ గంధాన్ని షడానన సమేత అయినటువంటి జగదాంబ యొక్క సాక్షాత్కారం.అలాంటి వాత్సల్య భావంతో ఆనందం భావంతో వున్నది.ఇది వాత్సల్యానంద రూపిణి అయిన దుర్గాంబ యొక్క సాక్షాత్కారం.అందుకే అమ్మవారిని గణేశ జననీ దుర్గా అని ప్రత్యేకించి దేవీ భాగవతం చెపుతున్నది.ఆ గజముఖ షణ్ముఖ జనని అయిన దుర్గా దేవికి నమస్కరము. ****************************

పార్టు 1

18 )**పదకమలం కరుణానిలయే వరివస్యతి యోనుదినం స శివే**

**అయి కమలే కమలానిలయే కమలానిలయః స కథం న భవేత్**

**తవ పదమేవ పరం పదమిత్యనుశీలయతో మమ కిం న శివే**

**జయ జయ హే మహిషాసుర-మర్దిని రమ్యకపర్దిని శైలసుతే**

18అనేది పూర్ణ సంఖ్య. పైగా మహిషాసుర మర్దిని తల్లి యొక్క చేతులు కూడా 18.అందుకని పరిపూర్ణమైనటువంటి పూర్ణ సంఖ్య తోనే అమ్మవారి వైభవాన్ని ఆవిష్కరించటం జరుగుతోంది.ఈ శ్లోకంలో అమ్మ వారి ఆరాధనా ఫలం చెపుతున్నారు.ఒక విధంగా ఫలశృతి లాంటిది.

పదకమలం కరుణానిలయే వరివస్యతి యోనుదినం స శివే

శివునితో వున్నటువంటి శుభ స్వ రూపిణీ అని అర్థం.అంటే సాక్షాత్తు శివుని యొక్క పత్ని .ఈవిడ పేరు కూడా శివా.అందుకే శివే అనే సంబోధన మొదటి పాదం లో కనబడుతున్నది.

అనగా శుభ స్వరూపిణీ కల్యాణీ జగదంబికే నీయొక్క పాద కమలాలని ఎవరు అనుదినమూ అర్చన చేస్తూ వున్నారో వారు ధన్యులు అవుతున్నారు.వరి వస్యతి అంటే ఆరాధన.జగజ్జననీ నీ యొక్క పద కమలములను ఎవరు వరివస్యము చేస్తున్నారో పైగా ఎలాచెయ్యాలని అంటున్నారంటే అనుదినం ప్రతి రోజూ ఈవేళ పూజ చేసి మరిఎప్పుడో పూజచేశాము అని కాదు ఎడతెగకుండా ప్రతిరోజూ చేయడము అనుదినము.ప్రతిరోజూ మనం ఎలా అయితే భోజనం చేస్తామో ప్రతిరోజూ ఆరాధన చెయ్యాలి.నిత్యం చేసె భోజనం నిత్యం శరీరానికి ఎలా శక్తిని ఇస్తుందో నిత్యం చేసె ఆరాధన జీవుడికి ఆవిధమైన శక్తిని ఇస్తుంది.

అందుకే అనుదినం ఆరాధన అనేది భారతీయ సంస్కృతి ప్రతి వ్యక్తి కీ విధించిన గొప్ప విధానము.దాని బట్టి మానవుడు తరిస్తున్నాడు.అనుదినము అమ్మ వారిని ఆరాధన చెయ్యటం.పైగా ఎటువంటి తల్లిని అంటే కరుణానిలయే అని సంబోధన అంత గొప్పగా చేశారు.కరుణకు ఆధారమైన తల్లివి నీవు.కరుణ అమ్మ దగ్గర గూడు కట్టుకుంటుదట.

అందుకు అమ్మ లో కరుణ నివసిస్తున్నది స్థిరంగా.తరువాత అయి కమలే అంటే పద్మా అని లక్ష్మి స్వరూపిణి అని చెప్పటం, ఎందుకంటే మహిషాసుర మర్ధిని ప్రధానంగా లక్ష్మి స్వభావంతో చెప్పబడుతున్నది కనుక ఇక్కడ కమలే అనే

శబ్దం.అంతేకాదు కమలా అనే మాటకి మరో అర్థం 'కం బ్రహ్మాణం అలంకరోతి కమల' బ్రహ్మమును ఆనందింప చేయునది.

ఇక్కడ బ్రహ్మము అంటే సదాశివుడు అని.సదాశివ బ్రహ్మము ను అమ్మ వారు ఆనందింప చేస్తున్నారట.అందుకే ఆవిడ పేరు లలితా అని కూడా అన్నారు.

లాలనాత్ లలితా పరమేశ్వరుడి మనస్సు ని ఆనందింప చేస్తున్నది కనుక లలితా అని , అదేవిధంగా కమలే అంటే ఆ బ్రహ్మమును ఆనందింప చేస్తున్నది కనుక కమలే అనే శబ్దము.ఇక్కడ కమలా అనే శబ్దము మూడు మార్లు వచ్చింది.

అయి కమలే కమలానిలయే కమలానిలయః స కథం న భవేత్

కమలము నందు వున్నటువంటి ఓ కమలా అనగా లక్ష్మీ దేవి కమలంలో వుంటుంది.అలాగే మహిషాసుర మర్ధిని కూడా యుద్ధం చేసినప్పుడు సింహం పై వెళ్ళినా కూర్చున్నప్పుడు మాత్రం పద్మం లో వుంటుంది

పద్మం లో కూర్చున్నట్లుగా అమ్మను ధ్యానించమని మనకు ఆగమాలు చెపుతున్నాయి

అలాగ పద్మము నందు కూర్చున్నటువంటిది.

పద్మం లా వికసించి వుంది.పద్మం లో పద్మం లాగా వుందట.పద్మం ఎలా అయితే వికసించి శోభలతో వుంటుందో అలా వికసించినటువంటి కారుణ్యాది దివ్య గుణములతో అమ్మ ప్రకాశిస్తున్నది.అలా ప్రకాశిస్తున్నటువంటి కమలనివాసిని అయిన తల్లి.పద్మ నివాసిని అంటే పద్మము అని ఒక అర్థము హృదయ పద్మము అని మరొక అర్థము.

Copyright@gurujnanam.org

సహస్రార కమలంలో వున్నది అని మరొక అర్థము.హృదయ కమలము సహస్రార కమలము మహాపద్మాటవీ సంస్థా అన్నారు కదా అందుకే కమలా నిలయే అంటే సహస్రార కమలంలో వున్న తల్లి.

***************

పార్టు 2

పైగా చిట్టి చివరి శ్లోకాలలో కి వెడుతున్నాము కనుక ఆ సహస్రార కమలందాకా తీసుకువెళుతున్నారు.

పైగా అమ్మని ధ్యానించవలసినది హృదయ కమలము లో కనుక కమలానిలయే.

"కమలానిలయః స కథం న భవేత్" ఓ కమలా !!!హృదయ కమలంలో వున్న జగదంబా నిన్ను ఎవరైతే నిరంతరం ఆరాధిస్తూ వుంటారో వారు కమలానిలయుడు కాకుండా వుంటాడా !!! అన్నారు ఇక్కడ, ఆ మాట లో చమత్కారం ఏమిటంటే కమలా అంటే ఐశ్వర్య దేవత అని అర్థం.

ఐశ్వర్య దేవతకు అతడు నివాసం అయిపోతాడుట.

అమ్మ కరుణకు నివాసం అయినట్టే ఐశ్వర్యం అతనిలో నివాసం ఉంటుంది.అంటే అతడిని విడవకుండా ఐశ్వర్యం వుంటుంది అని చెప్పడం ఇక్కడ.

సమస్తములైన ఐశ్వర్యములు అతనికి సిద్ధిస్తాయి. లక్ష్మీ కృప సిద్ధిస్తుంది అని చెప్పటం ఇందులో వున్న భావం.

Copyright@gurujnanam.org

కమలా నిలయుడు అయిపోతాడు.అనగా లక్ష్మీ దేవి అతడిలో వుంటుంది.అనగా శరీరంలో వుండాలి,బయటా వుండాలి లక్ష్మి.

ఇంటినిండా ఐశ్వర్యం వుంటే ఏమి లాభం!!!?శరీరంలో కూడా ఐశ్వర్యం వుండాలి.ఆరోగ్యము,ఉత్సాహము,బలము,ఆనందము ఇవన్నీ లక్ష్మీ కళలు.అలా వాడిలో ఇవన్నీ వుంటాయి అని చెప్పడం ఇక్కడ భావము.

అందుకని అమ్మవారిని నిరంతరం ఆరాధించే వారికి ఐశ్వర్యాలు లభిస్తాయి.ఇది చెప్పే తీరు ఎలా ఉన్నదంటే

"కమలానిలయః స కథం న భవేత్ " అతడు ఐశ్వర్యాలకు నిలయుడుగా కాకుండా ఎలా వుంటాడు!!!? అని చెప్పడం లో విశేషం,అతడు అయి తీరుతాడు అని చెప్పడం.ఆ మాట చెప్పడంలో ప్రత్యేకత.పైగా ఒక ధీమా కనబడుతున్నది ఆ చెప్పే తీరులో.

"తవ పదమేవ పరంపద

మిత్యనుశీలయతో మమ కిం న శివే" అమ్మా

నీ పదమే పరమ పదము అని అనుశీలనము చేస్తున్నటువంటి నాకు ఇంక ఏమి కావాలమ్మా , ఇంకా ఏమి శుభం కావాలి ఇదే పెద్ద శుభం.ఈ మాట కూడా ఒక ధీమాతో చెపుతున్నటువంటి మాట ప్రశ్నార్థకము గా వస్తున్నది అందులోనే సమాధానము ఉన్నది నిశ్చితమైన అభిప్రాయము ఉన్నది.

నీ పదమే పరమ పదము అని,పరమ పదము అంటే సర్వోత్కృష్టమైన పరబ్రహ్మ స్వరూపము అని అర్థము.

నీ పదమే పరబ్రహ్మ స్వరూపమని అనుశీలనము చేస్తున్న నాకు ఇంక ఏం కావాలి తల్లి.ఇదే సమస్త శుభ స్వరూపము.ఇంక ఏం కావాలి తల్లి అనే మాట అనడం సామాన్యమా, సృష్టి లో ఏది కావాలన్నా ఇంకోటి కావాలని అనిపిస్తూ ఉంటుంది.

పైగా అమ్మ పాదాలు ఆశ్రయించిన వాడు పరిపూర్ణుడు అయిపోతాడు.

అది ఇందులో వున్న విషయము.ఎందుకంటే అమ్మ పాదములు పరబ్రహ్మ భావనతో ఆశ్రయించాలి.ఇదే సగుణ బ్రహ్మోపాసన అని చెప్పబడుతుంది.ఈవిధంగా ఉపాసించిన వాడు మోక్షాన్ని పొందగలడు.అందుకు అమ్మ పదమే పరమ పదము అని 'అనుశీలన' చేయుట. ఇందులో గొప్ప విశేషము ఏమిటంటే మొదటి పాదంలో "వరి వస్యతి యోనుదినం" ప్రతి రోజు పూజించుట అని చెప్పారు.ఇక్కడకు వచ్చేప్పటికల్లా "అనుశీలయతః" అన్నారు.అనుశీలించువాడు అని చెప్పారు.మొదట చెప్పేటప్పుడు 3rd person గ చెప్పారు.ఇక్కడ మూడవదానికి వచ్చేప్పటికల్లా ఉత్తమ పురుషః అంటే

తన వైపు నుంచి చెపుతున్నారు. తాను నిత్యము అనుశీలనము చేస్తున్నాను అని చెప్పాడు ఇక్కడ.నిరంతరమూ నీ పాదములనే పరమ పదము అని అనుశీలన చేస్తున్న నాకు ఇంకేమి కావాలమ్మా,, ఇదే పరమ శుభము. నాకు అంటె ఇది రచించినటువంటి కవి భక్తి తో చేసిన స్తోత్రం ఇది.అంతేకాని కవితా

శక్తులు, చమత్కారాలు, పాండిత్యాలు చూపించాలి అనేటటువంటి ప్రకటనతో చెయ్యలేదు ఆయన.

కేవలం భక్తి భావంతో నిష్కపటంగా చేశారు.అతని యొక్క భక్తి ఎలాంటిదీ అనేది ఈ వాక్యంలో స్పష్టం చేశాడు.అమ్మ పదములే పరమ పదములుగా అనుశీలన చేస్తున్నాడు."అనుశీలన" అనే మాట చాలా గట్టి మాట.శీలము అంటే స్వభావము.అనుశీలన అంటే ఎడతెగకుండా, నిరంతరం ఒక స్వభావముగా అమ్మ పాదాలను భావన చేస్తున్నాడు.అంటే మనసా ధ్యానం చేస్తూ , చింతన చేస్తూ, స్మరిస్తూ, ఆశ్రయిస్తూ.త్రికరణ శుద్ధిగా ,అలా మనస్సు తో నిరంతరం అమ్మ పాదాలను చుట్టబెట్టుకున్నాడు ఈ మహానుభావుడు.

అందుకే అనుశీలన అనే మాట వేశాడు ఇక్కడ.పైగా అనుశీలన అనేది మానసికమైనటువంటి ఆరాధన.ఇక "పరివస్యతి యోనుదినం"అన్నప్పుడు బాహ్యమైన ఆరాధన. మొదట చెప్పింది బాహ్యారాధన.ఇప్పుడు చెప్పింది భావారాధన.

బాహ్యంగా ఆరాధించే వాడికి అన్ని ఐశ్వర్యాలు వస్తున్నాయి.భావ నాత్మకంగా ఆరాధించేవాడికి మోక్షమే లభిస్తుంది.కనుక పరమపదం అన్నప్పుడు, పైగా ఇంకేమి కావాలి తల్లీ అంటే పరిపూర్ణత అనగా మోక్షము.అంటే అమ్మ పాదాల్ని ఆశ్రయించినవాడు, ఆరాధించేవాడు ఐహిక సుఖాలూ పొందుతున్నాడు, పరమపదాన్నీ పొందుతున్నాడు.

అనగా ఇహము,పరము,ఐహిక శుభములు,మోక్షము రెండూ లభిస్తున్నాయి. క్షేమము,మోక్షము రెండూ ఇస్తున్నాయి అమ్మ యొక్క చరణ భజనము అని

చెప్పడం ఈ శ్లోకం లో వున్న ప్రత్యేకత.అందుకే అమ్మ పాదాల్ని ఆశ్రయించిన వాడు ఇహము పరము లభిస్తున్నాయి అనేది ఆంతర్యము.

************************ 19 th slokam part 1-ఉప సంహారం శ్లోకాలు

19)**తవ వదనేందుమలం విమలేందు కలా సకలం నను కూలయతే**

**కిము పురుహూత-పురీందు ముఖీ-సుముఖీ భిరసౌ-విముఖీ-క్రియతే**

**మమతు మతం శివనామ-ధనే భవతీ-కృపయా కిముత క్రియతే**

**జయ జయ హే మహిషాసుర-మర్దిని రమ్య కపర్దిని శైలసుతే**

ఈ శ్లోకం లోని అద్భుతమైన భావాలు ముప్పిరి గొని చెప్పబడుతున్నాయి.అంటే ఒక మాటలో వేల శక్తులు కలిగిన భావజాలం చూపిస్తున్నారు రామకృష్ణ కవి.ఇవి ఏకాగ్రంగా కనుక పెట్టుకోగలిగితే ఆహా అనిపించే ఆశ్చర్యకరమైన ప్రతిభ కనబడుతుంది.

"తవ వదనేందు" అంటే అమ్మ వారి ముఖము నిండు చంద్రుడు వలే వున్నదిట.అలాంటి పూర్ణ చంద్రుడు వలే వున్న

ముఖము పై అర్ధచంద్రుడ్ని పెట్టుకుంది అమ్మ వారు.అది "విమలేందు కళా" నిర్మలమైన ఇందు కళట అది. కేవలం రేఖ గా కలిగినటువంటి ఆ  చంద్రకళ ను ధరించియున్నది."అనుకూలయతే" ఆశ్రయించి వున్నాడు చంద్రుడు కళా రూపంతో. అంటే చంద్ర బింబం పై చంద్రలేఖ అమ్మ ముఖం పూర్ణ చంద్ర బింబం లాగా వున్నది.పైగా వాళ్ళు ఆశ్రయించుకొని వున్నారుట అమ్మా నువ్వే దిక్కు

Copyright@gurujnanam.org

అని ఆశ్రయిస్తే అమ్మ కు జాలి కలిగి వాడ్ని నెత్తి మీద పెట్టుకుందట.భక్తుడు గా ఆశ్రయించిన వాడ్ని నెత్తిన పెట్టుకున్నది ఆవిడ.ఈ శోభ ఎలా వున్నదీ అంటే,ఈ చంద్రుడు దేవకాంతల చేత తిరస్కరింపబడ్డాడుట.

"పురుహూతపురీ ఇందుముఖీ"పురుహూతుడు అంటే ఇంద్రుడు. ఇంద్రుడు పురము అంటే స్వర్గము.

స్వర్గములో వున్న ఇందుముఖులు అనగా స్త్రీలు.స్త్రీలను సహజం గా ఇందు ముఖీ అంటారు.

ఇంద్రుడు లాంటి సౌందర్యవంతమైన ముఖము వుంటుంది కనుక స్త్రీలను ఇందుముఖీ అంటారు.కొందరు స్వర్గ లోక స్త్రీలు వాళ్ళు సౌందర్యానికి పెట్టింది పేరు.

అటువంటివారి ముఖము ముందు ఈయనగారి కళా తగ్గిపోయిందట.ఎందుకంటే చంద్రుడి ముఖం కంటే అందంగా వున్నాయి దేవకాంతల ముఖములు.

అందుకని వాళ్ల ముఖచంద్రుడి దగ్గర ఈ చంద్రుడు ఓడిపోయాడు. పరాభవముపొంది సిగ్గు తో ఒకవైపు అవమాన భారముతో అతడు చేసిన మంచి పని ఏమిటంటే అమ్మ వారి పాదాలను ఆశ్రయించాడు.సాధారణంగా పరాభవము కలిగినవారు అమ్మ ను ఆశ్రయించితే ఆ పరాభవము నుండి బయటపడుతారు.దేవతలు చేసిన పని కూడా అదే కదా

అసురులు చేత పరాభవింపబడి అమ్మ ను ఆశ్రయించి వాళ్ళూ ఉన్నతులు అయ్యారు.కనుక సృష్టి లో ఎవరైనా పరాభవము కానీ కలిగితే తిరిగి ఉన్నత స్థితికి రావాలంటే అమ్మవారి పాదాలను ఆశ్రయించాలి. ఇది తెలుసుకోవలసినది. కనుక ఉన్నతస్థితి కోసమని అమ్మవారి పాదాలను ఆశ్రయించాడు చంద్రుడు.

ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే దేవకాంతల ముఖము దగ్గరే అతను ఓడిపోయాడు. ఇక అమ్మ ముఖము ముందు అతడు నిలబడగలడా!!! అమ్మ దేవకాంతలను మించిన సౌందర్యవతి కదా, అలాంటిది అందుకే అమ్మ ముఖం దగ్గర పోటీ పడటం కాదు, అమ్మ పాదాల దగ్గర ఆశ్రయం పొందాడు. ఎప్పుడైతే ఆశ్రయించాడో అమ్మవారు చక్కగా నెత్తి మీద పెట్టుకున్నదట.

అప్పుడు దేవకాంతలు కూడా ఆశ్చర్యపోయారు. దేవకాంతలకు అంత గొప్ప గౌరవం లభించలేదు.చంద్రుడికి మాత్రం అంత గొప్ప గౌరవం లభించింది. ఆ పైన కళగా ధరించింది. అమ్మా నువ్వు ఇంత చక్కగా అతడ్ని అనుగ్రహించావు ఎందువల్ల నీ పాదాలను ఆశ్రయించటం వల్ల అంటే కాదు కాదు ఎందువల్ల నువ్వు అనుగ్రహించావో నాకు తెలిసింది అంటున్నాడు మూడవ పాదం లో

19.....2

"మమతు మతం శివనామ-ధనే భవతీ-కృపయా కిముత క్రియతే"

మమతు మతం అంటే నా అభిప్రాయం ప్రకారంగా "శివనామ-ధనే భవతీ-కృపయా కిముత క్రియతే" నువ్వు అతడ్ని ఆవిధంగా అనుగ్రహించటానికి కారణము అతడికి వున్న గొప్ప గుణం ఏమిటంటే "శివనామ-ధనుడు" అతడు.అనగా శివనామమే ధనముగా భావించేవాడు చంద్రుడు.

Copyright@gurujnanam.org

చంద్రుడు శివ భక్తుడు.ఆ కారణం చేతనే దక్షుడి చేత శాపం పొంది నిరంతరం కృశించిపోయే వ్యాధిని పొందాడు చంద్రుడు.ఆ వ్యాధి నుండి బయటపడటం కోసం శివారాధన చేశాడు.అప్పట్నుంచి నిరంతరం శివచింతన, శివ భక్తి వున్నది.

అప్పుడు శివుడు అనుగ్రహించి ఒక కళను ధరించి చంద్రశేఖరుడు అయ్యాడుట.

శివ భక్తుడైన కారణంగా నువ్వు అతడిపై దయ చూపించి ఆదరించావు అమ్మా అని చెప్పారు ఇక్కడ.అలా ఆదరించటానికి కారణం శివభక్తి.

అంటే ఎవరు శివభక్తుడో వాడ్ని అమ్మ నెత్తిన పెట్టుకుంటుంది.అంటే దాని అర్థం ఆశ్రయమును ఇస్తుంది,గౌరవిస్తుంది.అలా ఉన్నత స్థితిని ఇస్తున్నది.కనుక ఎవరు శివభక్తులో వాళ్ళకి అమ్మ దయ లభిస్తున్నది."చంద్రశేఖర భక్తార్తి భంజనాయై నమో నమః"అనే నామము మనకు వుంది.

శివభక్తులను అమ్మ అనుగ్రహిస్తుంది అనడానికి ఉదాహరణ ఆ చంద్రుడ్ని ఆవిధంగా ఆదరించడమే అనే భావంలో చూపిస్తున్నారు ఇక్కడ.ఇంత అద్భుతమైన భావంతో ఈ శ్లోకాన్ని అందించిన రామకృష్ణకవి కి నమస్కారము.
20 th slokam ఈ శ్లోకం లో సంపూర్ణ శరణాగతి తో అమ్మా నువ్వు నాపై దయ చూపించటం అనేది తప్పనిసరి

20) **అయి మయి దీన దయాళుతయా కృపయైకతయా భవితవ్యముమే**

**అయి జగతో జననీ కృపయాసి యథాసి తథాను గతానురతే**

**యదుచితమత్ర భవత్యురరీ కురుతా-దురుతాపమపా-కురుతే**

**జయ జయ హే మహిషాసుర-మర్దిని రమ్య కపర్దిని శైలసుతే**

ఈ శ్లోకం లో సంపూర్ణ శరణాగతి తో అమ్మా నువ్వు నాపై దయ చూపించటం అనేది తప్పనిసరి.పైగా  దయ చూపించక పోతే గొప్పగా చెప్పుకోవాలేమో కానీ నువ్వు దయ చూపించితే అది ఆశ్చర్యపోవలసిన విషయము కాదు.దయ చూపించటం నీ స్వభావము.

దయ చూపించి తీరవలసినదే అని చాలా రమ్యమైనటువంటి భక్తిని ప్రకటిస్తున్నారు.

అయి శబ్దము రెండు మార్లు వస్తున్నది."అయి అంటే అమ్మ ను పిలిచేటటువంటి పిలుపులో వున్న ఆర్ద్రత"

"అయి మయి దీన దయాళుతయా"

ఓ తల్లీ నా యందు నువ్వు దయ చూపించావు అంటే అది అంతే చూపిస్తావు.ఎందుకంటే అది భవితవ్యము.అది జరగవలసినదే. ఎందుకంటే నీ స్వభావము అలాంటిది తల్లీ.

"దీన దయాళుతయా" దీనులపై దయ చూపించటం అనే నీ స్వభావం చేత నీ దయ నాపై లభించింది.

ఉమా అని సంబోధన చేశారు ఇక్కడ.అమ్మ నామాలలో ఉమా నామానికి ఉన్న ప్రత్యేకత చాలా విశేషమైనది.అందుకు శివే ఉమే అను రెండు శబ్దములు ఇక్కడ చివరి పద్యాలలో సంబోధించారు.

Copyright@gurujnanam.org

Sri Gurubhyo Namaha

ఉమా అనే నామము చివరికి గానీ అంటేట ఏవయినా  తెలిసి తెలియని దోషాలు పోతాయి అందుకే ఇక్కడ ఉమె అని  సంబోధన చేసి

"అయి జగతో జననీ" సర్వ జగతికి జనని అయిన ఓ తల్లీ

"కృపయాసి యథాసి తథా" ఈ మాటలో గొప్పతనం ఏమిటంటే నీ దయ ఎలా వుండాలో అలా వుందమ్మ.అంటే నాపై నువ్వు దయను చూపించటం ఇది అబ్బుర పడాల్సిన విషయం కాదమ్మా

అది ఎలా వుండాలో అలా వుంది.ఎందుకంటే  చంద్రుడు తెల్లగా చల్లగా వుంటాడు అనేది అతని స్వభావం అది.అంతేకాని చంద్రుడు ఎర్రగా వుంటాడు అనేది పెద్ద news గా చెప్పుకోవాలి.కానీ చంద్రుడు తెల్లగా చల్లగా వుంటాడు అనేది ఎప్పుడూ వున్నదే.అలాగే సూర్యుడి కాంతి తీవ్రంగా వుంటుంది అంటే ఎప్పుడూ వుండేదే.అది కొత్తగా చెప్పుకోవలసినది ఏముంది!!!అగ్ని మండుతున్నది,జ్వలిస్తున్నది అంటే

అది చల్లగా వుంటే చెప్పుకోవాలికానీ అగ్ని వేడిగా వుంటే చెప్పుకోవాలా!!!

అది "యథాసి తథాసి" అది ఎలా ఉండాలో అలా వున్నది.అందుకు నీ దయ కూడా "కృపయాసి యథాసి తథాను గతానురతే" నువ్వు ఎలా వుండాలో అలాంటి దయతో వున్నావమ్మ.అంటే నీ స్వభావము లో ఏ మార్పూ లేదు.దయ చూపించటం నీ స్వభావము కనుకనే దీన దయ నీ దగ్గర వున్నది కనుకనే దీనుడనైన నా యందు దయ చూపిస్తున్నావు.అంటే అమ్మ దయ పొందాలంటే మనకు దీనత్వం వుండాలి.దీనత్వం అంటే అహంకార రాహిత్యము అని అర్థము.

"యదుచితమత్ర భవత్యురరీ కురుతాత్"

Copyright@gurujnanam.org

అమ్మా ఏది ఉచితమో దానిని పెంచమ్మా , దానిని వృద్ధి చెందించు.

అమ్మ ను ఏమి అడగాలో ....

యద్ ఉచితం అత్ర భవతీ ఉరరీ కురుతాత్

"ఉరరీ కురుతాత్" అంటే పెంపొందించెదవు గాకా అని అర్థము.వృద్ధిచెందింతువు గాకా అని అర్థము.దేన్ని వృద్ధి చెందించాలి నాకు ఏది క్షేమమో దానిని వృద్ధి చెందించు అని ఇది అడగాలి. అంతేకానీ మనకు మనమే ఏదో క్షేమము అనుకుని దాన్ని పెంపొందించు అని అమ్మని demand చెయ్యటం కాదు ఇక్కడ.

ఎందుకంటే మనకు ఏది ఉచితమో మనకు తెలియదు.ఉచితము అంటే తగినది అని అర్థము.మనకు ఏది తగినదో మనకు తెలియదు.ఎందుకంటే మనది పరిమితి జ్ఞానము."యథా యోగ్యం తథా కురు" అని అంటారు శంకర్ భగవత్పాదులవారు.నాకు ఏది యోగ్యమో అది చెయ్యమ్మా అంతే చాలు.ఎందుకంటే అమ్మ తనను ఆశ్రయించిన వారికి ఏది యోగ్యమో అది చేస్తుంది.

మనకంటే జగజ్జనని కి మన గురించి బాగా తెలుసు.ఈ విషయం మనకు తెలిస్తే చాలు.మనం ధన్యులమైపోతాము.అలా ఆశ్రయించాలి.అందుకే *యద్ ఉచితం అత్ర భవతీ ఉరరీ కురుతాత్"ఏది నాకు ఉచితమో దాన్ని వృద్ధి చెందించు తల్లీ.అంతేకాదు మరొక కోరిక ఏమిటంటే

"ఉరు తాపం అపాం కురుతాత్" నా యొక్క తీవ్రమైన తాపములు పోగొట్టు.ఒకటి నాకు ఉచితమైనది పెంపొందించు నాకున్న తాపాన్ని పోగొట్టు అని ఈ రెండు విధములైన కోరికలు చెప్పారు.ఇష్టం కోరుకోవటం అనిష్టాన్ని

Copyright@gurujnanam.org

తొలగించమని అడగటం.ఆ చెప్పే తీరు ఇంత గొప్పగా వున్నది.రెండింటిలోనూ కూడా అహంకారము లేకుండా శరణు వేడి నీ ఇష్టము తల్లీ అనేటటువంటి సమర్పణా భావాన్ని చూపిస్తున్నారు.ఈ రెండు శ్లోకములలో  అమ్మ యొక్క కారుణ్యాన్ని చూపిస్తున్నారు.

********************

ఫలశ్రుతి:---

21)**స్తుతి మితి స్తిమితస్తు సమాధినా నియమితో యమితోనుదినం పఠేత్**

**పరమయా రమయా సతు సేవ్యతే పరిజనోపి జనోపిచతం భవేత్**

అమ్మా నిన్ను సేవించేవారు ధన్యులు అవుతున్నారు.ఈ స్తోత్రాన్ని  "సమాధినా నియమితో యమితోనుదినం పఠేత్" సమాధితో స్థిమితంగా ఎవరు చదువుతున్నారో సమాధి అనే మాటకి ఇక్కడ చిత్తము శాంతముగా వుంచుకొని ఏకాగ్ర చిత్తము తో ఎవడు అనుదినము నిత్యము ఈ స్తోత్రాన్ని పఠిస్తాడో  వాడికి పరమయా రమయా  గొప్పదైనటువంటి సంపద లభిస్తుంది.పైగా అతడికి  సేవక జనములే కాక ఇతరులు కూడా సేవకులై కొలుచుకుంటారు.అతడి దగ్గర ఆశ్రయించుకొని పరిజనులు ఎలాగూ వుంటారు, వారు కాకుండా ప్రతి వారూ అతనికి సేవకులు వలే అనుకూలురు అయిపోతారు.అందుకే  మహిషాసుర మర్దిని స్తోత్రం చదివిన వారికి పరమమైన ఐశ్వర్యం లభిస్తుంది.అందరూ అనుకూలిస్తారు అనేటటువంటి భావాన్ని ఫలశ్రుతి లో చెపుతూ చిట్ట చివరిగా రచించిన కవి పేరు చెప్పబడిన శ్లోకం

********************

Copyright@gurujnanam.org

రచించిన కవి పేరు చెప్పబడిన శ్లోకం

2)రమయతి కిలకర్షన్నేష చిత్తం నరాణాం

అపరజ పరమస్మాద్ రామకృష్ణ కవీణామ్

అకృత సుకృత గమ్యం రమ్యపద్యైక హర్మ్యం

స్తవన మవన హేతుం ప్రీతయే విశ్వమాతుః

ఇది సర్వ జనులను ఆకర్షించే స్తోత్రము అని ఆయన చెప్పారు.అలా ఆకర్షణ లక్షణం వుంది. పైగా "అపరజ పరం"

రజో గుణానికి ఆవల వున్నటువంటిది. అనగా సమస్త లౌకిక వికారాలకీ ఆవల వున్నటువంటి పరమ పదమైన జగజ్జనని ని కీర్తించినది.ఈ శబ్దం లో తురీయ గాయత్రీ యొక్క రహస్యాలు వున్నాయి

అలాంటి దివ్యమైన పుణ్యాత్ములు మాత్రమే పఠించగలిగేటటువంటి శ్లోకములు అమ్మవారు నివసించటానికి చక్కని మేడవలే నిర్మాణం చేశాడు రామకృష్ణకవి.ఈ 'స్తవనం హవన హేతుం' రక్షించటానికి తగినది.ఈ స్తోత్రము ద్వారా ప్రీతయే విశ్వ మాతుః అమ్మ ప్రీతి చెందు గాక

సర్వం శ్రీ జగదంబ చరణారవిందార్పణమస్తు

Copyright@gurujnanam.org